ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


భారత్– అమెరికా వాణిజ్య ఒప్పందం వ్యతిరేకిస్తూ రైతుల మోటార్‌సైకిల్ ర్యాలీ

వాంగ్‌చుక్ నిరాహారదీక్షను విస్మరించడం క్రూరం

బిజెపితో రహస్య చర్చలేమీ లేవు : సుప్రియా సూలే

07


సంపుటి 09, సంచిక: 226 | గురువారం | 16-07-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


రాష్ట్రంలో ‘సర్’

## గడువు పొడిగింపు



- ఆగస్టు 3 వరకు ఇంటింటి సర్వే
- అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితా విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఈ మేరకు సవరించిన నూతన షెడ్యూల్‌ను బుధవారం ఈసి అధికారికంగా విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించిన ఎన్నికల సంఘం, ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. తాజా ఉత్తర్వుల ప్రకారం బూత్ స్థాయి అధికారుల ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 3 వరకు పొడిగించారు. నూతన తరువాయి 8లో

# పేర్ల తొలగింపునకే...

- ‘సర్’ ప్రక్రియపై మాజీ సిఇసి ఎస్‌వై ఖురేషీ తీవ్ర అసహనం
- స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు ఆటంకం కలిగి ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లిందని విమర్శ



**న్యూఢిల్లీ :** కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ‘సర్’ ప్రక్రియపై మాజీ సిఇసి ఎస్‌వై ఖురేషీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ ప్రధానంగా ఓటర్ జాబితాలో పేర్ల తొలగింపు పైనే దృష్టి సారిస్తోందని ఆరోపించారు. సర్ వల్ల స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు ఆటంకం కలిగి ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లిందని విమర్శించారు. వీలైనన్ని ఎక్కువ పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగిస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియలో తొలగింపులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. ఓటరుగా నమోదు చేసుకోవడమనేది ఒక రాజ్యాంగపరమైన హక్కు అని, కానీ ఎన్నికల సంఘం ప్రజలకు ఏదో ఉపకారం చేస్తోందన్నట్లుగా పరిస్థితిని సృష్టిస్తోందని పిటిఐ వీడియోస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఖురేషీ వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితా సవరణ కోసం చేపట్టిన ఈ ప్రత్యేక ప్రక్రియ (సర్) జరుగుతున్న తీరు అన్యాయంగా ఉందని మాజీ సిఇసి ఖురేషీ అన్నారు. ‘ఎస్‌ఐఆర్ ప్రధానంగా ఓటర్ల పేర్ల తొలగింపుపైనే దృష్టి పెడుతోంది. ఓటర్ జాబితా నుంచి ఎంత మంది పేర్లను తొలగించగలమన్నదే వారి ప్రధాన ధ్యాసగా కనిపిస్తోంది. అయితే ప్రస్తుత ఎస్‌ఐఆర్ ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బందికి నాదొక సూచన. ఓటరు పేరు స్పెల్లింగ్, వయసు, అడ్రస్‌లో చిన్నపాటి తప్పులు ఉన్నప్పటికీ వారు సరైన వ్యక్తేనని మీకు తెలిస్తే ఆ తప్పులను పట్టించుకోవద్దు. తద్వారా ఏ ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా చూడాలి. ఓటర్ జాబితా నుంచి వీలైనన్ని ఎక్కువ పేర్లను తొలగిస్తే మంచి మార్కులు వస్తాయన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కోట్లాది మంది పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించడంతో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు ఆటంకం కలిగింది.‘ అని ఖురేషీ పేర్కొన్నారు. ‘నేను సిఇసిగా ఉన్నప్పుడు ఎస్‌ఐఆర్ ప్రక్రియ చాలా స్పష్టంగా ఉండేది. ప్రతి ఏటా ఓటరు జాబితాను సవరించే ప్రక్రియను చేపట్టేవాళ్లం. 2002–2003లో బిహార్‌లో చివరిసారిగా ఎస్‌ఐఆర్ చేపట్టిన తర్వాత, ఓటర్ల జాబితాలు కంప్యూటరైజ్ అయ్యాయి. దీంతో ఇకపై తరువాయి 8లో




భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి

# అమెజాన్ డేటా సెంటర్ తొలిమెట్టు

- లక్ష్యం నెరవేరాలంటే పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉద్యోగ అవకాశాల కల్పన అవసరం
- ఫ్యూచర్ సిటీలో ప్రపంచంలోనే ఫార్చ్యూన్ 500 కంపెనీల పెట్టుబడులను ఆహ్వానించాలని నిర్దేశించుకున్నాం
- హైదరాబాద్‌ను కాలుష్యరహిత సుస్థిర మహానగరంగా తీర్చిదిద్దేందుకు ప్రోత్సాహకాలిస్తున్నాం
- డేటా సెంటర్ శంకుస్థాపనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్/రంగారెడ్డి

దేశంలో 2.5 శాతం జనాభా ఉన్న తెలంగాణ ప్రస్తుతం దేశ జిడిపికి 5 శాతం మేరకు తోడ్పాటును అందిస్తోంది. 2047 నాటికి 10 శాతం మేరకు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం’ అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వివరించారు. లక్ష్యం నెరవేరాలంటే అందుకు పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉద్యోగావకాశాల కల్పన అవసరమని, ఆ దిశగా లక్ష్యాలను నిర్దేశించుకుని తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామని, ఈ విజన్ రూపకల్పనలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో పాటు జాతీయ, అంతర్జాతీయ నిపుణుల సహకారం తీసుకున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ‘తెలంగాణ రైజింగ్–2047 విజన్’లో భాగంగా 2034 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే దిశగా తెలంగాణ ప్రయాణం ప్రారంభమైందని ప్రకటించారు. ప్రపంచంలోనే ఒక అద్భుతమైన నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మించాలన్న సంకల్పానికి అమెజాన్ నెలకొల్పుతున్న డేటా సెంటర్ తొలి మెట్టుగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశంలోనే ఒక అభివృద్ధి చెందిన మోడల్ రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టడంలో అమెజాన్ భాగస్వామిగా నిలిచి 2034 నాటికి లక్ష కోట్ల రూపాయల తరువాయి 8లో

విద్యలో రాణించకపోతే

## క్రీడల్లో రాణించాలి

గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేనందునే ప్రైవేటు వైపు మొగ్గు : సిఎం రేవంత్‌రెడ్డి

12

గోల్కొండలో నేడు

## తొలి బోనం

ఆగస్టు 13 వరకు ఆషాడ బోనాల ఉత్సవాలు రూ.20 కోట్లతో ఘనంగా ఏర్పాట్లు

10

# మరో తొమ్మిది యూరియా ప్లాంట్లు



- కోటి టన్నుల ఉత్పత్తికి జాతీయ పెట్టుబడుల విధానం
- దిగుమతులపై ఆధారపడకుండా ఇక పూర్తి స్వయం సమృద్ధి
- సెమీకండక్టర్లు,సొంత మొబైల్ బ్రాండ్ల అభివృద్ధికి రూ.1.90 లక్షల కోట్లు
- రూ.25,500 కోట్లతో వారణాసికి రెండు హైవే ప్రాజెక్టులు
- కేంద్ర మంత్రివర్గం తీర్మానాలు

**న్యూఢిల్లీ :** దేశ రైతులు అత్యధికంగా ఉపయోగించే యూరియా ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడంకోసం ఒక కొత్త జాతీయ పెట్టుబడుల విధానానికి (ఎన్‌ఐపి) కేంద్రమంత్రివర్గం బుధవారం ఆమోదం తెలియజేసింది. దీనివల్ల యూరియా దిగుమతులపై ఆధారపడకుండా దేశం పూర్తి స్వయంసమృద్ధి సాధిస్తుంది. అదేవిధంగా దేశంలో రెండో విడత సెమీకండక్టర్ల వ్యవస్థను విస్తరించడం, దేశీయ భారత్ మొబైల్ ఫోన్ బ్రాండ్ల ఉత్పత్తులు విడుదల చేయడం ద్వారా ప్రపంచ ఎలక్ట్రానిక్స్ కేంద్రంగా భారత్ స్థానాన్ని సుస్థిరం చేసేందుకు రూ.1.90 లక్షల కోట్లతో రెండు కార్యక్రమాలు చేపట్టేందుకు కూడా కేంద్రమంత్రివర్గం ఆమోద ముద్రలు వేసింది. ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్‌ఎం–1.0)కు కొనసాగింపుగా తాజా నిర్ణయం ద్వారా 2.0 సెమీకండక్టర్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళతారు. అదేవిధంగా భారత్ మొబైల్ బ్రాండ్ల ఉత్పత్తి పథకం కింద 2030–31 నాటికి 60,000 ప్రత్యక్ష ఉద్యోగాల సృష్టితోపాటు 15 లక్షల కోట్ల ఎగుమతులను దేశం సాధిస్తుంది. కాగా దేశంలో యూరియా స్వయంసమృద్ధి తరువాయి 8లో

బిఐఇ రిజిస్ట్రేషన్, అఫిలియేషన్

# ఇక కఠినం

- జూనియర్ కళాశాలలు దరఖాస్తుల బాధ్యత ఇంటర్ విద్యాధికారులదే
- ఇప్పటికీ దరఖాస్తు చేసుకోకుండా నిబంధనలు ఉల్లంఘించిన కళాశాలలకు నోటీసులు
- ప్రత్యేక కోర్సులు నిర్వహించే కళాశాలలకు నోటీసులు, జరిమానా

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలల అనుబంధ గుర్తింపు (ఇంటర్మీడియట్ బోర్డ్ అఫిలియేషన్) పక్రియపైన ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రత్యేక దృష్టి కేంద్రీ కరించింది. ఇక నుంచి జూనియర్ కళాశాలలకు ఇంటర్ బోర్డ్ (బిఐఇ) రిజిస్ట్రేషన్, అఫిలియేషన్ విషయంలో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. రిజిస్ట్రేషన్, అఫిలియేషన్ విషయంలో ఇక నుంచి జిల్లా ఇంటర్ విద్యాధికారులను బాధ్యులను చేయనున్నారు. దరఖాస్తు చేసుకునే బాధ్యతను కేవలం కళాశాలకే వదిలేయకుండా, జిల్లా పరిధిలో ఉన్న అన్ని కళాశాలలు దరఖాస్తులు చేసుకునేలా జిల్లాకు చెందిన ఇంటర్ విద్యా అధికారులే బాధ్యత వహించాలని ఇంటర్ బోర్డ్ నిర్ణయించింది. ఈ నెలాఖరు (జులై ) వరకు అనుబంధ గుర్తింపు పక్రియను పూర్తి చేయాలని ఇంటర్మీడియట్ బోర్డ్ నిర్ణయించింది. రాష్ట్రంలో ఇంటర్ బోర్డ్‌కు రిజిస్ట్రేషన్ కూడా చేసుకోని ప్రైవేటు జూనియర్ కళాశాలలు కూడా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఇలాంటి కళాశాలల పట్ల కొంత కఠినంగానే వ్యవహరించాలని, గుర్తింపు, అఫిలియేషన్ విషయంలో జాప్యం చేయకుండా ఒక కాలపరిమితిలోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి అభిలాష అభినవ్ నిర్ణయించినట్టు తెలిసింది. ఇందులో భాగంగానే ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న తరువాయి 8లో

సిబిఎస్‌ఇ డిజిటల్ మార్కింగ్ విధానంపై

## విద్యార్థులలో నైరాశ్యం పట్ల ‘సుప్రీం’ ఆందోళన

**న్యూఢిల్లీ :** సిబిఎస్‌ఇ డిజిటల్ మార్కింగ్ విధానంపై విద్యార్థులలో నెలకొన్న ‘నైరాశ్యం’ పట్ల సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఆన్ స్క్రీన్ మార్కింగ్ (ఒఎస్‌ఎం) విధానం ద్వారా పరీక్షలు నిర్వహించేందుకు నిబంధనలు రూపొందించడానికి కేంద్రానికి, సిబిఎస్‌ఇకి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (పిఐఎల్) విచారణలో బుధవారం సుప్రీంకోర్టు సొలిసిటర్ జనరల్ (ఎస్‌జి) తుషార్ మెహతా సహాయాన్ని కోరింది. సిబిఎస్‌ఇ యొక్క ఒఎస్‌ఎం మూల్యాంకన వ్యవస్థ అనేది ఒక డిజిటల్ గ్రేడింగ్ విధానం. ఇందులో ఉపాధ్యాయులు భౌతిక జవాబు పత్రాలను నేరుగా పరిశీలించడానికి బదులుగా కంప్యూటర్ ద్వారా వాటిని స్కాన్ చేసిన ప్రతులను పరిశీలించి మూల్యాంకనం చేస్తారు. ‘చిన్న పిల్లల్లో తరువాయి 12లో

నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో

# దారుణ హత్యలు

- ఇద్దరు వ్యక్తులు దుర్మరణం
- కత్తులు, గొడ్డళ్లతో కిరాతకంగా నరికి నిందితులు పరార్



ప్రజాపక్షం/నిర్మల్ / రెబ్బెన

రాష్ట్రంలో దారుణ హత్యల సంస్కృతి ప్రజలను భయభ్రాంతులను చేస్తోంది. నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో జరిగిన దారుణ హత్యల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. 24 గంటల వ్యవధిలోపు జరిగిన ఈ హత్యలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. పోలీసులు, స్థానికులు వెల్లడించిన వివరాలలోకి వెళితే...బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో పట్టపగలే అత్యంత దారుణమైన హత్య ఉదంతం చోటుచేసుకుంది. ఒక యువకుడిని ముగ్గురు దుండగులు బహిరంగంగా కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేయడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.నిర్మల్ పట్టణంలోని విశ్వనాథ్‌పేట్ వైఎస్‌ఆర్ నగర్ కాలనీకి చెందిన అస్లం (23) అనే యువకుడు బుధవారం ఆటోలో వెళ్తుండగా, ముగ్గురు వ్యక్తులు ఒక వాహనంలో తరువాయి 12లో

విద్యాసంస్థల్లో డ్రగ్స్‌కు

# జీరో టాలరెన్స్

- ఉల్లంఘిస్తే గుర్తింపు రద్దు చేస్తాం
- డిజిపి సివి. ఆనంద్ హెచ్చరిక
- ప్రతీ విద్యాసంస్థలో సేఫ్టీ కోఆర్డినేటర్‌ను నియమించాలని సూచన




ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలోని అన్ని విద్యాసంస్థలను పూర్తిస్థాయిలో డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోందని రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ తెలిపారు. విద్యార్థుల భద్రత, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని విద్యాసంస్థల్లో డ్రగ్స్‌కు ’జీరో టాలరెన్స్ పాలసీ’ అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. డ్రగ్స్ కార్యకలాపాలను ప్రోత్సహించినా, పట్టించుకోకపోయినా సంబంధిత విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే వాటి గుర్తింపు రద్దుకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో డిజిపి కీలక ఆదేశాలు జారీ చేశారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాలకు ఎలాంటి స్థానం ఉండకూడదని, విద్యార్థులను డ్రగ్స్ బారిన పడకుండా రక్షించేందుకు సమగ్ర భద్రతా వ్యవస్థను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని తరువాయి 8లో



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సీతమ్మసాగర్ పర్యావరణ అనుమతులకు

# కేంద్రంతో నిరంతర సంప్రదింపులు

ప్రజాపక్షం/హైదరాబాద్

సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు త్వరగా లభించేలా కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల పెండింగ్ సమస్యల పరిష్కారంపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సమీక్షించారు.బుధవారం సచివాలయంలో జరిగిన సమావేశంలో రెండు ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతులు, నిర్మాణ పనుల పురోగతి, భూసేకరణ, సాంకేతిక అంశాలపై ఇరువురు మంత్రులు చర్చించారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల అంశం సుప్రీంకోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉండటంతో 2023 మార్చి నుంచి పనులు నిలిచిపోయాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత మంత్రిత్వ శాఖలు, అధికారులతో సమన్వయం చేసుకుని పర్యావరణ అనుమతులు సాధిస్తామని, అనుమతులు వచ్చిన వెంటనే పనులు పునఃప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకంలోని పంప్‌హౌస్–1, పంప్‌హౌస్2 మధ్య దోమలవాగుపై ప్రస్తుతం ఉన్న 0.20 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యాన్ని 0.50 టిఎంసిలకు పెంచడం, సీతారామ ప్రధాన కాలువపై పంప్‌హౌస్–1, 2, 3 మధ్య అవసరమైన ప్రాంతాల్లో ఎస్కేప్ రెగ్యులేటర్ల ఏర్పాటు చేయడం ద్వారా వర్షాకాలంలో అధిక వరద ప్రవాహాన్ని నియంత్రణతో పాటు కాలువలకు నష్టం వాటిల్లకుండ ఉపయోగపడతాయని తెలిపారు. సత్తుపల్లి ట్రంక్ కాలువలోని యాతలకుంట సొరంగం తవ్వకం పూర్తయిందని, తరువాయి 12లో



క్యూబాపై ఆంక్షలు

## తక్షణం ఎత్తివేయాలి

చైనా విదేశాంగశాఖ డిమాండ్

**బీజింగ్ :** క్యూబా జాతీయ సార్వభౌమాధికార హక్కులకు చైనా గట్టి మద్దతు తెలియజేసింది. ఆ దేశంలో విదేశీ జోక్యాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి లిన్ జియాన్ చెప్పారు. అంతర్జాతీయ సమాజం విజ్ఞప్తులను మన్నించి ఆ దేశంపై ఆంక్షలను తక్షణం ఎత్తివేయాలని కోరారు. అంతర్జాతీయంగా ఉండాల్సిన నిష్పక్షపాతాన్ని, న్యాయాన్ని అమలు చేసేందుకు ఈ విషయంలో ప్రపంచదేశాలతో తరువాయి 12లో

# ఆహార ద్రవ్యోల్బణం.. ప్రమాదకరం..

ద్రవ్యోల్బణం అనేది ఆర్థికశాస్త్రంలో కనిపించే ఒక గణాంకం. అంతకు మించి, సామాన్య ప్రజల జీవితాలను నిశ్శబ్దంగా కుదిపేసే సామాజిక, ఆర్థిక వాస్తవం. ప్రభుత్వం విడుదల చేసే ద్రవ్యోల్బణ శాతాలు, ధరల సూచీలు, గణాంక నివేదికలు సాధారణంగా నిపుణుల చర్చలకే పరిమితమైన అంశాలుగా కనిపించినప్పటికీ, వాటి అసలు ప్రభావం ప్రతి ఇంటిలోనూ ఉంటుంది. గత నెల టోకు ధరల ద్రవ్యోల్బణం 9.87 శాతానికి పెరగడం, 2024 ఏప్రిల్ నుంచి అమలులో ఉన్న ప్రస్తుత శ్రేణిలో ఇదే అత్యధిక స్థాయికి చేరుకోవడం భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ఒత్తిడిని స్పష్టం చేస్తున్నది. అంతకుముందు మే నెలలో ఇది 9.68 శాతంగా ఉండగా, ఒక్క నెలలోనే మరింత పెరగడం ఆహార ధరల అసాధారణ పెరుగుదల ఎంత తీవ్రంగా ఉందో సూచిస్తోంది. అదే సమయంలో గృహ వినియోగదారులు ఎదుర్కొనే చిల్లర ద్రవ్యోల్బణం కూడా నాలుగున్నర శాతానికి చేరుకోవడంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఈ పెరుగుదలకు ప్రధాన కారణం ఆహార ధరలు. మునగకాయ ధరలు ఒక్క నెలలోనే దాదాపు రెట్టింపు కావడం, క్యాప్సికం, టమాటా, ఉల్లిపాయ వంటి ప్రతి కుటుంబం నిత్యం వినియోగించే కూరగాయల ధరలు ఆకాశానికి చేరడం సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఇవి విలాసవంతమైన వస్తువులు కావు. రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా ఉపయోగించేవి. అందువల్ల వీటి ధరల పెరుగుదల నేరుగా ప్రతి కుటుంబ ఆహార వ్యయాన్ని పెంచుతుంది. ముఖ్యంగా స్థిరమైన ఆదాయం లేని అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కూలీలు, చిన్న ఉద్యోగులు, పెన్షనర్లు, పట్టణ పేదలు ఈ భారం నుంచి తప్పించుకునే పరిస్థితి ఉండదు. ఆహార ద్రవ్యోల్బణం సాధారణ ద్రవ్యోల్బణంతో పోలిస్తే మరింత ప్రమాదకరమైనది. పేద కుటుంబాలు తమ ఆదాయంలో అత్యధిక భాగాన్ని ఆహారంపైనే ఖర్చు చేస్తాయి. ధనిక కుటుంబాలకు ఆహార ధరల పెరుగుదల కొంత ఇబ్బందిని కలిగించినా, వారి జీవనశైలిపై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చు. కానీ రోజువారీ కూలీపై ఆధారపడే కుటుంబాలకు మాత్రం ఇదే పెద్ద సంక్షోభంగా మారుతుంది. ఒకప్పుడు కొనుగోలు చేసిన కూరగాయలను ఇప్పుడు సగానికి సగం తగ్గించుకోవాల్సి వస్తుంది. పప్పులు, పాలు, పండ్లు వంటి పోషకాహార పదార్థాలు క్రమంగా వారి ఆహారపు జాబితా నుంచి తొలగిపోతాయి. ఫలితంగా పోషకాహార లోపం, ఆరోగ్య సమస్యలు, పిల్లల్లో ఎదుగుదల లోపాలు వంటి దీర్ఘకాలిక ప్రభావాల ప్రమాదం. తక్కువ వర్షపాతం ఈ పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసింది. వ్యవసాయం ఇప్పటికీ ప్రకృతిపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. ఎల్‌నినో పరిస్థితుల వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే, కూరగాయల ఉత్పత్తి తగ్గుతుంది. ఉత్పత్తి తగ్గితే సరఫరా తగ్గుతుంది. సరఫరా తగ్గితే ధరలు పెరగడం సహజం. అయితే సమస్య కేవలం ప్రకృతి కారణాలతోనే పరిమితం కాదు. సరైన నిల్వ సదుపాయాల లేమి, శీతల గిడ్డంగుల కొరత, సరఫరా వ్యవస్థలో ఉన్న లోపాలు, మధ్యవర్తుల ఆధిపత్యం, రవాణా వ్యయాల పెరుగుదల వంటి నిర్మాణాత్మక సమస్యలు కూడా ధరలను మరింత పెంచుతున్నాయి. రైతు తన పంటకు సరైన ధర పొందలేకపోతుంటే, వినియోగదారుడు అదే పంటను అధిక ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ఈ విరుద్ధ పరిస్థితి వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న అసమతుల్యతను బహిర్గతం చేస్తోంది. ఇంధన ధరల పెరుగుదల కూడా ఆహార ద్రవ్యోల్బణాన్ని మరింత వేగవంతం చేస్తోంది. డీజిల్ ధరలు పెరిగితే వ్యవసాయ యంత్రాల నిర్వహణ ఖర్చు పెరుగుతుంది. నీటిపారుదల వ్యయం పెరుగుతుంది. పంటలను మార్కెట్‌కు తరలించే రవాణా ఖర్చు పెరుగుతుంది. కోల్డ్ స్టోరేజ్ నిర్వహణ ఖర్చు పెరుగుతుంది. ఈ మొత్తం అదనపు వ్యయాన్ని చివరకు వినియోగదారుడే భరించాల్సి వస్తుంది. అందుకే ఇంధన ధరల పెరుగుదల ఎప్పుడూ కేవలం పెట్రోల్ బంకులకే పరిమితం కాకుండా, ప్రతి ఇంటి ఆహార ఎంపిక పైన కూడా ప్రభావం చూపుతుంది. ఇటీవల విడుదలైన ఉత్పత్తిదారుల ధరల సూచీ కూడా పెరుగుదల దిశగా సాగడం మరో హెచ్చరిక. పరిశ్రమలు ఉత్పత్తి చేసే వస్తువుల తయారీ వ్యయం పెరుగుతోందని ఇది సూచిస్తోంది. ముడి పదార్థాలు, విద్యుత్, ఇంధనం, రవాణా, కార్మిక వ్యయం అన్నీ పెరిగినప్పుడు తయారీదారులు చివరకు ఉత్పత్తుల ధరలను పెంచక తప్పదు. ఫలితంగా వినియోగ వస్తువుల ధరలు సైతం పెరుగుతాయి. దీనిని ఆర్థిక శాస్త్రంలో వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణం అంటారు. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం వడ్డీ రేట్లను పెంచడం ద్వారా మాత్రమే ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం సాధ్యం కాదు. సరఫరా వ్యవస్థను మెరుగుపరచడం, ఉత్పత్తి వ్యయాలను తగ్గించడం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం వంటి చర్యలు కూడా అంతే అవసరం. ఆ దిశగా అడుగులు వేయకుండా, ఆహార ద్రవ్యోల్బణాన్ని దీర్ఘకాలంలో నియంత్రించడం సాధ్యం కాదు. రైతుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు, మార్కెట్ సమాచారం, సరైన కనీస మద్దతు ధర, నిల్వ సదుపాయాలు, రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండాలి. పంట కోత తర్వాత జరిగే నష్టాలను తగ్గించగలిగితే మార్కెట్‌లో సరఫరా మెరుగుపడుతుంది. అలాగే పండ్లు, కూరగాయల కోసం ఆధునిక శీతల సరఫరా గొలుసును విస్తరించడం అత్యవసరం. ఉత్పత్తి ప్రాంతం నుంచి వినియోగదారుడి వరకు సరఫరా వ్యవస్థ సమర్థంగా పనిచేస్తే ధరల్లో అనవసర హెచ్చుతగ్గులను గణనీయంగా తగ్గించవచ్చు. ప్రభుత్వం తక్షణ చర్యలతో పాటు దీర్ఘకాలిక వ్యూహాన్ని కూడా రూపొందించాల్సిన అవసరం ఉంది. నిల్వల్లో ఉన్న ఆహార ధాన్యాలను అవసరమైన ప్రాంతాలకు విడుదల చేయడం, మార్కెట్‌లో కృత్రిమ కొరతను సృష్టించే అక్రమ నిల్వలను అరికట్టడం, దిగుమతులు అవసరమైతే వేగంగా నిర్ణయాలు తీసుకోవడం, రైతులకు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే విధానాలు అమలు చేయడం వంటి చర్యలు సమన్వయంతో సాగాలి. అంతేకాకుండా వాతావరణ మార్పుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయాన్ని మరింత స్థిరంగా మార్చే విధానాలు కూడా అవసరం. ద్రవ్యోల్బణాన్ని కేవలం రిజర్వ్ బ్యాంకు లేదా ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిష్కరించే సమస్యగా చూడలేం. ఇది వ్యవసాయం, వాణిజ్యం, రవాణా, ఇంధనం, నీటిపారుదల, వాతావరణ విధానాలు, సామాజిక సంక్షేమం వంటి అనేక రంగాలకు సంబంధించిన సమగ్ర సవాలు. ఒకవైపు రైతుకు న్యాయమైన ధర లభించాలి. మరోవైపు వినియోగదారుడికి అందుబాటు ధరల్లో ఆహారం లభించాలి. ఈ రెండు లక్ష్యాల మధ్య సమతుల్యత సాధించగలిగినప్పుడే నిజమైన ధరల స్థిరత్వం సాధ్యమవుతుంది.



## స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌గ్లాసులు ధరించొద్దు

**పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యే ఎంపిలు స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌గ్లాసులు ధరించొద్దు. దీనివల్ల భద్రతకు, వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. పార్లమెంట్ ఆవరణలో ఎంపిలు ధర్నాలు చేయడం, ప్లకార్డులు ప్రదర్శించడం, ఆయుధాలు ప్రదర్శించడం, మతపరమైన కార్యక్రమాలు నిర్వహించ డం వంటి వాటికీ దూరంగా ఉండాలి. ఎఐతో రూపొందించిన చిత్రాలు, పోస్టర్లు; అవమానకర రీతిలో రాసిన స్లోగన్లతో కూడిన ప్లకార్డులు, బ్యానర్ల నూ ప్రదర్శించొద్దు. సమావేశాల సమయంలో తోటి ఎంపిలు తమ ఛాంబర్లకు వెళ్లడానికి వీలుగా పార్లమెంట్ ప్రవేశద్వారాల వద్ద ఎలాంటి నిరసనలు లేదా ప్రదర్శనలు నిర్వహించవద్దు.**

– లోక్‌సభ సచివాలయం



## స్థిరమైన అటవీ సంరక్షణకు దిక్సూచి జపనీస్ 'దైసుగి'

జపాన్‌లోని క్యోటో ప్రాంతంలో పుట్టిన ఈ దైసుగి పద్ధతి, ముఖ్యంగా 'కిటాయామా సెడార్' అనే ప్రత్యేకమైన దేవదారు వృక్షాలపై ప్రయోగిస్తారు. జపనీస్ భాషలో 'దై' అంటే పీఠం లేదా బల్ల అని, 'సుగి' అంటే సెడార్ (దేవదారు) చెట్టు అని అర్థం. అంటే, ఒక పెద్ద తల్లిచెట్టును పీఠంగా మార్చి, దానిపై నుండి అనేక నిటారైన చిన్న చెట్లను (కొమ్మలను) పెంచడమే ఈ విధానం యొక్క ముఖ్య ఉద్దేశం.

14వ శతాబ్దంలో జపాన్‌లో సాంప్రదాయ ఉద్భవ గృహాల ప్రాచుర్యం పొందింది. ఈ తరహా ఇళ్లకు ఎక్కడా వంకరలు లేని, అత్యంత నిటారైన, మృదువైన కలప స్తంభాలు అవసరమయ్యేవి. అయితే, జపాన్‌లోని పర్వత ప్రాంతాలలో నిటారైన చెట్లను పెంచడానికి సరిపడా భూమి లేకపోవడం మరియు రవాణా సౌకర్యాలు తక్కువగా ఉండటంతో, అప్పటి అటవీ కార్మికులు ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి ఒక సరికొత్త ఉపాయాన్ని ఆలోచించారు. అదే 'చెట్టును నరకకుండా, కొమ్మలనే చెట్లుగా మార్చడం'.

ఈ పద్ధతి బోన్సాయ్ కళను పోలి ఉంటుంది, కానీ ఇది భారీ స్థాయిలో కలప ఉత్పత్తి కోసం చేసే ప్రక్రియ. మొదట ఒక బలమైన కిటాయామా సెడార్ మొక్కను నాటుతారు. అది కొంత ఎత్తుకు పెరిగిన తర్వాత, దాని పైభాగం మరియు పక్క కొమ్మలను క్రమం తప్పకుండా కత్తిరిస్తారు నిరంతరం కత్తిరించడం వల్ల ఆ చెట్టు పైకి పెరగడం ఆగిపోయి, దాని కాండం ఒక బలమైన పీఠంలాగా మారుతుంది.ఈ పీఠం నుండి నిలువుగా పైకి చిగురించే కొమ్మలను మాత్రమే పెరగనిస్తారు. ఇవి ఎలాంటి వంకరలు లేకుండా, నేరుగా ఆకాశంలోకి దూసుకుపోతాయి. ప్రతి 15 నుండి 20 సంవత్సరాలకు ఒకసారి, ఈ పైకి పెరిగిన నిటారైన కొమ్మలను మాత్రమే జాగ్రత్తగా నరికి కలపగా వాడుకుంటారు. మూలంలో ఉన్న తల్లి చెట్టును అలాగే వదిలేస్తారు. ఆ తల్లి చెట్టు సుమారు 200 నుండి 300 సంవత్సరాల పాటు జీవిస్తూ, నిరంతరం కొత్త కలపను అందిస్తూనే ఉంటుంది. జపాన్ వంటి పర్వత ప్రాంతాలు మరియు ఇరుకైన లోయలు ఎక్కువగా ఉన్న దేశాల్లో సాధారణ పద్ధతిలో విస్తారంగా అడవులను పెంచడం సాధ్యం కాదు. దైసుగి విధానంలో ఒకే ఒక్క తల్లి చెట్టు (మదర్ ట్రీ) కాండంపైనే పదుల సంఖ్యలో నిటారైన కొమ్మలను వృక్షాలుగా పెంచుతారు. దీనివల్ల చాలా తక్కువ స్థలంలోనే అత్యధిక మొత్తంలో కలపను ఉత్పత్తి చేసే వీలు కలుగుతుంది.

ఈ పద్ధతి ద్వారా లభించే కలప సాధారణ పద్ధతిలో పెరిగే దేవదారు (సెడార్) కలప కంటే దాదాపు రెండు రెట్లు (200%) ఎక్కువ బలాన్ని, దట్టమైన నిర్మాణాన్ని కలిగి ఉంటుంది. ఈ కొమ్మలు ఎక్కడా వంకరలు లేకుండా, గింజలు లేకుండా నేరుగా పైకి ఎదుగుతాయి. అంతేకాకుండా, ఈ కలపకు సుమారు 140% ఎక్కువ సాగే గుణం ఉండటం వల్ల, జపాన్ లాంటి భూకంప పీడిత ప్రాంతాలలో తట్టుకుని నిలబడే ఇళ్ల నిర్మాణాలకు, పైకప్పు స్తంభాలకు ఇది అత్యంత ఆదర్శవంతమైనదిగా నిలుస్తుంది. కలప కావాలంటే దైసుగి విధానంలో మూల వృక్షాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరు. కేవలం పైకి పెరిగిన కొమ్మలను మాత్రమే క్రమ పద్ధతిలో నరికి తీసుకుంటారు. ఒకసారి కొమ్మలను సేకరించిన తర్వాత, అదే తల్లి చెట్టు నుండి మళ్లీ కొత్త చిగుళ్లు వచ్చి, మరో 15–20 ఏళ్లలో సరికొత్త కలప సిద్ధమవుతుంది. ఇలా ఒకే చెట్టు సుమారు 200 నుండి 300 సంవత్సరాల పాటు నిరంతరాయంగా కలపను అందిస్తూనే ఉంటుంది. కాలక్రమేణా ఆధునిక నిర్మాణ సామాగ్రి అందుబాటులోకి రావడం వల్ల జపాన్‌లో కూడా ఈ దైసుగి పద్ధతి వాడకం కొంతవరకు తగ్గింది. భవిష్యత్తులో స్థిరమైన అటవీ పెంపకానికి ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి సాంప్రదాయ పద్ధతులను పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**సుధాకర్ ఎవి,** 9000674747



డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

## దేశవ్యాప్త రాజకీయ ప్రచారానికి సిపిఐ సన్నద్ధం

# ఎందుకు మార్పు తప్పనిసరి?

భారతదేశం నేడు నిర్ణయాత్మక క్షణంలో ఉంది. నరేంద్ర మోదీ ప్రభుత్వ దశాబ్దకాల అధికారం ఆందోళనకు, ఆశాభంగానికి, కష్టనష్టాలు పెరుగుదలకు నిలకడగా బాటవేసింది. బిజెపి ఎన్నిక తర్వాత ఎన్నికకు అభివృద్ధి, ఉపాధి, సౌభాగ్యం, మంచి పరిపాలన, మెరుగైన భవిష్యత్ వాగ్దానం చేసింది. దేశం తద్భిన్నంగా, పెరుగుతున్న నిరుద్యోగం, దుర్భరమైన ద్రవ్యోల్బణం, పెరుగుతున్న అసమానత, బలహీన పడుతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, క్షీణిస్తు న్న ప్రజాస్వామ్య వాతావరణం, పెరుగుతున్న సామాజిక ఉద్రిక్తతలు ఎదుర్కొంటున్నది. ఈ ప్రశ్నలు మోదీ ప్రభుత్వంనుంచి సమాధానాలు డిమాండ్ చేసినపుడల్లా, వారు జాతీయ సంభాషణను వేరే అంశాలపైకి మళ్లిస్తున్నారు. సామాన్య ప్రజల రోజువారీ ఆందోళనలను పరిష్కరించే బదులు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు పదేపదే మతమార్గాల్లో ప్రజలను విభజించటం, భావోద్వేగ విజ్ఞప్తు లు చేయటం, ఉద్దేశపూర్వకంగా సృష్టించే వివాదాలవైపు మరలుతున్నారు. జవాబుదారీతనాన్ని తప్పించుకునేందుకు మతాన్ని ముందుకు తెస్తున్నారు. వైఫల్యాన్ని మరుగుపరిచేందుకు ద్వేషాన్ని ప్రోత్సహిస్తున్నారు. విభజన ప్రజ లు ఎదుర్కొంటున్న వాస్తవిక సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చుతుంది కాబట్టి దాన్ని ప్రోత్సహిస్తున్నారు.


నరేంద్రమోదీ ప్రభుత్వం దశాబ్దకాలంపైగా, అపూర్వమైన అభివృద్ధి సాధించామన్న చిత్రాన్ని ప్రజలముందుంచుతున్నది. అయితే కోట్లాది ప్రజల జీవితానుభవం భిన్నమైన కథ చెబుతున్నది. యువకులు పోటీ పరీక్షలకోసం సంవత్సరాల తరబడి శ్రమిస్తున్నారు. కాని జరుగుతున్నదేమిటి? రిక్రూట్‌మెంట్ జాప్యం, పదేపదే ప్రశ్నాపత్రాలు లీకులతో పరీక్షల రద్దు, అవినీతి. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలు నింపడం లేదు. భద్రమైన ఉద్యోగం స్థానంలో కాంట్రాక్టు ఉద్యోగాలు వచ్చాయి. విద్యాధిక యువత డిగ్రీలు చేతబట్టుకుని ఒక పోటీ పరీక్షనుంచి మరో పరీక్షకు పరుగులు పెడుతున్నారు. అయితే వారి ఆకాంక్షలకు తగిన అవకాశాలు కనిపించటం లేదు. విద్య తమ పిల్లల భవిష్యత్‌కు భద్రత చేకూర్చుతుందని తల్లిదండ్రులు తమ పొదుపు సొమ్ము అంతా వెచ్చిస్తున్నారు. అందుకు బదులుగా అసంఖ్యాకంగా యువ భారతీయులు నిరాశానిస్పృహల్లోకి, నిరుద్యోగంలోకి, రేపటి గూర్చిన అగమ్యంలోకి నెట్టబడుతున్నారు. బిజెపి ప్రభుత్వ అతిపెద్ద వైఫల్యాల్లో ఒకటి నిరుద్యోగం అనే వాస్తవాన్ని ఎంతపెద్దగా ప్రచారం చేసుకున్నా దాచలేరు.

నిరుద్యోగంతోపాటు ద్రవ్యోల్బణం కృంగదీస్తున్న భారమవుతున్నది. తమ ఆదాయాలు పెరుగుతున్న ధరల వేగాన్ని అందుకోలేకపోతున్నాయని మార్కెట్‌కు వెళ్లిన ప్రతిసారీ ప్రజలకు గుర్తుచేస్తున్నది. ఆహారం, వంటగ్యాస్, రవాణా, విద్యుచ్ఛక్తి, ఆరోగ్య సంరక్షణ, విద్యపై ఖర్చు నిలకడగా పెరుగుతున్నది. వేతన ఉద్యోగులు తమ ఆదాయాలు అవసరాలకు సరిపోవటంలేదని బాధపడుతున్నారు. వేతన కార్మికులేమో కనీస అవసరాలు తీర్చుకోవటానికి సైతం అవస్థపడుతున్నారు. చిన్నపాటి వర్తకులు ప్రజల కొనుగోలు శక్తి క్షీణింపు పర్యవసానం చవిచూస్తున్నారు. కుటుంబాలు కేవలం మనుగడకోసం వైద్య చికిత్స వాయిదా వేసుకుంటున్నాయి, అత్యవసర వ్యయం తగ్గించుకుంటున్నా యి, అప్పులు చేస్తున్నాయి. సామాన్య ప్రజలేమో పెరుగుతున్న ఆర్థిక అస్థిరత ను అనుభవిస్తుండగా, మోదీ ప్రభుత్వమేమో ఆర్థిక విజయాల పతాక శీర్షికల తో వేడుక కొనసాగిస్తున్నది.

గ్రామీణ భారతంలో సంక్షోభం మరీ తీవ్రంగా ఉంది. కోట్లాదిమంది వ్యవసాయమే జీవనోపాధిగా కొనసాగుతున్నప్పటికీ, రైతులేమో పెరుగుతున్న పెట్టుబడుల ఖర్చులు, ఆదాయంలో అస్థిరత, పెచ్చుపెరుగుతున్న అప్పులతో సతమతమవుతున్నారు. రైతులు దేశవ్యాప్తంగా సుదీర్ఘకాలం పోరాటం చేసినప్పటికీ కనీస మద్దతు ధరకు లీగల్ గ్యారంటీ కోసం చేస్తున్న డిమాండ్ అపరిష్కృతంగానే ఉంది. రైతుల చరిత్రాత్మక ఉద్యమం తర్వాత బిజెపి ప్రభుత్వం వివాదాస్పదమైన వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకుంది. అయినా అందులోని ప్రధాన డిమాండ్ ఎంఎస్‌పికి లీగల్ గ్యారంటీ నెరవేరలేదు. రైతులకు తమ ఉత్పత్తుల కొనుగోలుకు హామీ, అందుబాటులో పరపతి, ఇరిగేషన్, గిట్టుబాటుధరలు అవసరం. వారికి ప్రసంగాలు, ప్రజాసంబంధాల ప్రచారాలు అవసరం లేదు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఒక పద్ధతి ప్రకారం ధ్వంసం చేయటం కూడా అంతే బాధాకరం. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి, ఆదాయ భద్రత కలిగించేందుకు నరేగా చట్టం చేయబడింది. కష్టకాలంలో కోట్లాదిమంది పేదలకు అది జీవనమార్గం అయింది. ఈ ప్రభావవంతమైన కార్యక్రమాన్ని విస్తరించేబదులు, నరేంద్రమోదీ ప్రభుత్వం తగినంత బడ్జెట్ కేటాయించకుండా, వేతనం చెల్లింపు ఆలస్యం చేస్తూ, పరిపాలనా సంబంధమైన ఆంక్షలు విధిస్తూ క్రమంగా బలహీనమొనర్చింది. ఉపాధికి గ్యారంటీ ఇవ్వటం దాతృత్వం కాదు, అది చట్టబద్ధ హక్కు. గ్రామీణ భారత్‌కు మరింత శక్తివంతమైన ఉపాధి గ్యారంటీలు అవసరం.

ప్రభుత్వ విద్య సమాన అవకాశాలు తెస్తుందని ఒకప్పుడు భావించబడింది. ఇప్పుడు అది కూడా ఇబ్బందుల్లో ఉంది. ప్రభుత్వ సంస్థలకు ఇతోధిక పెట్టుబడి అవసరం కాగా, ప్రభుత్వ సంస్థలను ఎండగట్టి ప్రైవేటు విద్యావ్యాపారం విస్తరిస్తున్నారు. అదే అలక్ష్యం ఆరోగ్యసంరక్షణలో కూడా కనిపిస్తుంది. నాణ్యమైన ప్రభుత్వ వైద్యం తగినంతగా లేనందున ప్రజలు తమ సొంత జేబుల నుంచి చాలా పెద్ద మొత్తాలు ఖర్చు చేస్తున్నారు. ఇవి బిజెపి ప్రభుత్వం ఎంచుకున్న విధానాలు. సామాన్య ప్రజలు వాటి పర్యవసానాలు




అనుభవిస్తున్నారు.

నిజమైన సంపద సృష్టికర్తలు కార్మికులు. దేశ ఆర్థికాభివృద్ధికి వారు నిత్యం పాటుపడుతున్నారు. అయితే అభద్రత ఎదుర్కొంటూనే ఉన్నారు. స్థిరమైన ఉద్యోగాలు తగ్గిపోతూ తగినంత సామాజిక భద్రతలేని కాంట్రాక్టీకరణ, పొరుగు సేవలు, అనియత పనులు పెరుగుతున్నాయి. కార్మిక రక్షణలను క్రమంగా తగ్గిస్తూ కార్పొరేట్ ప్రయోజనాలకు విపరీతమైన ప్రోత్సాహం ఇస్తున్నారు.

మహిళలు వివక్షత ఎదుర్కోవటం కొనసాగుతున్నది. సాధికారిత నిత్యం వల్లించటం మినహా సమాన అవకాశాలు కల్పించటంలేదు. మహిళలకు రిజర్వేషన్ కల్పించిన రాజ్యాంగ సవరణను ఇక ఎంతమాత్రం జాప్యం చేయకుండా అమలు జరపాలి. దళితులు, ఆదివాసీలు వివక్ష, అత్యాచారాలు, నివాస ప్రదేశాల నుంచి తొలగింపు ఎదుర్కొంటున్నారు. అభివృద్ధి అంటే ఉన్నది ఊడగొట్టటం కాదు. గాఢమవుతున్న అసమానతతో ప్రజాస్వామ్యం సహజీవనం చేయజాలదు.

దేశంలోని ప్రజాస్వామిక సంస్థలు కూడా తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నాయి. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు జరపటం కాదు. దానికి స్వతంత్ర రాజ్యాంగ సంస్థలు, స్వేచ్ఛాయుతమైన పత్రికారంగం, స్వతంత్రమై న న్యాయవ్యవస్థ, సమాఖ్య వ్యవస్థ (ఫెడరలిజం) పట్ల గౌరవం, అసమ్మతి వ్యక్తీకరణకు రాజ్యాంగ హక్కు అవసరం. మోదీ ప్రభుత్వాన్ని విమర్శించే వారి ని ప్రజాస్వామిక హక్కులు ఉపయోగించుకుంటున్న పౌరులుగా కాకుండా శత్రువులుగా చూడటం పెరుగుతున్నది. ఆత్మవిశ్వాసంగల ప్రభుత్వం ప్రశ్న లు ఆహ్వానిస్తుంది, అభద్రతతో ఉన్న ప్రభుత్వం వాటికి భయపడుతుంది.

భారతదేశ ఎన్నికల క్రమంలో విశ్వాసం పునరుద్ధరించటం ఎంతో అవసరం. స్వేచ్ఛాయుతమైన ఎన్నికలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పునాది. అవి నిష్పక్షపాతంగా నిర్వహించబడటమేగాక అలా కనిపించాలి కూడా. బిహార్, పశ్చిమబెంగాల్‌లో ఓటరు జాబితాల ప్రక్షాళన (ఎస్‌ఐఆర్) లో ఏకపక్షంగా తొలగింపుల వల్ల ఎందరో అర్హులు ఓటుహక్కు కోల్పోయారన్న ఆందోళనలు వ్యక్తమయినాయి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో తారుమారులతో ఎన్నికల వ్యవస్థలో విశ్వాసం సన్నగిల్లుతున్నది. ముఖ్య ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్ల ఎంపికలో ప్రభుత్వ జోక్యం పెరగటం వల్ల అవి విమర్శలపాలవుతున్నాయి. ప్రజాస్వామ్యయుత క్రమంలో విశ్వాస పునరుద్ధరణకై సమగ్రమైన ఎన్నికల సంస్కరణలు తక్షణావసరం. ఎన్నికల్లో ధన బలం, కండబలం ప్రవాహాన్ని అణచివేయటానికై ఎన్నికల నిధులు ప్రభుత్వం సమకూర్చాలన్న ఇంద్రజిత్‌గుప్తా కమిటీ సిఫారసులు తక్షణం అమలు జరపాలి. ఈ వైఫల్యాలను విస్మరించటం అసాధ్యమైనప్పుడల్లా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి మతపరంగా సమాజ విభజనవైపు మరలుతాయి. ఉమ్మడి ప్రయోజనాలను పంచుకునే ప్రజలను విభజించటం ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయం.


మతవిశ్వాసం కోట్లాదిమంది భారతీయుల జీవితాల్లో పవిత్రమైన స్థానం ఆక్రమించుకుని ఉంది. అందువల్లనే అయోధ్య రామాలయం కోసం వసూలు చేసిన విరాళాలు, భక్తులు సమర్పించుకున్న కానుకలు దొంగతనం కావటం భక్తులకు తీవ్రమైన మనస్తాపం కలిగించింది. ఈ ఆరోపణలు పారదర్శకత, జవాబుదారీతనం గూర్చి తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తాయి. దీనిపై సబబైన, స్వతంత్ర, విశ్వసనీయత కలిగిన దర్యాప్తు అవసరం. ఇది ద్రవ్య జవాబుదారీతనానికి మించిన సమస్య. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు దశాబ్దాల పాటు భగవాన్ రాముని పేరుతో ప్రజల్ని సమీకరించా యి. ఆయన పేరుతో ఉన్న ఆలయం పనితీరు గూర్చి ఇప్పుడు ప్రశ్నలు లేవనెత్తబడుతున్నప్పుడు వాటిని కొట్టిపారేయ వీలులేదు. ఆర్‌ఎస్‌ఎస్ మతాన్ని వ్యాపారంగా, రాజకీయ అధికారానికి సాధనంగా ఉపయోగించింది. ప్రజలను ఐక్యం చేయటానికి బదులు విభజించటానికి ఉద్దేశించిన ఎడతెగని ప్రచారంతో వాస్తవ సమస్యలను సమాధి చేస్తున్నది మోదీ ప్రభు త్వం.

ఇంతకన్నా మెరుగైన స్థితికి భారత్ అర్హురాలు. కొత్త వివాదాలు సృష్టించే బదులు ప్రశ్నలకు జవాబుచెప్పే ప్రభుత్వం అవసరం. ఉపాధి, భద్రత, ప్రభుత్వ విద్య, ఆరోగ్యం, కార్మికుల అవసరం. ఉపాధి, భద్రత, ప్రభుత్వ విద్య, ఆరోగ్యం, కార్మికుల హక్కులకు రక్షణ, నరేగా పటిష్టత, రైతులకు గిట్టుబాటు ధరలకు గ్యారంటీ, సామాజిక న్యాయ పరిరక్షణ, అర్థవంతమైన ఎన్నికల సంస్కరణలు అమలుజరిపే, రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకు నే విధానాలు దేశానికి అవసరం. అన్నిటికన్నా ముఖ్యంగా, ఎన్నికల లబ్ధి కోసం ప్రజలను విభజించే బదులు ఐక్యం చేసే ప్రభుత్వం దేశానికి అవసరం.

భారత కమ్యూనిస్టు పార్టీ ఈ నిశ్చితాభిప్రాయంతోనే ఆగస్టు 6 నుంచి 15వరకు పాదయాత్రల ద్వారా దేశవ్యాప్త ప్రచారోద్యమానికి పిలుపు ఇచ్చింది. ఇవి ప్రతి గ్రామం, పట్టణం, నగరానికీ ప్రజల ఐక్యత, న్యాయం, ప్రజాస్వామిక మార్పు సందేశాన్ని తీసుకెళతాయి. **ఈ పాదయాత్రలు 2026 సెప్టెంబర్ 1న రాంలీలామైదాన్‌లో జరిగే 'మార్పు అవసరం' ర్యాలీకి చేరుకుంటాయి.** పైన ప్రస్తావించిన వివిధ తరగతుల ప్రజానీకం కోసం ఉద్దేశించిన కోర్కెలతోపాటు ప్రజాస్వామిక విలువల పునరుద్ధరణ, భారత లౌకిక, ప్రజాతంత్ర రిపబ్లిక్ పరిరక్షణ, దాని రాజ్యాంగం పరిరక్షణను దేశం నలుమూలల నుంచీ చేరుకున్న ప్రజలు డిమాండ్ చేస్తారు.

*బద్లావ్ జరూరీ హై*
*మార్పు అవసరం*
*ఢిల్లీ చలో*
*1 సెప్టెంబర్, రాంలీలా మైదాన్*

## కృత్రిమ మేధ మానవాళికి వరం కావాలి, శాపం కాదు




ఒక ఎలక్ట్రానిక్ ఉపకరణం మానవుణ్ణి అనుకరించడం, నేర్చుకోవడం, నిర్ణయాలను తీసుకోవడం లాంటి విధులను నిర్వహించడాన్ని కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఏఐ) అని చెప్పవచ్చు. నేడు ఎఐ రంగం ఒక టెక్నాలజీ అభివృద్ధే కాదని, రానున్న తరాల మానవ జీవితాలను విప్లవాత్మకంగా ప్రభావితం చేయనుందని తెలుసుకోవాలి. గత కొన్ని దశాబ్దాలుగా ఎఐ ప్రారంభ స్థాయి నుంచి నేడు భాషలను తర్జుమా చేయడం, ముఖాలను గుర్తించడం, వేలిముద్రలను పసిగట్టడం, వాహనాలను ప్రోగ్రామింగ్‌కు అనుగుణంగా ఆటోమేటిక్‌గా నడపడం, రోగాలను నిర్ధారణ చేయడం, చికిత్సతో పాటు రోబోటిక్ సర్జరీలు చేయడం లాంటి పనులను చేసే స్థాయికి అభివృద్ధి చెందింది. 2021లో ఎఐ ప్రాధాన్యాన్ని గుర్తించిన జాసన్ కిర్టన్ అను శాస్త్రజ్ఞుడు ప్రతి ఏట 16 జూలై రోజున ఎఐ ప్రశంసా దినోత్సవం లేదా ఎఐ అప్రీషియేషన్ డే నిర్వహించుకోవాలని ప్రపంచ మానవాళికి సందేశం ఇవ్వడంతో అది ప్రతి ఏటా సాంప్రదాయంగా ప్రపంచ దేశాలు జరుపుకోవడం కొనసాగుతున్నది.

**నిత్య జీవితంలో ఎఐ ప్రయోజనాలు:**

మానవాళి జీవనశైలితో ఎఐ విడదీయరాని సంబంధాన్ని ఏర్పరుచుకుంటున్నది. నేడు వైద్యరంగంలో వ్యాధి నిర్ధారణ, చికిత్స, సర్జరీ లాంటి ప్రయోజనాలను కలిగి ఉన్నది. రవాణా రంగంలో ట్రాఫిక్ నియంత్రణ, ఆటోమేటిక్ వాహనాల రూపకల్పన లాంటివి జరుగుతున్నాయి. విద్యారంగంలో నూతన ఆకర్షణీయ బోధనా పద్ధతులు, ట్యూటర్ విధులను ఎఐ సుసాధ్యం చేస్తున్నది. వినియోగదారుల సేవల్లో చాట్‌బూట్, వర్చువల్ ఏజెంట్స్ లాంటి విధులు నిర్వహించడంలో ఎఐ సఫలం అవుతున్నది. పర్యావరణ పరిరక్షణలో వాతావరణ నమూనాలు, శక్తి నియంత్రణ లాంటి పలు విధులను ఎఐ నిర్వహిస్తున్నది. వీటితోపాటు వినోదం, బ్యాంకింగ్, టెలీకమ్యూనికేషన్స్, ఆటోమొబైల్స్, గృహ విధులు లాంటి అనేక ప్రయోజనాలను ఎఐ కలిగి ఉన్నదని మన అనుభవం చెబుతున్నది. ఎఐ రంగం వరంగానే కాకుండా శాపంగా పలు నష్టాలను కూడా చూపుతోంది. పలు అనైతిక సమస్యలు, వ్యక్తిగత డాటా దుర్వినియోగాలు, ఉద్యోగాల్లో కోతలు, ఇతర పలు లోపాలను కలిగి ఉండడంతో కొంత జాగ్రత్త వహించాల్సి వస్తున్నది. ఎఐ టెక్నాలజీ ఒక ఇంజనీరింగ్ విభాగంలో శ్రమించే వారి అంశమే కాదు, ఆధునిక టెక్నాలజీని వినియోగించే లేదా వినియోగించని ప్రతి ఒక్కరికీ జీవితాలపై ప్రభావాన్ని చూపడం ఖాయమని తెలిసిపోయింది.

ఎఐ రంగం నైతిక విలువలకు లోబడి ఉండడంతో పాటు పారదర్శకత కలిగి మానవాళికి మేలు చేకూర్చే విధంగా ఉండాలని కోరుకోవాలి.

**భారతదేశంలో ఎఐ టెక్నాలజీ:**

భారత్‌లో ఎఐ రంగం వేగంగా వినియోగించబడుతూ, పలు విజయాలను నమోదు చేస్తున్నప్పటికీ ఇతర అభివృద్ధి చెందిన దేశాల టెక్నాలజీలతో పోల్చితే కొంత మందగమనం జరుగుతున్నట్లు అర్థం అవుతున్నది. ఎఐ విసురుతున్న పలు సవాళ్లను అధిగమిస్తూ రానున్న రోజుల్లో ఈ రంగంలో భారత్ కూడా పటిష్టమైన అడుగులు వేయాలని కోరుకుందాం. ఎఐ ప్రశంస దినం వేదికగా ఎఐ అనువర్తనాలను వివరించడం, చర్చలు నిర్వహించడం, ఎఐ ప్రాజెక్టులను ప్రదర్శించడం, ఎఐ పరిశోధకులను గుర్తించి ప్రశంసించడం, నైతికతను కాపాడడం లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు.

ఎఐ విప్లవం చూపిన బాటలో నడుస్తూ, ఎఐ టూల్స్‌ను మానవాళి శ్రేయస్సుకు వాడుకోవడం, భారతంలో మరో తరం ఎఐ విప్లవానికి నాంది పలకడం లాంటివి జరగాలని కోరుకుందాం, మానవుడి మేధస్సుకు ఎఐ సరి సమానం కాదని కూడా నమ్ముదాం.

**(16 జులై కృత్రిమ మేధ ప్రశంసా దినోత్సవం సందర్భంగా)**

డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# వేర్‌హౌస్ సామర్థ్యం మరో 5 లక్షల మెట్రిక్ టన్నులు పెంపు



## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న రెండేళ్లలో వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా 48 కొత్త గోదాములను అందుబాటులోకి తీసుకురానున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మొదటి దశలో 17 గోదాములను 2027 జనవరి నాటికి పూర్తి చేసి 2.12 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని, రెండో దశలో 31 గోదాములను 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేసి మరో 3.66 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. బుధవారం సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, మార్క్‌ఫెడ్, హాకా కార్పొరేషన్‌ల మేనేజింగ్ డైరెక్టర్లతో మంత్రి సమీక్ష సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఆధీనంలో 52 స్వంత గోదాములు ఉండగా, వాటి నిల్వ సామర్థ్యం సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నులని తెలిపారు. ప్రస్తుతం 104 శాతానికి పైగా ఆక్యుపెన్సీతో 6.33 లక్షల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం 48 కొత్త గోదాముల నిర్మాణం కొనసాగుతుండగా అదనంగా 32 గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, వాటి ద్వారా మరో 3.25 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు.జిల్లాల వారీగా రానున్న 20 సంవత్సరాల గిడ్డంగుల అవసరాలపై సమగ్ర అధ్యయనం చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దీర్ఘకాలిక అవసరాలకు అనుగుణంగా గోదాముల నిర్మాణం చేపట్టడంతో పాటు, గిడ్డంగుల్లో నిల్వ చేసే వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత దెబ్బతినకుండా శాస్త్రీయ విధానాలను అమలు చేయాలని సూచించారు.కొత్తగా నిర్మించే ప్రతి గోదాముపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి విద్యుత్‌ను స్వయంగా ఉత్పత్తి చేసుకోవాలని, మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించి అదనపు ఆదాయం పొందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అలాగే మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, హాకా, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ల ఆధీనంలోని గోదాములను సమన్వయంతో వినియోగించి ప్రభుత్వ వ్యయాలను తగ్గించాలని సూచించారు. ప్రభుత్వ కార్పొరేషన్లు వడ్డీ భారాన్ని తగ్గించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని, అవసరం లేకుండా ప్రైవేట్ గోదాములను అద్దెకు తీసుకోవద్దని మంత్రి స్పష్టం చేశారు. కొత్త గోదాముల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చి, ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఆధునిక నమూనాలను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కార్మికులే వెన్నెముక

## కార్మిక సంక్షేమంలో ఆదర్శంగా తెలంగాణ

### బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరంలో మంత్రి జి. వివేక్ వెంకటస్వామి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కార్మికులే వెన్నెముక అని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీస్, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. ప్రతి దేశ అభివృద్ధి వెనుక కార్మికుల శ్రమ, నైపుణ్యం, అంకితభావం దాగి ఉంటాయని పేర్కొన్నారు. కార్మికుల గౌరవం, న్యాయమైన వేతనాలు, సురక్షితమైన పని వాతావరణం, సామాజిక భద్రత కల్పించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం సమ్మిట్



2026లో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో 'బెస్ట్ ట్రైపార్టైట్ ప్రాక్టిసెస్ ఇన్ బ్రిక్స్ ప్లస్ కంట్రీస్' అంశంపై జరిగిన చర్చలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వం, యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య సమన్వయంతో కూడిన త్రైపాక్షిక వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో పరిశ్రమలు, యాజమాన్యాలు, ట్రేడ్ యూనియన్లతో నిరంతర సంప్రదింపులు, సామరస్యపూర్వక చర్చలు నిర్వహిస్తూ పారిశ్రామిక వివాదాలను శాంతియుతంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ విధానం వల్ల రాష్ట్రంలో పారిశ్రామిక శాంతి, ఉత్పాదకత, పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. కృత్రిమ మేధస్సు (ఎఐ), ఆటోమేషన్, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో కార్మిక సంఘాల పాత్ర మరింత కీలకంగా మారిందన్నారు. 'తెలంగాణ రైజింగ్2047' విజన్‌లో భాగంగా రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు రానున్నాయని, వాటికి అవసరమైన నైపుణ్య మానవ వనరులను సిద్ధం చేయడంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) ప్రతిపాదించిన 'సామాజిక న్యాయం ద్వారానే శాశ్వత శాంతి సాధ్యం' అనే సిద్ధాంతాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆచరణలో అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య ఇలాంటి చర్చలు ప్రపంచ కార్మిక సంక్షేమ విధానాలకు కొత్త దిశానిర్దేశం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పేద విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వం దృష్టి

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేద, దళిత, గిరిజన విద్యార్థుల విద్యా భవిష్యత్తును తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. అర్హులైన ఒక్క విద్యార్థి కూడా గురుకుల విద్యకు దూరం కాకుండా అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని, గురుకుల సీట్ల కేటాయింపు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండదని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని డిఎస్‌సి భవన్‌లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టిజిఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) కార్యాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన తల్లిదండ్రుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. దూర ప్రాంతాలు, మారుమూల గ్రామాల నుంచి వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లలకు సమీప జిల్లాల్లోనే సీట్లు కేటాయించాలని కోరగా, అర్హులైన విద్యార్థులకు సాధ్యమైనంత మేరకు అనుకూల జిల్లాల్లో ప్రవేశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీట్ల కేటాయింపు ప్రక్రియలో పారదర్శకత, మానవీయ దృక్పథం పాటించాలని, ప్రతి దరఖాస్తును నిబంధనల మేర కు పరిశీలించి అర్హులైన ప్రతి విద్యార్థికి న్యాయం చేయాలని సూచించారు.మారుమూల ప్రాంతాల నుంచి కార్యాలయానికి వచ్చే తల్లిదండ్రులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారికి సరైన సమాచారం, మార్గదర్శకత్వం అందించాలని మంత్రి ఆదేశించారు. గురుకుల విద్యా వ్యవస్థను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, ఆధునిక మౌలిక వసతులు, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.



# తెలంగాణ ఎస్‌సి విద్యార్థుల అభివృద్ధికి కేంద్రం అండగా ఉంటుంది


## కేంద్రమంత్రి రామ్‌దాస్ అథవాలే రాష్ట్ర ప్రభుత్వానికి హామీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదల, హాస్టళ్ల సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి రామ్‌దాస్ అథవాలే హామీ ఇచ్చారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా బుధవారం టూరిజం ప్లాజాలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కేంద్ర మంత్రిని కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరఫున వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న కేంద్ర నిధుల నుంచి తక్షణమే రూ.150 కోట్ల విడుదలకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. అలాగే రాష్ట్రంలోని ఎస్‌సి సంక్షేమ పాఠశాలలు, హాస్టళ్ల ఆధునీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కోరిన రూ.300 కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీపై వచ్చే నెలలో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పరిపాలనకు కేంద్రబిందువుగా తీసుకుని ఎస్‌సిల అభ్యున్నతికి పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని లక్ష్మణ్ కుమార్ కేంద్ర మంత్రికి వివరించారు. విద్యనే సామాజిక సాధికారతకు ప్రధాన సాధనంగా భావిస్తూ గురుకుల విద్యా వ్యవస్థ, సంక్షేమ హాస్టళ్లు, విద్యార్థుల సంక్షేమ పథకాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. అయితే కేంద్ర ప్రాయోజిత పథకాల కింద తెలంగాణకు రావాల్సిన నిధులు పెండింగ్‌లో ఉండటం వల్ల సంక్షేమ కార్యక్రమాల అమలుపై అదనపు ఆర్థిక భారం పడుతోందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు .ఎస్‌సి సంక్షేమ పాఠశాలలు, హాస్టళ్లలో భవనాల మరమ్మతులు, అదనపు తరగతి గదుల నిర్మాణం, డైనింగ్ హాళ్లు, ఆధునిక వంటశాలలు వంటి సదుపాయాల కోసం రూ.300 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి వివరించారు.

# కులాలతో రాజకీయం చేస్తే మనుగడ ఉండదు : నెల్లికంటి

## ఈశ్వరమ్మకు సంఘీభావం తెలిపిన ఎంఎల్‌సి సత్యం



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌ను బుధవారం సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఈశ్వరమ్మపై తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానించిన నేపథ్యంలో ఆమెను హైదరాబాద్‌లోని నివాసంలో పరామర్శించిన నెలికంటి సత్యం ఈశ్వరమ్మ యాదవ్‌కు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు ప్రజా పతినిధులు, రాజకీయ నాయకులు పరస్పర గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సమాజానికి మంచిది కాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం

## టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో విద్యా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వ్యాపారంగా మార్చి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. 'నీట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్న వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి' అని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్ బోయినపల్లిలో నిర్వహించిన 'ఛత్రోంకి గూంజ్' కార్యక్రమంలో మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి కన్వీనర్, ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్, ఎమ్మెల్యే శ్రీగణేష్, కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ కేంద్ర మంత్రి ఎస్.వేణుగోపాల్ చారి, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, దేశంలో విద్యా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వ్యాపారంగా మార్చిందని, ఉద్యోగ, విద్యా పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థులు, యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ సహా పలు జాతీయ స్థాయి పరీక్షల్లో జరిగిన పేపర్ లీకేజీలు దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల విశ్వాసాన్ని దెబ్బతీశాయన్నారు. ఇన్ని ఆరోపణలు, ఆధారాలు వెలుగులోకి వచ్చినప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయకపోవడం దురదృష్టకరమని, ఆయనపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం మరింత బాధాకరమని విమర్శించారు. విద్యార్థుల హక్కులను కాపాడేందుకు, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికే లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా 'ఛత్రోంకి గూంజ్' కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. ఈ ఉద్యమంలో ప్రతి విద్యార్థి, ప్రతి యువకుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం కలిగిన వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని ఆయన కోరారు. దేశ విద్యా వ్యవస్థను రక్షించేందుకు, విద్యార్థుల భవిష్యత్తు ను కాపాడేందుకు జరుగుతున్న ఈ ఉద్యమానికి విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున మద్దతు తెలపాలని మహేష్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# ప్రతి ఉద్యమకారుడికీ న్యాయం చేస్తాం

## నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ముఖాముఖిలో పేర్కొన్న కమిటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యమకారుల ప్రతి డిమాండ్‌ను సానుకూలంగా నమోదు చేస్తున్నామని, ఒక్క నిజమైన ఉద్యమకారుడికి కూడా అన్యాయం జరగకుండా చూస్తామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వద్ద నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఉద్యమకారులతో బుధవారం ముఖాముఖి సమావేశం నిర్వహించారు. కమిటీ చైర్మన్ డా.కె.కేశవరావు, సభ్యుడు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ పాల్గొని ఉద్యమకారుల అభిప్రాయాలు, ఆధారాలను పరిశీలించారు. సమావేశంలో ఉద్యమకారులు 250 గజాల ఇంటి స్థలం, గౌరవప్రదమైన నెలవారీ పెన్షన్, ఉద్యమకారుల పిల్లలకు విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా, మహిళా ఉద్యమకారులకు ప్రత్యేక పథకాలు, ఉచిత కార్పొరేట్ వైద్యం, కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య, ఆర్‌టిసి బస్సుల్లో జీవితకాల ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. జూలై 22 వరకు జిల్లాల వారీగా ముఖాముఖి సమావేశాలు కొనసాగించి, సమగ్ర నివేదికను సిఎం రేవంత్ రెడ్డికి సమర్పిస్తామని కమిటీ చైర్మన్ డా.కేశవరావు తెలిపారు.

# సిపిఐతో కాంగ్రెస్‌కు ఎలాంటి విభేదాలు లేవు

## మా మైత్రి కొనసాగుతుంది : మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** "సిపిఐతో కాంగ్రెస్ పార్టీ మైత్రి కొనసాగుతుంది. కాంగ్రెస్‌కు సిపిఐ మిత్రపక్షమే. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో తమకు ఎలాంటి విభేదాలు లేవు. ఆయన అంటే మాకు గౌరవం" అని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని, ప్రతి చిన్న విషయానికి గాంధీభవన్‌కు రావద్దని కాంగ్రెస్ శ్రేణులకు ఆదేశించినట్లు ఆయన చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రేణుకా చౌదరి వ్యాఖ్యలపై ఆమెతో చర్చించానని, ఆమె వ్యాఖ్యలను తప్పుగా ప్రచారం చేశారని, ఖమ్మంలో బిజెపి, బిఆర్‌ఎస్ కాంగ్రెస్ వైపు చూస్తున్నాయని మాత్రమే ఆమె అన్నారన్నారని మహేష్‌కుమార్ గౌడ్ వివరించారు. గాంధీభవన్‌లో బుధవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మహేష్‌కుమార్ గౌడ్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ ప్రారంభమైందని, ఈ నెలాఖరులోగా నామినేటెడ్ ప దవుల భర్తీ పూర్తి చేస్తామని మహేష్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. సుమా రు 50 నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని, త్వరలో డైరెక్టర్ పదవుల భర్తీని కూడా చేపడతామన్నారు. నలుగురు, ఐదుగురు మినహా డిసిసి అ ధ్యక్షుల పనితీరు బాగుందని, మరో రెండు రోజుల పాటు సమావేశాలు కొనసాగుతాయన్నారు. పార్టీ మండల కమిటీల నియామకంలో డిసిసిల నిర్ణయమే ఫైనల్ అని మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# ప్రీమియంలకు సరిపడా పాలసీలు పొందాలి


## టిజిఎల్‌ఐ సంచాలకుడు వి.శ్రీనివాసు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వ జీవిత బీమా (టిజిఎల్‌ఐ) పాలసీదారులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు బీమా అర్హత వయస్సు (56) ఏళ్ల లోపు ఉండి వారి జీతభత్యముల నుంచి నెలసరి బీమా ప్రీమియంలను క్రమం తప్పకుండా తగ్గించుతూ, దానికి సరిపడే విధంగా ప్రతిపాదన పత్రాలు సంబంధిత జిల్లా బీమా కార్యాలయాలకు సమర్పించి, పాలసీలు పొందిఉన్నట్లయితే, వారు మాత్రమే బీమా ప్రయోజనాలకు అర్హులు అవుతారని తెలంగాణ ప్రభుత్వ జీవిత బీమా శాఖ సంచాలకులు వి.శ్రీనివాసు తెలిపారు. కొంతమంది చందాదారులు (ఉద్యోగ, ఉపాధ్యాయులు) బీమా అర్హత వయస్సు 56 సంత్సరాల లోపు ఉండి ప్రీమియములు (మొదటి/ తదుపరి) క్రమం తప్పకుం డా తగ్గిస్తున్నప్పటికీ, సంబంధిత జిల్లా బీమా కార్యాలయాలలో ప్రతిపాదన ప త్రాలను సమర్పించకపోవడం వలన నేటికీ పాలసీలు పొందియుండలేదని, అ టువంటి వారు అన్నిరకాల బీమా ప్రయోజనాలకు అనర్హులవుతారని తెలిపారు. అనగా, ప్రీమియం (మొదటి/తదుపరి) మినహాయింపులు, పాలసీలు పొందడానికి ప్రతిపాదన పత్రాల సమర్పణ, ఈ రెండు కూడా చందాదారుని వయస్సు (56) సంవత్సరాలు దాటకముందే పూర్తికావాలి అన్నారు. అందువల్ల వారు, వారి డిడిఓలు తగిన చొరవ తీసుకుని సరియైన విధంగా పూరించబడిన పత్రాల ను సంబంధిత జిల్లా బీమా కార్యాలయాలలో సమర్పించి, వాటికి తగిన విధం గా పాలసీలను పొందాలని, ఆ పాలసీలను ఐఎఫ్‌ఎంఐఎస్ పోర్టల్ నందలి ఉద్యోగుల మాస్టర్ జాబితాలో అప్‌డేట్ కూడా చేసుకోవాలని సంచాలకులు వి.శ్రీనివాసు తెలిపారు.

# దేశవ్యాప్తంగా పారక్వాట్ గడ్డి మందు నిషేధాన్ని స్వాగతిస్తున్నాం

## తెలంగాణ రైతు కమిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా పారక్వాట్ (గడ్డి మందు)ను నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం శుభపరిణామమని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, కమిషన్ సభ్యులు భూమి సునీల్, గోపాల్ రెడ్డి, రాములు నాయక్, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, కమిషన్ స్పెషల్ ఆఫీసర్ కేశవులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ పారక్వాట్ గడ్డి మందు వల్ల దేశవ్యాప్తంగా 4,200 మంది పైగా రైతులు, వ్యవసాయ కూలీలు, అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, తెలంగాణలోనే 200 మంది మృ తి చెందడం ఆందోళనకరమన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఇప్పటికీ ఓ గర్భిణి ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న విషయాన్ని గుర్తు చేశారు.పారక్వాట్ అత్యంత ప్రమాదకరమైనదని వైద్య నిపుణులు రైతు కమిషన్ దృష్టికి తీసుకురావడంతో, దానిని నిషేధించాలని ఈ ఏడాది మార్చి 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలి సి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అనంతరం తెలంగాణ శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపగా, కేంద్రం దేశవ్యాప్తంగా నిషేధ నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. పారక్వాట్‌తో పాటు గ్లైఫోసేట్ కలుపు మందు, హెచ్‌టిబిటీ పత్తి విత్తనాలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కొదండరెడ్డి డిమాండ్ చేశారు. రసాయనాల అధిక వినియోగం రైతుల సమస్య మాత్రమే కాదని, ప్రజారోగ్యానికి కూడా ముప్పుగా మారిందని కమిషన్ సభ్యులు భూమి సునీల్ పేర్కొన్నారు. సమస్య తీవ్రరూపం దాల్చిన తర్వాత చర్య లు తీసుకోవడం కంటే ముందస్తు నివారణ చర్యలే శాశ్వత పరిష్కారమని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ రంగానికి మరింత ప్రాధాన్యం కల్పించి తగిన నిధు లు కేటాయించాలని, వ్యవసాయ చట్టాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. మరోవైపు విషపూరితమైన గడ్డి కలుపు మందుల వల్ల పశువులు సైతం బలవుతున్నాయని మరో సభ్యులు గోపాల్ రెడ్డి తెలిపారు. పారక్వాట్ గడ్డి మందుతో ఎక్కువగా రైతు, రైతు కూలీలే ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం బ్యాన్ చేయడం సంతోషమన్నారు.



# బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది

## చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం, విద్య, సంరక్షణ అందిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలం : మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాదిలాంటిదని , చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం, విద్య, సంరక్షణ అందిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. నాసిరకం సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్ల ను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 'మహిళా శిశు సంక్షే మ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతి'పై జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సీతక్క బుధవారం సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష ని ర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార సరఫరా, టేక్ హోమ్ రేషన్, అంగన్వాడీ తొలిముద్ద (బ్రేక్‌ఫాస్ట్ పథకం), అమ్మ మాట అంగన్వాడీ బాట, నూతన అంగన్వాడీ భవనాల నిర్మాణం, మౌలిక వసతులు, నియామకాలు, బాల్య వివాహాల నివారణ, శిశు రక్షణ, దత్తత ప్రక్రియతో పాటు వివిధ పథకాల బడ్జెట్ విడుదల, వ్యయంపై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మారు మూల చివరి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కూడా జిల్లా అధికారులు సందర్శించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారులు, సూపర్‌వైజర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించేందుకు డిబ్ల్యుఒలు, సూపర్‌వైజర్లు తరచూ కేంద్రాల్లో భోజనం చేయాలని సూచించారు. గుడ్లు, పప్పు, పాలు, ఇతర పోషకాహార పదార్థాల ఇండెంట్, సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని మంత్రి సీతక్క హెచ్చరించారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం అందాలని, గర్భిణులు, బాలింతల విషయంలోనూ ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసిన 2,500 నూతన అంగన్వాడీ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరో 2,500 నుంచి 3,000 అంగన్వాడీ భవనాల నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. వలస కార్మికుల పిల్లల కోసం కార్మిక శాఖ సహకారంతో మొబైల్ అంగన్వాడీలను ఏర్పాటు చేశామన్నారు. అంగన్వాడీ వ్యవస్థలో అంకితభావంతో పనిచేస్తున్న అధికారులు, టీచర్లు, ఆయాలను గుర్తించాలని మంత్రి సీతక్క సూచించారు. ఆగస్టు 15 నాటికి ఉత్తమ సేవలందిస్తున్న వారిని ఎంపిక చేసి సన్మానించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లా నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు టీచర్లతో త్వరలో సమావేశమై వారి సమస్యలను వింటామని, క్షేత్రస్థాయిలో బాగా పనిచేసే సిబ్బంది అనుభవాలు, సూచనలను స్వీకరించి వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామన్నారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు బి. అపర్ణ, మర్రిపల్లి చందన, ప్రేమలతా అగర్వాల్, కంచర్ల వందనగౌడ్, మ హిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శృతి ఓజా, టిజి ఫుడ్స్ ఎండి చంద్రశేఖర్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్ మోతి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

GHMC

గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్

డివిజన్-30, జిహెచ్‌ఎంసి

| NIT NO. | పని వివరణ | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
| --- | --- | --- | --- | --- |
| NIT No. 14/E.E-30/GHMC/2026-27, Dated: 14.07.2026 | జిహెచ్‌ఎంసి, కెజడ్, డివిజన్-30 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు | రూ. 110.70 లక్షలు | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 15.07.2026 ఉ.11:00గం.లకు, మరియు బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం : 18.07.2026 ఉ.11:00గం.ల వరకు. | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-30, జిహెచ్‌ఎంసి 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-30, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 6099-PP/CL/ADVT/2026-27, Date: 15-07-2026



## ఎకరాకు రూ.8 వేల ప్రోత్సాహకం

### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రం డిమాండ్

**ప్రజాపక్షం/నల్లగొండ** : రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో వరికి బదులుగా ప్రత్యామ్నాయ మెట్ట పంటలు సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.8 వేల ప్రోత్సాహకాన్ని అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రం డిమాండ్ చేశారు.ఈ బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని అన్నారు. పడిన కొద్దిపాటి వర్షాలకు రైతులు పత్తి విత్తనాలు విత్తగా, దాదాపు 30 శాతం విత్తనాలు మొలకెత్తలేదని పేర్కొన్నారు.నకిలీ విత్తనాల సమస్యతో పలుచోట్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్రంలోని 17 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మొహినోద్దిన్,గౌరవ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు,గీతాపనివారల సంఘం జిల్లా అధ్యక్షులు పబ్బు వీరస్వామి,రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు బండమీది వెంకన్న,బిళ్ళ కనకయ్య, బొడ్డు వెంకన్న,మందుల పాండు,యూసుఫ్,లెనిన్ ఉన్నారు.

## 19న చిలుకూరులో ఏఐవైఎఫ్ జిల్లా మూడవ మహాసభలు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) సూర్యాపేట జిల్లా మూడవ మహాసభలు జూలై 19న చిలుకూరులో జరగనున్న మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ సూర్యాపేట పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్మ బిక్షం భవన్‌లో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించి వారు మాట్లాడారు. పని హక్కు ప్రాథమిక హక్కుగా గుర్తించాలని సమగ్ర యువజన విధానం కోసం, విద్యా అవకాశాల కోసం, ఉద్యోగ ఉపాధి హక్కుల కోసం, డ్రగ్స్, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఏఐవైఎఫ్ సమర శంఖారావం పూరించడానికి జూలై 19న చిలుకూరు మండల కేంద్రంలో దొడ్డ నరసయ్య భవనం వేదిక అవుతుందన్నారు. మహాసభలకు అధిక సంఖ్యలో యువజనులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ గౌరవ అధ్యక్షులు కుక్కడపు శౌరి, కమిటి సభ్యులు రెడ్డిమల్ల శ్రీను, బూర సాయి దిలీప్, తందారిపల్లి నగేష్ పాల్గొన్నారు.

## దేశ సమగ్రత- సమైక్యతకు యువత అంకితం కావాలి : ఏఐవైఎఫ్



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** దేశ సమగ్రత సమైక్యతకు యువత అంకితం కావాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న యువజన విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాటాలకు యువత సన్నద్ధం కావాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను యువతను కోరారు. బుధవారం మండల పరిధిలోని గానుగబండ గ్రామంలో ఏఐవైఎఫ్ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నరేంద్రమోడి నాయకత్వంలోని బిజేపి పార్టీ తాము అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీని ఇచ్చి, కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తాము ఇచ్చిన హామీలను అటకెక్కించాయని, ఉన్న ఉద్యోగాలకి కూడా ఎసరు పెట్టి నేటి యువతను రోడ్డున పడేస్తున్నాయని అన్నారు. ఉపాధి ఉద్యోగ అవకాశాలు లేక నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని, నేటి యువతకు ఈ ప్రభుత్వాలపై ఉద్యమాలు చేయడానికి ప్రశ్నించడానికి అవకాశం కలిగిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ హక్కుల కోసం పోరాడాలని అన్నారు. మండల నాయకులు పంగ సైదులు, మోడె లింగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల కమిటిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఈద ప్రసాద్, ఖాసీంసాబ్, ఈద వీరబాబు, మధు, చింతకాయల కొండలు, ఆకుల శ్రీను, యోగి పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్.. రూ.52 వేల నగదు స్వాధీనం

### 47 చోరీ కేసుల్లో నిందితుడిని పట్టుకున్న టూ టౌన్ పోలీసులు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలో జరిగిన చోరీ కేసును టూ టౌన్ పోలీసులు విజయవంతంగా ఛేదించి,47 చోరీ కేసుల్లో నిందితుడైన అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.52 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సిఐ రాఘవరావు తెలిపారు. మంగళవారం టూ టౌన్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ రాత్రి నల్లగొండ పట్టణంలోని రామగిరి ప్రాం తంలో ఉన్న హనుమాన్ స్పోర్ట్స్ షాప్ షట్టర్ తాళాలు పగులగొట్టి, కౌంటర్‌లో భద్రపరిచిన రూ.3.40 లక్షల నగదును గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించాడని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. సాంకేతిక ఆధారాలు,సీసీటీవీ ఫుటేజీ,ఇతర ఆధారాల ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.52 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అరెస్టైన నిందితుడు కందుల సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు ప్రస్తుతం హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్‌లో నివాసం ఉంటున్నాడని, స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లా మండపేట మండలంలోని ఏడిద గ్రామమని తెలిపారు. అతనిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి సుమా రు 47 చోరీ కేసులు నమోదై ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కేసును నల్లగొండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి పర్యవేక్షణలో టూ టౌన్ ఎస్ఐ డి.సైదబాబు, పోలీసు సిబ్బంది లావూరి బాలకోటి, మహమ్మద్ షకీల్ సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్‌పి అభినందించినట్లు సీఐ రాఘవరావు తెలిపారు.

# మేనేజర్ లేక అవస్థలు

### కెనరా బ్యాంక్‌లో రెండు నెలలుగా నిలిచిపోయిన రైతుల పెట్టుబడి రుణాలు

### ఖాతాదారులకు తప్పని తిప్పలు

### గ్రామీణ ప్రాంతమైన కొంపెల్లికి తెలుగులో మాట్లాడగలిగే బ్యాంక్ మేనేజరే కావాలి




**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని కొంపెల్లి గ్రామంలోని కెనరా బ్యాంకులో గత రెండు నెలలుగా శాశ్వత మేనేజర్ లేకపోవడంతో వేలాది మంది ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతానికి కేంద్రంగా ఉన్న ఈ శాఖ ద్వారా కొంపెల్లి,కలకుంట్ల, కోతులారం, చలిమెడ, వెల్మకన్నె,గుజ్జ తదితర గ్రామాలకు చెందిన పది వేలకుపైగా ఖాతాదారులు సేవలు పొందుతున్నారు.ఇటీవల బ్యాంకు మేనేజర్ బదిలీ కావడంతో కొత్త మేనేజర్ ఇప్పటి వరకు బాధ్యతలు చేపట్టలేదు. దీంతో బ్యాంకులో నగదు చెల్లింపులు, విత్‌డ్రాలు,గోల్డ్ లోన్లు వంటి పరిమిత సేవలు మాత్రమే అందుబాటులో ఉండగా,కాపు రుణాలు, మార్ట్‌గేజ్ (భూమి తనఖా) రుణాలు, ఇతర రుణాల మంజూరు పూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుతం వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్న నేపథ్యంలో రైతులు పెట్టుబడి కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా రుణాలు మంజూరు కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.చేసేదేమీ లేక అధిక వడ్డీకి ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు తెచ్చుకుని సాగు పనులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అంతేకాకుండా బ్యాంకులో పనిచేస్తున్న కొంతమంది ఉత్తర భారత సిబ్బందికి తెలుగు తెలియకపోవడంతో గ్రామీణ ఖాతాదారులు తమ సమస్యలను వివరించలేక ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతమైన కొంపెల్లిలో స్థానిక ప్రజలతో సులభంగా మాట్లాడగలిగే తెలుగులో ప్రావీణ్యం ఉన్న మేనేజర్‌ను నియమించాలన్నదే ఖాతాదారుల ప్రధాన డిమాండ్ అని పేర్కొంటున్నారు.భాషా సమస్య వల్ల సేవల నాణ్యత దెబ్బతింటోందని,రైతులు,వృద్ధులు,మహిళలు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**మేనేజర్ సంతకం కోసం రెండు నెలలుగా తిరుగుతున్నా :లాలు చలిమెడ గ్రామం**

కొన్ని సంవత్సరాల క్రితం ఇదే బ్యాంకులో మార్ట్‌గేజ్ లోన్ తీసుకున్నాను.రెండు నెలల క్రితమే రుణం పూర్తిగా చెల్లించాను. కానీ మేనేజర్ సంతకం ఉంటేనే భూమి అసలు పత్రాలు ఇస్తామని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు.మేనేజర్ లేక రెండు నెలలుగా తిరుగుతున్నా పని కావడం లేదు. ఇప్పుడు కొత్త కాపు రుణం కూడా తీసుకునే పరిస్థితి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను అని ఖాతాదారుడు బొమ్మరబోయిన లాలు తెలిపారు.

**కొత్త మేనేజర్ నియామకానికి సిఫారసు చేశాం :రవీందర్, కెనరా బ్యాంకు ఆర్ఓ మేనేజర్**

కొంపెల్లి శాఖకు నియమితులైన మేనేజర్ అనారోగ్య కారణాలతో విధుల్లో చేరలేకపోయారని,కొత్త మేనేజర్ నియామకం కోసం సర్కిల్ ఆఫీస్, హెడ్ ఆఫీస్ అధికారులకు ఇప్పటికే సిఫారసు చేశామని కెనరా బ్యాంకు ఆర్వో మేనేజర్ రవీందర్ తెలిపారు.త్వరలోనే కొత్త మేనేజర్‌ను నియమించి ఖాతాదారుల సమస్యలు పరిష్కరిస్తామని ఆయన వెల్లడించారు.

# రోగులకు ప్రేమతో వైద్యం

### కలెక్టర్ బి.చంద్రశేఖర్

### నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ప్రభుత్వాసుపత్రిలో ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/నందికొండ :** పేషెంట్లతో మర్యాదపూర్వకంగా, గౌరవంగా వ్యవహరిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు.బుధవారం నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ప్రభుత్వాసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా ఆరోగ్య మిత్ర కౌంటర్‌ను పరిశీలించిన ఆయన,అక్కడ సిబ్బంది లేకపోవడంతో ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను వివరణ కోరారు.ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన పేషెంట్లతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.గురుకుల పాఠశాలలో సీటు వచ్చిన తమ కుమార్తెకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం వచ్చామని ఓకుటుంబం తెలిపింది. మరో మహిళ తాను 350 షుగర్ స్థాయితో చికిత్స కోసం వచ్చానని చెప్పగా,ఆమెకు ధైర్యం చెప్పిన కలెక్టర్, డ్యూటీ వైద్యుడిని పిలిచి సరైన డైట్ ప్లాన్ వివరించి చికిత్స అందించాలని సూచించారు.అనంతరం ఫార్మసీని పరిశీలించిన కలెక్టర్,మందుల నిల్వలు,పంపిణీ వివరాలను రిజిస్టర్‌లో కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు.ఓపీ విభాగాన్ని తనిఖీ చేసి రోజుకు సుమారు 200 మంది పేషెంట్లు వస్తున్నట్లు తెలుసుకున్నారు.కోతుల సమస్య నివారణకు త్వరలోనే ఏబీసీ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ చికిత్స పొందుతున్న రోగి కొల్లి రామలింగంను పలకరించి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ సేవలు సంతృప్తికరంగా అందుతున్నాయని రోగి కలెక్టర్‌కు తెలిపారు.ఆస్పత్రి సూపరింటిండెంట్ హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ మానస స్వర్ణ సుమన్,తహసిల్దార్ ఖాసీం,మున్సిపల్ కమిషనర్ సిహెచ్ సైదులు,డాక్టర్ అనిత రాణి,ఆసుపత్రి సిబ్బంది, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# మిర్యాలగూడలో పోలీసుల విస్తృత తనిఖీలు

### నంబర్ ప్లేట్ లేని 11బైకులు, సరైన పత్రాలు లేని 27 వాహనాలు స్వాధీనం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా పెంచేందుకు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ పట్టణంలో బుధవారం తెల్లవారుజామున విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు. మిర్యాలగూడ ఇంచార్జ్ డీఎస్పీ రవి పర్యవేక్షణలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఎం.నాగభూషణరావు, టూ టౌన్ ఇన్స్పెక్టర్ జె.సోమనర్సయ్య, రూరల్ సీఐ పి.ఎన్.డి ప్రసాద్, ముగ్గురు సీఐల ఆధ్వర్యంలో 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పట్టణంలోని ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి మార్గాలు, ప్రవేశ నిష్క్రమణ ప్రాంతాలు, రద్దీ కూడళ్లు అనుమానాస్పద ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో వాహనాల రిజిస్ట్రేషన్, నంబర్ ప్లేట్లు, డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇతర సంబంధిత పత్రాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా సంచరిస్తున్న నంబర్ ప్లేట్ లేని 11 ద్విచక్ర వాహనాలు, సరైన పత్రాలు లేని 27 వాహనాలు సహా మొత్తం 38 వాహనాలను సీజ్ చేశారు. సంబంధిత వాహన యజమానులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను ప్రశ్నించి వారి వివరాలను సేకరించారు. రాత్రి వేళల్లో నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు పాత నేరస్థుల కార్యకలాపాలపై కూడా పోలీసులు ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవి మాట్లాడుతూ నేర నియంత్రణ, ప్రజల భద్రత , శాంతిభద్రతల పరిరక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, అద్దె వాహనాల నెలవారీ అద్దెను రూ.55వేలకు పెంచాలని తెలంగాణ అద్దె వాహనాల యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ పవన్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట అద్దె వాహనాల యజమానులు, డ్రైవర్లతో కలిసి నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017లో అప్పటి ఇంధన ధరలు, వాహనాల నిర్వహణ వ్యయాలను పరిగణలోనికి తీసుకొని ప్రభుత్వం నెలవారీ అద్దెను రూ.33వేలకు నిర్ణయించిందని తెలిపారు. ప్రస్తుతం ఇంధన ధరలు, విడిభాగాల ధరలు, నిర్వహణ ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో అద్దెను రూ.55వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో 15 నుంచి 18 నెలలుగా అద్దె వాహనాల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో వాహన యజమానులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రతి కలెక్టరేట్‌లో డ్రైవర్ల కోసం ప్రత్యేక విశ్రాంతి గది, వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, తన్నీరు మహేష్, రహీం, సాయికుమార్, హరీష్, హుస్సేన్ నాయక్, సందీప్, జీవన్, కృష్ణ, సుమన్ నాయక్, సంతోష్, షరీఫ్ పాల్గొన్నారు.



## బుద్ధవనం అభివృద్ధిపై కేంద్ర పురావస్తు శాఖ అధికారుల సమీక్ష



**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ టూరిజం అభివృద్ధి చేసిన నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని కేంద్ర పురావస్తు శాఖ హైదరాబాద్ సర్కిల్ అధికారుల బృందం బుధవారం సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించింది.ఈసందర్భంగా బృందం బుద్ధవనంలోని బుద్ధ చరితవనం, ధ్యానవనం, జాతక వనం, మహాస్తూపాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లు, అభివృద్ధి పనులను పరిశీలించింది.పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా బుద్ధవనంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, సందర్శకులకు మరింత మెరుగైన అనుభూతిని కల్పించే అంశాలపై బుద్ధవనం అధికారులతో విస్తృతంగా చర్చించింది. అనంతరం నిర్మాణంలో ఉన్న డిజిటల్ మ్యూజియం పనుల పురోగతిపై ఆరా తీసిన అధికారులు, బుద్ధవనాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానిస్తూ భవిష్యత్ తరాలకు బౌద్ధ వారసత్వాన్ని మరింత సమర్థవంతంగా అందించేలా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.ఈ పరిశీలనలో కేంద్ర పురావస్తు శాఖ హైదరాబాద్ సర్కిల్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ నిఖిల్ దాస్,డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ కృష్ణ చైతన్య, కన్జర్వేషన్ అసిస్టెంట్లు వెంకటయ్య,హారిక, భార్గవ నాయుడు,బుద్ధవనం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి,ఆర్ట్స్ అండ్ ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందర్ రావు,ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ ఆఫీసర్ రవిచంద్ర,అసిస్టెంట్ ఇంజనీర్ నజీష్ తదితరులు పాల్గొన్నారు.

## 'పోలీస్ అక్క'తో సమస్యలు చెప్పుకోవచ్చు

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** మహిళా బాధితులు తమ సమస్యలను పోలీస్ అక్కతో నిర్భయంగా చెప్పుకోవచ్చని జిల్లా అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి తెలిపారు. పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం రూరల్ పోలీసులు, జిల్లా షీ టీం పోలీసుల ఆధ్వర్యంలో మండలంలోని బాలెంల గ్రామ సమీపంలోని తెలంగాణ గురుకుల బాలికల విద్యాలయం నందు పోలీస్ అక్క అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిఎస్‌పి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ మహిళల రక్షణలో ఇప్పటి వరకు షీ టీమ్స్, భరోసా సిబ్బంది పనిచేస్తున్నారని ఇక నుండి పోలీస్ అక్క సేవలు అందిస్తుందని తెలిపారు. షీ టీం ఎస్ఐ నీలిమ మాట్లాడుతూ విద్యార్థినిలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. తమ భద్రత విషయంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వేధింపులు, అసభ్య ప్రవర్తన, సైబర్ వేధింపులు ఎదురైతే వెంటనే పోలీసులకు లేదా షీ టీంకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనిల్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ఏసిబికి చిక్కిన అవినీతి జలగ

### సూర్యాపేట జిల్లా భూగర్భ జల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మేఘావత్ బాలు, డేటా ఆపరేటర్ వెంకటేశ్వర్లు అరెస్టు



**ప్రజాపక్షం/ సూర్యాపేట :** ఏసిబి అధికారులకు మరో అవినీతి జలగ బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో చిక్కింది. ఓ బోర్‌వెల్ యజమాని నుంచి ఎన్‌ఓసి కోసం రూ.20వేల లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసిబి నల్లగొండ రేంజ్ డిఎస్‌పి జగదీష్ చంద్ర దీనికి సంబంధించిన వివరాలను మీడియాకు వివరించారు. సూర్యాపేట జిల్లా భూగర్భ జల శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మేఘావత్ బాలు ఓ బోర్‌వెల్ యజమాని బోరుబావుల తవ్వకం రిగ్‌కు అధికారికంగా అనుమతి ఇవ్వాలని ఆయనను ఆశ్రయించగా రూ.20వేలు లంచం ఇవ్వాలని అడిగినట్లు తెలిపారు. బాధితుడు ఏసిబిని ఆశ్రయించగా నల్లగొండ రేంజ్ డిఎస్‌పి జగదీష్ చంద్ర ఆధ్వర్యంలో వల పన్నారు. కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ (ఏవో2) కోసనోజు వెంకటేశ్వర్ల ద్వారా ఆ సొమ్మును తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా తన పై అధికారి మేఘావత్ బాలు డబ్బులు తీసుకోమని చెప్పడంతో బోర్‌వెల్ యజమాని నుండి ఆ డబ్బులు తీసుకున్నట్లు తెలిపారు. దీంతో బాలు, వెంకటేశ్వర్లను అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసిబి ప్రత్యేక కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు వివరించారు. పనుల నిమిత్తం ప్రభుత్వ అధికారులు ఏవరైనా లంచం డిమాండ్ చేస్తే భయపడకుండా వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064, వాట్సప్ నంబర్ 9440446106 ను సంప్రదించాలని కోరారు.

## అంజయ్య సేవలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/నాంపల్లి :** అమరజీవి కోరే అంజయ్య సిపిఐకి జీవితాంతం అంకితభావంతో సేవలందించి చేసిన పోరాటాలుసేవలు కార్యకర్తలకు ఆదర్శప్రాయమని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సిపిఐ శాఖ మాజీ కార్యదర్శి కోరే అంజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా,బుధవారం ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరే అంజయ్య పార్టీ పిలుపునిచ్చిన ప్రతి ఉద్యమంలో ముందుండి పాల్గొన్న నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు.నక్కలగండి నుంచి హైదరాబాద్ వరకు సాగునీటి సాధన కోసం చేపట్టిన పాదయాత్రలోనూ,మునుగోడు నియోజకవర్గ సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలోనూ చివరి వరకు చురుకుగా పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి అంజయ్య అని గుర్తు చేశారు. ఆయన కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్యచారి,మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్,ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బి.జగన్,మండల పార్టీ కార్యవర్గ సభ్యులు ఊరుపాక వెంకటయ్య,పల్లె సైదులు,నేరెళ్ల సైదులు,రేవెల్లి సర్పంచ్ బట్టు శ్రీను,పెద్దాపురం సర్పంచ్ పల్లె వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

## చెరువు గండిని వెంటనే పూడ్చాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని లక్ష్మీపురం, రుద్రారం, ముల్కల కాల్వ, రాయినిపాలెం, జాలుబాయి తండా గ్రామాల మధ్య ఉన్న చెరువుకు గండి పడటంతో నీరు భారీగా వృథాగా పోతున్న విషయాన్ని తెలుసుకున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బుధవారం సంఘటన స్థలాన్ని సందర్శించారు. ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే, గండిని అత్యవసర ప్రాతిపదికన పూడ్చి నీటి వృథాను అరికట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులకు సాగునీటి కొరత తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుతం చెరువులో నిల్వ ఉన్న నీరు వృథాగా వెళ్లిపోవడం వల్ల భవిష్యత్తులో సాగు నీటి సమస్య ఏర్పడే అవకాశముందని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సాగునీటి సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పలువురు ఎస్ఐల బదిలీలు

**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లాలో పలువురు సబ్ ఇన్స్పెక్టర్ల (సివిల్) బదిలీలు,పోస్టింగ్‌లు చేపడుతూ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఉత్తర్వులు జారీ చేశారు.యాదాద్రి జోన్5 డీఐజీ కార్యాలయం ఆదేశాల మేరకు ప్రజా ప్రయోజనాలు,పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వచ్చేలా నిర్ణయించారు.మునుగోడు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఈ.రవిను తిప్పర్తి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. తిప్పర్తి ఎస్‌హెచ్‌వో వి.శంకర్ వీఆర్ (రిజర్వ్),నల్లగొండ కు కేటాయించారు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఎం. శోభన్ బాబును మునుగోడు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా నియమించారు.డీసీఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న పి.సురేష్ యాదవ్ మాడ్గులపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు.మాడ్గులపల్లి ఎస్‌హెచ్‌వో ఎస్.కృష్ణయ్యను వీఆర్ కు బదిలీ చేశారు. బదిలీ అయిన ఎస్ఐలు వెంటనే రిలీవ్ అయి నూతన విధుల్లో చేరాలని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆదేశించారు.అధికారులు రిలీవ్ అయిన, విధుల్లో చేరిన తేదీల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని సంబంధిత అధికారులకు సూచించారు.



## మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

### మహిళా శక్తి భవనం, ఇందిరమ్మ ఇళ్లు సహా పలు అభివృద్ధి పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/వెల్దండ :** రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం, ఆర్థిక సాధికారతకు అత్యంత ప్రాధన్యం ఇస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెద్దాపూర్, కుప్పగండ్ల గ్రామాల్లో ఆ గ్రామాల సర్పంచులు కేశమళ్ల అనూష,మొక్తాల రమేష్ ముదిరాజ్‌ల లతో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్దాపూర్ గ్రామంలో మహిళ శక్తి భవనం ప్రారంభం అనంతరం గ్రామ సర్పంచ్ కేశమళ్ల అనూష కృష్ణ అద్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో అర్థికంగా బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని, మహిళల బలోపేతం, స్వయం ఉపాధి అవకాశ కల్పన, సంక్షేమ పథకాల సమర్థ అమలు ద్వారా మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కట్టు బడది పనిచేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని కుటుంబాలు అర్థికాభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్తీక్‌కుమార్ ఎంపిడిఓ సూలోచన, మండల సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వడ్త్యావత్ భాగ్యమ్మపూల్‌సింగ్ నాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌ల మట్ట యాదమ్మవెంకటయ్యగౌడ్, ప్రసాద్‌గౌడ్, రవీందర్‌నాయక్, శ్రీనునాయక్, కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కేశమళ్ల కృష్ణ, రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హరికిషన్‌నాయక్, ఎఇలు పల్లవీ, సురేందర్‌రెడ్డి, ఆర్ఐ శంకర్‌నాయక్, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, శివరాజుగౌడ్, రమేష్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జన జాగరణ యాత్ర పోస్టర్ విడుదల

### టిఎస్‌సిపిఎస్‌ఇయు జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ నరసింహరావు

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** జన జాగరణ యాత్రను విజయవంతం చేద్దామని టిఎస్‌సిపిఎస్‌ఇయుజిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ నరసింహారావు పిలుపునిచ్చారు. బుధవారం కల్వకుర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, వివిధ డిపార్ట్‌మెంట్‌లలో జనజాగరణ యాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జూలై 16 అనగా నేడు కల్వకుర్తిలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని కాంగ్రెస్ మేనిఫేస్టోలో పెట్టిన విధంగా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరుతూ 100 బైక్‌లతో జన జాగరణ యాత్ర ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్ కోశాధికారి నరేష్ గౌడ్ తో పాటు పలు రాష్ట్ర బాధ్యులు హాజరవుతున్నారు. అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజేందర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్స్ వేణుగోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/గట్టు :** గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ విజయకుమార్ సూచించారు. మండలంలోని చాగదోన గ్రామంలో బుధవారం ఆయన గ్రామ సర్పంచు వీరేష్ తో కలిసి అంగన్‌వాడీ కేంద్రం, ఫ్రీ ప్రైమరీ స్కూల్‌లను ప్రారంభించారు. భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ వారు ఆయా పాఠశాలలను ఏర్పాటు చేయించారు. దీంతో ఆయా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నిరుపేద విద్యార్థుల చదువలకు స్వచ్ఛంద సంస్థ వారు మండలంలో మంచి చేయూతనందిస్తున్నందున గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ నాయకులు వెంకటేష్, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు దుస్థితి ఇంకెప్పుడు మారేది?

**ప్రజాపక్షం/అయిజ :** జోగులాంబ గద్వాల జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ సింధనూర్ ఉప్పరి గంగాధర్ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా, అయిజ మండలం మేడికొండ ఆర్అండ్‌బి రోడ్డు గత 2009, సంవత్సరం నుండి ఇప్పటివరకు ముగ్గురు ఎమ్మెల్యేలు మారారు. అయినా ఇప్పటివరకు ఈ ఆర్అండ్‌బి రోడ్డు దుస్థితి ఇంతవరకు మారలేదు. ఇప్పటివరకు ఎన్నో మరణాలు సంభవించాయి. అయినా ప్రభుత్వానికి కొంతైనా కనికరం లేకపోయింది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా ఆర్అండ్‌బి రోడ్డు పనులు మొదలు పెడతారు. ఇది గ్రామాలకు వెళ్లే రహదారి కాదు అంతర్ రాష్ట్ర రహదారి. ప్రతి సంవత్సరం కొన్ని వందల యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. ఆ దారి గుండా పోయే ప్రతి రైతు ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే చుట్టుపక్కల ఉన్న గ్రామాలలోకి ఎమర్జెన్సీ కొరకు అంబులెన్స్ రావాలన్నా గంటలకొద్ది సమయం పడుతుంది. ఈ గ్రామాలకు విముక్తి ఎప్పుడు అంటున్న జోగులాంబ గద్వాల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సింధనూర్ ఉప్పరి గంగాధర్, అదే విధంగా స్కూల్ విద్యార్థులకు అంతర్ రాష్ట్ర ప్రయాణికులకు ఇదే దుస్థితి కలుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి కొంతైనా సోయి ఉంటే ఈ పనులు వెంటనే మొదలపెడతారు. ఈ కార్యక్రమంలో అయిజ మండల ప్రధాన కార్యదర్శి జుంజు కృష్ణ, సింధనూర్ బసవ స్వామి, రాజాపురం సురేంద్ర గౌడ్, వి.కృష్ణ, టి.హనుమంతు, కె.రమేష్, కె,రామకృష్ణ, కె.నరసింహులు, డి.సంజన, టిఎస్ రంగన్న, టి.రాముడు, బి.జే.ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## చెత్తకుప్పల్లో కాదు... ఊయలలో ఉంచండి

### కలెక్టర్ సిహెచ్.ప్రియాంక

**ప్రజాపక్షం/నారాయణపేట :** అనివార్య పరిస్థితుల్లో నవజాత శిశువులను రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, చెత్తకుప్పలు వంటి ప్రాంతాల్లో వదిలి వేయకుండా జిల్లా ప్రభుత్వా ఆసుపత్రిలో ఏర్పాటు చేసి ఊయలలో సురక్షితంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ సిహెచ్.ప్రియాంక ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నారాయణపేట ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఊయల శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వదిలివేయబడిన శిశువుల ప్రాణాలను కాపాడి వారికి భద్రమైన సంరక్షణ కల్పించడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఒకవైపు కొంత మంది నవజాత శిశువులను అనాథలుగా వదిలి వేస్తుండగా, మరోవైపు సంతానం లేని దంపతులు (కారా) నిబంధనల ప్రకారం చట్టబద్ధత కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఈ రెండు అంశాలను దృష్టిలో ఉంచుకుని శిశువును పెంచుకునే అవకాశం లేని తల్లిదండ్రులు ఎలాంటి భయం, సంకోచం లేకుండా ఊయలలో వదిలి వెళ్లాలని సూచించారు. ఊయలలో ఉంచిన శిశువులను మహిళా, శిశు సంక్షేమ శాఖ పూర్తి బాధ్యతతో



సంరక్షించి, అమల్లో ఉన్న చట్టాలు, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుని అర్హులైన దత్తత తల్లిదండ్రులకు చట్టబద్ధంగా దత్తత ఇచ్చే ప్రక్రియను నిర్వహిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నవజాత శిశువుల ప్రాణాలను కాపాడటంతో పాటు వారికి మంచి భవిష్యత్తు కల్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.ఆదిత్య, డిఎంహెచ్ఓ జయచంద్ర, మోహన్, డిసిపిఓ కరిష్మా, ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఉన్నత చదువులు చదివి ఉత్తమంగా రాణించాలి**

ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, సదుపాయాలతో ఉన్నత చదువులు చదివి ఉత్తమంగా రాణించాలని జిల్లా కలెక్టర్ సిహెచ్. ప్రియాంక తెలిపారు. బుధవారం కోస్గి మండలం నాచారం కెజిబివి పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించి విద్యార్థినిలకు యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కెజిబివి పాఠశాలలో వసతులు మెరుగ్గా ఉన్నాయా లేదా విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం ఇస్తున్నారా అని అడిగారు. ప్రభుత్వం కల్పించే వసతి సదుపాయాల వల్ల మంచిగా చదివి జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. విద్యార్థినులు ఫైనాన్షియల్ ఇండిపెండెన్స్‌గా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ చర్మన్ వర్ల విజయ్‌కుమార్, రఘువర్ధన్ రెడ్డి, డిఆర్డీ పిడి వెంకట్ రాములు, డిఇఒ గోవిందరాజులు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ శ్రీధర్, సర్పంచు రేణుక, ఉపసర్పంచు రామకృష్ణ, ప్రజాప్రతినిధులు, రఘువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



## ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

### ఎఐటియుసి మండల అధ్యక్ష, కార్యదర్శులు దేశం సైదులు, అమీర్ పిలుపు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఎఐటియుసి మండల అధ్యక్ష కార్యదర్శులు దేశం సైదులు, అమీర్‌లు పిలుపునిచ్చారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో బుధవారం మధ్యాహ్నం ప్రతి ఆటో డ్రైవర్‌కు 12వేల రూపాయలు ఇవ్వాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (ఎఐటియుసి) కల్వకుర్తి మండల అధ్యక్ష కార్యదర్శులు దేశం సైదులు, అమీర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆటో కార్మికులకు ప్రతి సంవత్సరానికి 12వేల రూపాయలు చెల్లిస్తామని నేటికి కూడా ఆ హామీని నెరవేర్చడం లేదని అన్నారు. ఆటో డ్రైవర్లపై ఆర్టీవో పోలీసుల వేధింపులు కూడా ఆపాలని అన్నారు. జూలై 26వ తేదీన తాడూరు మండల కేంద్రంలో ఎఐటియుసి జిల్లా 3వ పెద్ద ఎత్తున కార్మికులు హాజరై మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు పులిజాల పరుశురాం, నాయకులు రాజేష్, మహేష్, యాదగిరి, అక్బర్ మజీద్, శేఖర్, జనార్దన్, బాలస్వామి, రవీందర్, బాబా పాల్గొన్నారు.

## కెజిబివి పాఠశాల, కళాశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ

**ప్రజాపక్షం/నర్వ :** మండలంలోని కెజిబివి పాఠశాల, కళాశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నర్వ ఎంపిడిఒ శ్రీనివాస్, డిపిఎం జయన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు యూనిఫాంలను అందజేసి, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నర్వ స్థానిక సర్పంచ్ హన్మంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, పాల్గొని తమ సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం చంద్రశేఖర్, కెజిబివి ప్రిన్సిపాల్ శిరీష, మండల సమాఖ్య అధ్యక్షురాలు కవిత, సంతోష, సిసి గంగాధర్, పాఠశాల విద్యార్థులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

### విచారణ పేరుతో మూడు నెలలుగా కార్మికుల జీతాలు పెండింగ్ సరికాదు

### తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్

**ప్రజాపక్షం/జడ్చర్ల :** ప్రభుత్వ ఆసుపత్రులలో ఏళ్లతరబడి చాలీచాలని వేతనాలతో కాంట్రాక్టు పద్ధతుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులను ప్రభుత్వం మానవత దృక్పథంతో పర్మినెంట్ చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ విజ్ఞప్తి చేశారు. బుధవారం జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్ట్ పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ విభాగాల జనరల్ బాడీ సమావేశం నరసింహ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో పారిశుద్ధ్యం భద్రత రోగి సంరక్షణ కోసం మూడు సంవత్సరాల కాలవ్యవధితో ప్రభుత్వం ఏజెన్సీ ఎంపిక విధానం కొనసాగుతుందని, ప్రస్తుతం నడుస్తున్న శ్రీ శాంతి ఏజెన్సీ కాలపరిమితి ముగిసిన ఏజెన్సీలను రద్దు చేయకుండా పాత ఏజెన్సీల వారికే అనుమతులు పెంచడం చేత కార్మికుల సంక్షేమం కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.



ప్రభుత్వం మూడేళ్లకొకసారి కొత్త ఏజెన్సీల ఏర్పాటు వాటితో పాటే కార్మికుల వేతనాలు పెంచే విధానం అమలు కావడం చేత ఏజెన్సీలో మార్పు సకాలంలో జరగకపోవడం చేత కార్మికుల తీవ్రమైన ఆర్థిక నష్టంతోపాటు శ్రమ దోపిడీకి కూడా గురవుతున్నారని అన్నారు. జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో కార్మికుల వేతనాల చెల్లింపులో, కార్మికులు లేకుండానే వేతనాల సొమ్ములో అవినీతి అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో విచారణ జరిపారని తక్షణమే విచారణ రిపోర్టును బయట పెట్టాలని డిమాండు చేశారు.

విచారణ పేరుతో కార్మికులను ఇబ్బందులకు గురి చేయడం సబబు కాదని, తక్షణమే పెండింగ్ బకాయిలను చెల్లించాలని లేనిచో సమ్మె నోటీసులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి బ్రాంచ్ యూనియన్ నేతలు కార్మికులు నరసింహ, నవీన్, రాజేష్, రామకృష్ణ, పేర్మల్, అబ్దుల్, అజిద్, నాగరాజు, మనేమ్మ, అలివేల, శివలీల, పద్మ, నీరజ, భార్గవి, చెన్నమ్మ, అంజలి, లక్ష్మీ, నీలమ్మ, పద్మ, సుమతి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులు సరికాదు

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోటలో అభివృద్ధి లేదు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్తకోట ప్రభుత్వ పాఠశాల ప్రారంభం సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కే.శ్రీనివాసు జి పి.శాంతిరాజ్ ది వికాస్ బి.మహేష్, జయరాజ్ కుమార్, చింటూ జె.కిరణ్ ముందస్తుగా పోలీసులు అరెస్టు చేయడం సమంజసం కాదని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ ఆరోపించారు. అంగమ ఆర్భాటాలతో కొత్తకోటలో 15 కోట్లతో అభివృద్ధి చేస్తామని మంత్రులు ఎమ్మెల్యే సమక్షంలో శిలాపాలకాలు వేశారు. నిధులు లేవు పనులు ప్రారంభించడం లేదని ఆయన పేర్కొన్నారు. 20 సంవత్సరాలైనా కానయాపల్లి నిర్వాసితులకు పునరావాసం కల్పించడం లేదని పట్టా సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆయన విమర్శించారు. అంగన్వాడి ఆశలకు ఎన్నికల ముందు 18 వేల రూపాయలు వేతనము ఇస్తామని హామీలు ఇవ్వడం జరిగిందని కొత్తకోటలో బీడి కార్మికులకు బ్రహ్మంగారి గుడి దగ్గర ప్రభుత్వ స్థలాలలో పట్టాలు ఇవ్వడం జరిగిందని నేటికీ అమలు చేయకపోవడం విచారకరమని అన్నారు. కొత్తకోటలో బీడీ కార్మికులకు బ్రహ్మంగారి గుడి దగ్గర ప్రభుత్వ స్థలాలలో పట్టాలు ఇవ్వడం జరిగిందని పేరుకు మాత్రమే పట్టా సర్టిఫికెట్లు ఇచ్చారని భూమి చదును చేసి బీడి కార్మికులకు ఇండ్ల నిర్మాణం చేపట్టకపోవడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి కొత్తకోట అభివృద్ధి కొరకు పట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్న ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం నాలుగు రోడ్ల విస్తరణ పూర్తిస్థాయిలో జరగకపోవడం ద్వారా ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. జి.మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిస్తే కొత్తకోట మున్సిపల్ షాపు కిరాయిలను అద్దె తగ్గిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఒక రూపాయి కూడా తగ్గించిన పాపాన పోలేదని చెప్పారు. కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ బస్టాండును అభివృద్ధి పరిచి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు. కొత్తకోటకు ముఖ్యమంత్రి రాక సందర్భంగా మున్సిపల్ కార్మికులు 18 గంటల పాటు పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం చట్టం ప్రకారం గా నెలకు 26 వేల రూపాయలు వేతనము నిర్ణయించి ఇవ్వాలని డిమాండు చేశారు.



## తెలంగాణను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

### సిపిఐ నాగర్‌కర్నూల్ కార్యదర్శి ఎస్ఎండి.ఫయాజ్ డిమాండ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వాతావరణ పరిస్థితులు దృష్ట్యా తెలంగాణను తక్షణమే కరువు పీడిత ప్రాంతంగా ప్రకటించాలని సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎమ్.డి. ఫయాజ్ డిమాండు చేశారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పార్టీ ముఖ్య నేతలతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, దీనివల్ల వర్షాపాతం, గణనీయంగా తగ్గిపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు లేక వ్యవసాయ క్షేత్రాలన్నీ బోసిపోగా, చెరువులు, కుంటలు, వాగులు, కాలువలు పూర్తిగా అడుగంటాయని పేర్కొన్నారు. భూగర్భజలాలు కూడా ప్రమాదకర స్థాయికి పడిపోతుండటంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోవాలి.. నిపుణుల కమిటీ వేయాలి ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్పందించి, తెలంగాణను కరువు ప్రాంతంగా ప్రకటించాలని ఫయాజ్ డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించాలన్నారు. రైతులు ఇంత పెద్ద విపత్తును ఎదుర్కొంటుంటే, ప్రభుత్వాలు, సమస్యలను పరిష్కరించడం పక్కన పెట్టి, సవాళ్లు ప్రతిసవాళ్లతో కాలయాపన చేయడం సరి కాదు అని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే నిపుణులతో ఒక కమిటీని వేసి, రాబోయే కరువు విపత్తును ఎలా ఎదుర్కోవాలో ప్రణాళికలు సిద్ధం చేయాలని, లేనిపక్షంలో రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు, ఆకలి చావుల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంద్ జీ, రాష్ట్ర సమితి సభ్యులు కె.కేశవ్ గౌడ్, జిల్లా సమితి సభ్యులు పి.కృష్ణజీ, మర్యాద వెంకటయ్య, బాలపీర్, కొత్త రామస్వామి, గాలెన్న, తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వేకు లైసెన్స్ సర్వేయర్లు సహకరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన

**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** ప్రభుత్వం గ్రామాల రీసర్వేకు జిల్లాలో మొదటి దశలో 70 గ్రామాలను ఎంపిక చేసిందని, లైసెన్స్ సర్వేయర్లు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్లో రీసర్వేకు సంబంధించి జిల్లాలోని లైసెన్స్ సర్వేయర్లతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల రీసర్వేకు నిర్ణయించినందున లైసెన్స్ పొందిన సర్వేయర్లకు పారితోషికం చెల్లించి సర్వే పనులు చేయించుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే పారితోషికం



సరిపోదనే విమర్శలు చేయకుండా భవిష్యత్తులో లైసెన్స్ సర్వేయర్లకు మంచి అవకాశాలు వస్తాయనే ఆశావహ దృక్పథంతో ముందుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు లైసెన్స్ సర్వేయర్లు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు లైసెన్సు సర్వేయర్లుగా గుర్తింపు ఇచ్చినప్పటికీ తమకు స్థిరమైన ఉపాధి, ఆదాయ అవకాశాలు ఇవ్వనందున ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. గ్రామాల రీసర్వేకు తమ సేవలందించాలంటే ప్రభుత్వం పారితోషికం పెంచాలని, టిఎ, డిఎ, తదితర అలవెన్స్‌లు కల్పించాలన్నారు. లేదంటే ప్రతినెల కనీస వేతనంగా తమకు రూ.60వేల చొప్పున చెల్లించాలని, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. స్పందించిన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ లైసెన్స్ సర్వేయర్ల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో సర్వే ఏడి నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

## సివిల్స్ పరీక్షలు రాసేందుకు ఉచిత శిక్షణ

**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** బిసి స్టడీ సర్కిల్ హైదరాబాద్ లో సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) పరీక్ష2027 రాసేందుకు అర్హులైన అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు గద్వాల బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసి 35 సంవత్సరాలలోపు ఉన్న అభ్యర్థులు అర్హులని చెప్పారు. ఆగస్టు 16న నిర్వహించే రాత పరీక్ష ద్వారా ఎంపికైన 150 మంది అభ్యర్థులకు ఆగస్టు 24 నుంచి హైదరాబాదులో 10 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 17 నుండి ఆగస్టు 7వ తేదీలోగా www.tgbcsstudy.cgg.gov.in వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు భోజన వసతికై నెలకు రూ.5000 స్టయిఫండ్ చెల్లిస్తారని, స్టడీ మెటీరియల్‌కు రూ.5000 ఇవ్వనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50లక్షల లోపు, పట్టణ ప్రాంత వాసులకు రూ.2.00లక్షల లోపు మాత్రమే ఉండాలన్నారు. అర్హులైన వారిలో నుంచి 75 శాతం సీట్లు బీసీలకు, మిగిలిన 25 శాతం సీట్లు ఇతరులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల నిరుద్యోగులకు వినియోగించుకోవాలని, మరిన్ని వివరాలకు 08546293022, 9985434941 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## రూ.2.50 లక్షల ఎల్‌ఒసి అందజేత

**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూరు నియోజకవర్గం వడ్డేపల్లి మండలం తనగల గ్రామానికి చెందిన కె.విజయులు తీవ్ర కాలేయ (లివర్) వైఫల్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న నేపథ్యంలో వారి వైద్య ఖర్చుల నిమిత్తం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధి సిఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.2,50,000 విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ ఎల్ఓసి ను ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ.సంపత్‌కుమార్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.ఏ.సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం పొందలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు తమ విజ్ఞప్తికి వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2.50 లక్షల ఎల్ఓసి మంజూరు అయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ.సంపత్‌కుమార్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజ మాజీ సింగల్ విండో అధ్యక్షులు జాన్నయ్య, సంకపురం రాముడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## 641 జిఒ రద్దుకు ఉద్యమిద్దాం.. సిద్దాపూర్‌ను కాపాడుకుందాం

యార్డు వ్యతిరేక కమిటీ




**ప్రజాపక్షం/కొత్తూరు:** ప్రశాంత వాతావరణంలో జీవనం సాగిస్తున్న గ్రామంలో వేయనున్న చెత్త డంపింగ్ యార్డును రద్దు చేయకుంటే రాజకీయ పార్టీలకు అతీతంగా పోరాటం చేయడానికి సిద్ధం కావాలని యార్డు వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు మిట్టునాయక్ పిలుపునిచ్చారు. బుధవారం కొత్తూరు మండల పరిధిలోని వైఎం తండాలో ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్ ఆధ్వర్యంలో చెత్త డంపింగ్ యార్డు వ్యతిరేక కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మిట్టునాయక్ మాట్లాడుతూ సిద్దాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్న చెత్త డంపింగ్ యార్డును తక్షణమే రద్దు చేయాలని, లేదంటే ఉద్యమాలకు శ్రీకారం చుట్టడం ఖాయమని హెచ్చరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రాంచందర్ నాయక్, రూప్లానాయక్, ప్రధాన కార్యదర్శిగా బిచ్చానాయక్, కార్యదర్శులుగా గోపాల్‌నాయక్, సిద్దాపూర్ సర్పంచ్ బాసునాయక్, రెడ్యానాయక్, బాబురాజ్ నాయక్, వైఎం తండా సర్పంచ్ గోవింద్‌నాయక్, రమేష్‌నాయక్, ఉపసర్పంచ్ రాందాస్ నాయక్, లక్ష్మ ణ్‌నాయక్‌లను ఎన్నుకున్నారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చేయూత



**ప్రజాపక్షం/యాచారం :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని మొండిగౌరేల్లి గ్రామానికి చెందిన కట్టేల చంద్ర కాంత్, గౌడుకొండ్ల ప్రవీణ్ అన్నారు. బుధవారం పాఠశాలకు బీరువాను అందజేశారు. ఈ సంధర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులు చదువుకుంటున్నారని, వారికి సహకరించాల్సి భాధ్యత మనపై ఉందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుల్తానా పాఠశాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళమ్మ, మంజుల,లలిత, ఎట్టి కేబుల్, ప్రశాంత్‌కుమార్, తాండ్ర కుమార్, బడే ప్రవీణ్, బోరిగ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వజ్రాయుధం



**ప్రజాపక్షం/కొందుర్గు:** ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలను విధిగా పూర్తి చేసి సంబంధిత బిఎల్ఓలకు ఇచ్చేందుకు కృషి చేయాలని మాజీ వైస్ ఎంపిపి రాజేష్ పటేల్ సూచించారు. బుధవారం కొందుర్గు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చౌడపురం ప్రభాకర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజేష్ పటేల్ మాట్లాడుతూ ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యంలో వజ్రాయుదమని, అలాంటి పవిత్రమైన ఓటును కోల్పోకుండా ప్రభుత్వం చేపట్టిన సర్ కార్యక్రమంలో ప్రజలందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొందుర్గు ఉప సర్పంచ్ చంద్రశేఖర్, జీపిఓలు హరీష్, లక్ష్మి, నేతలు కారుకొండ యాదగిరి, సున్నాల శ్రీనివాస్, కృష్ణ, సంజు, సాయిలు పాల్గొన్నారు.

## ఓటు హక్కు అత్యంత విలువైనది



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రజాస్వామ్య బలోపేతం కోసం ఓటు హక్కు అత్యంత విలువైందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఫరూక్‌నగర్ మండల పరిధిలోని రాసుమల్లగూడెం సర్పంచ్ నత్తి శివరాములు ఆధ్వర్యంలో ఇంటింటికి సాగుతున్న ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రాయికల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలలో వివరాలను నమోదు చేసే సమయంలో వివరాలను విధిగా పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, చించోడు సర్పంచ్ ర్యాకల శ్రీనివాస్, దేవునిపల్లి సర్పంచ్ మల్లేష్, కంసాన్‌పల్లి మాజీ ఎంపిటిసి తుపాకుల శేఖర్, చించోడు అనంతం, చించోడు రాజు, అప్పారెడ్డిగూడ మాజీ ఉప సర్పంచ్ సీతారాములు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజేష్‌రెడ్డితోపాటు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ డివిజన్‌లో 67.36శాతం డిజిటలైజేషన్ పూర్తి : ఆర్‌డిఓ సరిత

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అర్హులైన ఓటర్లకు ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతోనే ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతోపాటు 67.36శాతం డిజిటలైజేషన్ పూర్తి చేశామని షాద్‌నగర్ ఆర్‌డిఓ సరిత వివరించారు. బుధవారం మీడియాకు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ సరిత మాట్లాడుతూ షాద్‌నగర్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో ఇప్పటి వరకు 67.36శాతం డిజిటలైజేషన్ పూర్తి చేశామని తెలిపారు. బిఎల్‌ఓ, బిఎల్‌ఓఏల నుండి ఓటర్లు తీసుకున్న ఎన్యూమరేషన్ ఫారాలలో వివరాలను పూర్తిచేసి తిరిగి ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు.

## నందివనపర్తి ఎస్‌బిఐ బ్యాంక్‌కు పూర్తిస్థాయి మేనేజర్‌ను నియమించాలి

**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలోని ఎస్‌బిహెచ్ బ్యాంక్‌కు పూర్తి స్థాయి మేనేజర్‌ను నియమించాలని విహెచ్‌పియస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ళ జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలో ఉన్న ఎస్‌బిహెచ్ బ్యాంక్‌ను అయన సందర్శించారు. ఈసంధర్బంగా అయన మాట్లాడుతూ బ్యాంక్ మేనేజర్ బదిలీపై వెళ్లి రెండు నెలలు గడుస్తున్నా ఎందుకు మేనేజర్‌ను నియమించడం లేదన్నారు. ఇంచార్జిగా మాడ్గుల మేనేజర్‌తో విధులు నిర్వహించడంలో వినియోగ దారులు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంట రుణాలు గోల్డ్ లోన్స్, మహిళా సంఘాలకు రుణాలు పూర్తిగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో యంజాల చంద్రకాంత్,మూలి రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

# కురుమలగూడ చెత్త డంపింగ్ యార్డ్‌లో అక్రమాలు?

చెత్తను జవహర్‌నగర్‌కు తరలించాల్సింది పోయి అక్కడికక్కడే దహనం..
కోట్ల రూపాయల రవాణా బిల్లులపై అనుమానాలు...
రక్షణరంగ సంస్థ సమీపంలోనే చెత్త దహనం.. మిస్సైల్స్‌కు భారీ ప్రమాదం...
విషపూరిత పొగతో ప్రమాదంలో ప్రజల ఆరోగ్యం..
ఉన్నతస్థాయి విచారణకు స్థానికుల డిమాండ్





**ప్రజాపక్షం/హైదరాబాద్:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కురుమలగూడ చెత్త డంపింగ్ యార్డ్‌లో జరుగుతున్న వ్యవహారాలు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయి. ప్రతిరోజూ వందలాది ట్రాక్టర్లు, టిప్పర్లు, చెత్త వాహనాల ద్వారా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఘన వ్యర్థాలను ఈ డంపింగ్ యార్డ్‌కు తీసుకొచ్చి పోస్తున్నారు. సాధారణంగా ఇక్కడ సేకరించిన చెత్తను భారీ లారీల ద్వారా జవహర్‌నగర్‌లోని ప్రధాన డంపింగ్ యార్డ్‌కు తరలించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక కాంట్రాక్టర్లు కూడా నియమించబడి, రవాణాకు ప్రభుత్వ నిధులు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. అయితే స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం, జవహర్‌నగర్‌కు తరలించాల్సిన చెత్తలో గణనీయమైన భాగాన్ని అక్కడికి పంపకుండా కురుమలగూడ డంపింగ్ యార్డ్‌లోనే కావాలనే నిప్పంటించి దహనం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బయటకు మాత్రం చెత్తను లారీల ద్వారా జవహర్‌నగర్‌కు తరలించినట్లుగా రికార్డులు నిర్వహించి రవాణా బిల్లులు పొందుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో భారీ స్థాయిలో ప్రజాధనం దుర్వినియోగమవుతోందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### చెత్త దహనంతో విషపూరిత కాలుష్యం..

చెత్తను బహిరంగంగా తగలబెట్టడం వల్ల ప్లాస్టిక్, రబ్బరు, ఇతర వ్యర్థాల నుంచి విషపూరిత వాయువులు వెలువడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పొగ సమీపంలోని కాలనీల్లోకి వ్యాపించి చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. పర్యావరణ పరిరక్షణ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ చెత్త దహనం జరుగుతోందని ఆరోపిస్తున్నారు.

### రక్షణరంగ సంస్థకు పొంచి ఉన్న ప్రమాదం

ఈ డంపింగ్ యార్డ్‌కు అత్యంత సమీపంలో రక్షణరంగానికి సంబంధించిన కీలక తయారీ సంస్థ (డిఫెన్స్ తయారీ యూనిట్) ఉండటం పరిస్థితిని మరింత ఆందోళనకరంగా మారుస్తోంది. చెత్త దహనం సమయంలో ఎగిసిపడే నిప్పురవ్వలు, గాలి వేగం కారణంగా సమీప పరిశ్రమల వైపు వెళ్లే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా లోహాలు, ప్రత్యేక పదార్థాలు లేదా సున్నితమైన తయారీ ప్రక్రియలు జరిగే కేంద్రాలపై నిప్పురవ్వలు పడితే భారీ అగ్నిప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ప్రమాదం సంభవిస్తే కేవలం పరిశ్రమకే కాకుండా పరిసర ప్రాంతాలు, హైదరాబాద్ నగరానికే తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

### అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ శాఖల పాత్రపై ప్రశ్నలు

చెత్త దహనం తరచూ జరుగుతోందని స్థానికులు చెబుతున్నప్పటికీ, సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖలు ఈ వ్యవహారంపై సమగ్ర తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

### రవాణా రికార్డులపై విచారణ జరపాలి

కురుమలగూడ డంపింగ్ యార్డ్‌కు వచ్చిన చెత్త పరిమాణం, అక్కడి నుంచి జవహర్‌నగర్‌కు నిజంగా ఎంత చెత్త తరలించారు, ఎన్ని లారీల ద్వారా తరలించారు, వాటికి సంబంధించిన జీపీఎస్ వివరాలు, వెయ్‌బ్రిడ్జ్ రికార్డులు, బిల్లులు, చెల్లింపులు, కాంట్రాక్టర్ల వివరాలపై స్వతంత్ర విచారణ జరిపితే అసలు వాస్తవాలు బయట పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

### స్థానికుల ప్రధాన డిమాండ్లు

కురుమలగూడ డంపింగ్ యార్డ్‌లో జరుగుతున్న చెత్త దహనాన్ని వెంటనే నిలిపివేయాలి. జవహర్‌నగర్‌కు చెత్త రవాణాపై పూర్తి స్థాయి విజిలెన్స్ లేదా ఎసిబి విచారణ చేపట్టాలి.రవాణా బిల్లులు, జిపిఎస్, వెయ్‌బ్రిడ్జ్ రికార్డులను బహిర్గతం చేయాలి. రక్షణ రంగ సంస్థ భద్రత దృష్ట్యా డంపింగ్ యార్డ్‌లో ప్రత్యేక అగ్నిమాపక చర్యలు చేపట్టాలి. కాలుష్య నియంత్రణ మండలి గాలి నాణ్యత పరీక్షలు నిర్వహించి నివేదిక విడుదల చేయాలి. అక్రమాలు నిరూపితమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన

అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలో వైద్య,ఆరోగ్య శాఖ కార్యక్రమాలపై కొంగర కలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డా.స్వర్ణ కుమారితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి జిల్లాలో చేపడుతున్న తల్లి, శిశు ఆరోగ్య సేవలు, జాతీయ టీకాల కార్యక్రమం, క్షయవ్యాధి నియంత్రణ, మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ, నేషనల్ డీవార్మింగ్ డే కార్యక్రమం తదితర అంశాల పురోగతిని అధికారులతో సమీక్షించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రతి వైద్య సంస్థలో అవసరమైన మందులు, పరీక్షా కిట్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జ్వరాలపై ప్రత్యేక నిఘా, ఇంటింటి సర్వేలు, ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఉప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు, జిల్లా స్థాయి కార్యక్రమాల అధికారులు, వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నోడల్ అధికారులు, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సకాలంలో ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించండి

సోషల్ మీడియాలో అందుబాటులో ఫారం నింపే విధానం

ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు: ఆర్.వి.కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలను ఆగస్టు 3 వరకు తప్పనిసరిగా సమర్పించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. చివరి రోజు వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా ఫారాలను పూర్తి చేసి బూత్ లెవల్ అధికారులకు (బిఎల్ ఓలు) అందించాలని సూచించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన ఓటర్లకు 100 శాతం ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 7.8 శాతం మంది ఆన్‌లైన్‌లో ఫారాలు సమర్పించగా, అందిన ఫారాల్లో 25.5 శాతం వివరాలను డిజిటలైజ్ చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 47,36,669 మంది ఓటర్లు ఉన్నారని, క్షేత్రస్థాయి పరిశీలనలో 24.33 శాతం మంది ఎఎస్‌డి (గైర్హాజరు, ఇతర ప్రాంతాలకు మారిన, మరణించిన) ఓటర్లుగా గుర్తించినట్లు తెలిపారు. ఓటర్లకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారంతో పాటు ఫారం నింపే విధానంపై వీడియోలను సోషల్ మీడియాలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన వారి పేర్లతో ఆగస్టు 10న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఫారాల్లో తప్పులు ఉంటే అనంతరం ఫారం8 ద్వారా సరిచేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఆగస్టు 11 నుంచి సెప్టెంబర్ 9లోపు ప్రభుత్వం గుర్తించిన 11 రకాల గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం రాజకీయపార్టీలతో సమావేశాలు నిర్వహిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు కర్ణన్ తెలిపారు. కంటోన్మెంట్‌లో మిస్ అయిన 2,002 మంది ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేస్తామని చెప్పారు. బంజారాహిల్స్‌లో బిఎల్‌ఓపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించిన కర్ణన్, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్లాస్టిక్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం





**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఎల్‌బి నగర్ నియోజకవర్గం హస్తినాపురం డివిజన్ శ్రీరమణ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో ప్లాస్టిక్ గోదాంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా చెలరేగిన మంటలు క్షణాలోనే భారీ ఎత్తున చుట్టుకోవడంతో పక్కనే ఉన్న నూతన గృహానికి అంటుకోవడంతో ఇల్లు పూర్తిగా అగ్నికి అహుతి అయింది. నూతన గృహం శ్రీనివాస్‌కు చెందినది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. ఇంట్లో ఉన్న ఫర్నిచర్, ఎల్ఈడీ టీవీ, గృహపరికరాలు, రెండు ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధం అయ్యాయి. మూడు అంతస్తుల భవనం పూర్తిగా దెబ్బతిన్నది. సుమారు రూ.35 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఓగ్గు కథలు, అమ్మవారి పూజలు నిర్వహించి జీవన గడుపుతున్న తమ కుటుంబం ఒక్కసారిగా రోడ్డున పడ్డామని శ్రీనివాస్ కన్నీరు పెట్టుకున్నారు. ప్రభుత్వం అదుకోవాలని కోరారు.

### ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

బుధవారం సంఘటన స్థలాన్ని చేరుకుని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పరిశీలించారు. గోదాం పక్కన ఉన్న ఇంట్లో వస్తువులు, ఫర్నిచర్ పూర్తిగా కాలీ బుడిదైన వాటిని చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్ల మధ్యలో ఇలాంటి గోదాంలు ఉండకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అగ్ని ప్రమాదం వల్ల నష్టపోయిన వారికీ కలెక్టర్, రెవిన్యూ అధికారులచే మాట్లాడి తగు నష్టపరిహారం ఇప్పించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట ఆందోజు సత్యంచారి, శ్రీనివాస్ నాయక్, గోపి, మధు, భీమా నాయక్, నాగిరెడ్డి, సాయి యాదవ్, బిక్షపతి, విష్ణు, కింగ్ మధు తదితరులు ఉన్నారు.

### కొత్తూరులో మరో ప్రమాదం

**కొత్తూరు:** బుధవారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని బాబూలాల్ గోదాం వద్ద ఉన్న ప్లంబర్ గోదాములోకి గడ్డివాము దగ్దమైన నిప్పురవ్వలు ప్రమాదవశాత్తు పడి ప్లంబర్‌కు సంబంధించి సామాగ్రి పూర్తిగా కాలిపోయిందని, దాంతో రూ.5లక్షల ఆస్తి నష్టం వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. గడ్డివాము నిమిషాల వ్యవధిలోనే అగ్నికి ఆహుతి కావడంతోపాటు సమీపంలోనే ఉన్న ఓం ప్రకాష్ అనే వ్యక్తికి చెందిన ప్లంబర్ గోదాంకు మంటల వ్యాపించడంతో అక్కడ ఉన్న ప్లాస్టిక్ పైపులు, ఇతర సామాగ్రి పూర్తిగా కాలిపోయినట్లు యజమాని ఓం ప్రకాష్ తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో హుటాహుటిని ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే అక్కడ ఉన్న సామాగ్రి పూర్తిగా కాలిపోయిందని వివరించారు. ఈ విషయంపై కొత్తూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డు వద్దంటూ విద్యార్థుల ఆందోళన

**ప్రజాపక్షం/కొత్తూరు:** సిద్దాపూర్ గ్రామం చెత్త డంపింగ్ యార్డుకు అడ్డా కాదని.. పచ్చని పంటపొలాలకు కేంద్రమైన గ్రామం అనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి సూచించారు. బుధవారం కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ గ్రామంలో చెత్త డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ జెఏసి ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు, విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేపట్టారు. విద్యార్థులు ప్లేకార్డులు పట్టుకొని డంపింగ్ యార్డు రావొద్దు..రావొద్దు అంటూ నినాదాలు చేయడంతోపాటు 641జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దాపూర్‌లో చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే పర్యావరణం పూర్తిగా దెబ్బతినే అస్కారం ఉంటుందని, సిద్దాపూర్‌తోపాటు అనేక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అస్కారం ఉంటుందని వివరించారు. పర్యావరణంలో కాలుష్యం పెరగడంతోపాటు ప్రజలు అనేక రకాల వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంటుందని, చెత్త డంపింగ్ యార్డు నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉప సంహరించుకోవాలని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించి చెత్త డంపింగ్ యార్డు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఆకాంక్షించారు.



## పారదర్శకంగా పాలన అందించడమే లక్ష్యం





షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజలకు పారదర్శకమైన పరిపాలన అంధించాలన్నదే లక్ష్యమని, ఆదిశగానే ప్రభుత్వం ముందుకు వెళ్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం నందిగామ మండలం మోత్కులగూడ గ్రామంలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ డిఎంఎఫ్‌టి నిధుల నుంచి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలకు, మోత్కూలగూడ నుండి కేసారం వరకు నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. ఫరూఖ్‌నగర్ నుండి ఈదులపల్లి గ్రామం వరకు నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపిఓ చక్రధర్ గౌడ్, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుమార్‌స్వామిగౌడ్, మాజీ అధ్యక్షుడు జంగ నరసింహులు, మోత్కులగూడ సర్పంచ్ జట్ట లావణ్య రమేష్, సర్పంచ్‌లు కొమ్ము కృష్ణ, బుగ్గ సాలయ్య, మల్లేష్, గొర్లపల్లి అశోక్, మంకాల శ్రీశైలం, నాయకులు స్వామి, చంద్రపాల్‌రెడ్డి, డైరెక్టర్ నర్సింహులుగౌడ్, జట్ట రాజు పాల్గొన్నారు.

### ప్రణాళికాబద్ధంగా సర్ ప్రక్రియ

ప్రణాళికా బద్ధంగా సర్ ప్రక్రీయను చేపట్టేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. బుధవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 12,13,14 వార్డుల్లో ఉన్న 231,234,228,227 పోలింగ్ బూతుల్లో అధికారులు నిర్వహిస్తున్న ఓటరు నమోదు ప్రక్రియను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. అనంతరం 12వ వార్డులో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునితారెడ్డి, కౌన్సిలర్లు దిలీప్, రిజ్వానభేగం, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, నాయకులు నల్లమోని శ్రీధర్, రాయికల్ శ్రీనివాస్, తుపాకుల శేఖర్, ముబారక్, నవీన్, సత్తయ్య, రవితేజ, సీతారాం, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్దే ధ్యేయం

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం మంచాల మండలం రంగాపూర్ గ్రామంలో రోడ్డు విస్తరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఎస్‌డిఎఫ్ నిధులు 9కోట్ల రుపాయలతో రంగాపూర్ నుంచి మాల్ గ్రామం వరకు నిర్మాణ పనులు శంకు స్థాపన చేశారు. అనంతరం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మంచాల మండలం లింగంపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్‌లను అర్హులైన లబ్ధిదారులకు ఎంపిక పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లు పరిపాలించి ఏనాడు పేద ప్రజల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. నియోజక వర్గానికి అధిక నిధులు తీసుక వచ్చి విద్య, వైద్యంతో పాటు రోడ్లు, భవనాలను, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో యుద్ధ ప్రాతిపధికంగా సంక్షేమం, అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు విమర్శించటం తగదన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ వై.శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, తహసీల్దార్ ప్రసాద్ సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



### భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం వ్యతిరేకిస్తూ

# రైతుల మోటార్‌సైకిల్ ర్యాలీ

**ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని కేంద్రానికి స్పష్టీకరణ**



**హోషియాపూర్ :** భారత్–అమెరికా మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై విపక్షాలు, రైతుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఒప్పందం రైతులకు మరణ శాసనం లాంటిదని, ఏ పరిస్థితుల్లోనూ దీనిని అంగీకరించేది లేదని నిరసనకారులు స్పష్టం చేస్తున్నారు. కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ, ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందాన్ని విరమించుకుని రైతులు, సామాన్య ప్రజల ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా, ఒప్పందం దేశ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తుందని ఆరోపిస్తూ, బుధవారం పంజాబ్‌లోని హోషియాపూర్‌లో రైతులు మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలోని 'దేశ్ బచావో మోర్చా' ఆధ్వర్యంలో వివిధ రైతు సంఘాల పిలుపు మేరకు ఈ ర్యాలీ జరిగింది. ర్యాలీని 'కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ' (పిద్ది గ్రూప్) నిర్వహించింది.
సంఘం జిల్లా అధ్యక్షుడు పరమ్‌జిత్ సింగ్ భుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్దీప్ సింగ్ బెగోవాల్ నాయకత్వంలో తండా సమీపంలోని గురుద్వారా పుల్ పుఖ్తా సాహిబ్ వద్ద 'అర్దాస్' (ప్రార్థన) అనంతరం ర్యాలీ ప్రారంభమై తండా, దసుయా, మియాని ప్రాంతాల మీదుగా సాగింది. అనంతరం నిరసనకారులు దసుయా సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్‌డిఎం) కన్వల్‌జిత్ సింగ్ కార్యాలయానికి చేరుకుని, ప్రతిపాదిత భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ ప్రధానమంత్రికి ఉద్దేశించిన వినతిపత్రాన్ని సమర్పించారు. తక్కువ ధరకు లభించే వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతికి ఈ ఒప్పందం మార్గం సుగమం చేస్తుందని, తద్వారా దేశీయ రైతుల ఆదాయం, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటాయని వారు ఈ వినతిపత్రంలో పేర్కొన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి భుల్లా మాట్లాడుతూ తక్కువ ధరకు దిగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తుల నుంచి వచ్చే పోటీ కారణంగా ఈ ఒప్పందం రైతులకు, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు హానికరంగా మారుతుందని ఆరోపించారు. 'భారత్–అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలి, దేశ రైతులు, సామాన్య పౌరుల ప్రయోజనాలను పరిరక్షించాలి' అని వారు అన్నారు. తమ డిమాండ్‌ను ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమైతే, ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధమైన మార్గాల ద్వారా దేశవ్యాప్త భారీ ఉద్యమాన్ని చేపడతామని వారు హెచ్చరించారు. పంజాబ్ ప్రభుత్వ 'ల్యాండ్ పూలింగ్' విధానాన్ని కూడా భుల్లా విమర్శించారు. సారవంతమైన వ్యవసాయ భూములను నివాస, వాణిజ్య ప్రాజెక్టులకు మళ్లించడం ద్వారా సాగు భూమి తగ్గిపోతుందని, రైతు కుటుంబాల జీవనోపాధి దెబ్బతింటుందని ఆయన ఆరోపించారు. ఈ విధానం ప్రధానంగా పెద్ద బిల్డర్లు, రియల్ ఎస్టేట్ కంపెనీలకే ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన పేర్కొన్నారు. నిరసనకారులు కేంద్ర, పంజాబ్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై ఏకం కావాలని రైతులు, వ్యవసాయ కూలీలు, యువతకు పిలుపునిచ్చారు.

# వాంగ్‌చుక్ నిరాహారదీక్షను విస్మరించడం క్రూరం

**'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే**



**న్యూఢిల్లీ :** నిరసనకారులతో చర్చలు జరపడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తూ 'క్రూరంగా' వ్యవహరిస్తోందని 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మండిపడ్డారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా జంతర్ మంతర్ వద్ద సిజెపి చేపట్టిన నిరసన బుధవారంతో 26వ రోజుకు చేరుకుంది. అదే విధంగా నిరసనకు సంఘీభావంగా పర్యావరణ కార్యకర్త చేపట్టిన నిరాహారదీక్ష 18వ రోజు కూడా కొనసాగింది. సోనమ్ వాంగ్‌చుక్ నిరంతర వైద్య పర్యవేక్షణలో ఉన్నారు. సిజెపి విడుదల చేసిన వైద్య బులెటిన్ ప్రకారం, వాంగ్‌చుక్ ఇంకా చాలా బలహీనంగా ఉన్నారు. 24 గంటల వైద్య పర్యవేక్షణలో ఉన్నారు. ఆయన బరువు 57.15 కిలోలకు పడిపోయింది. గత 24 గంటల్లో 400 గ్రాముల బరువు తగ్గడంతో, దీక్ష ప్రారంభమైనప్పటి నుండి ఆయన మొత్తం 8.9 కిలోల బరువు తగ్గారు. రక్తపోటు 105/76గా, రక్తంలో చక్కెర స్థాయి 80 ఎంజి/డిఎల్‌గా, ఆక్సిజన్ స్థాయి 97 శాతంగా నమోదయ్యాయి, అలాగే శరీరంలో నీటి శాతం (హైడ్రేషన్) సంతృప్తికరంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన స్పృహతో, మానసికంగా చురుకుగా ఉన్నప్పటికీ, నిరంతర పర్యవేక్షణ అవసరమని వైద్యులు తెలిపారు. కాగా, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు న్యాయం కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన వ్యక్తికి ప్రభుత్వం నుండి లభించింది కేవలం మౌనం మాత్రమేనని, ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడమే కాకుండా, క్రూరంగా కూడా ఉందని దీప్కే ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చర్చలకు ఎందుకు నిరాకరిస్తున్నారని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఇప్పటివరకు ఎందుకు బాధ్యులను చేయలేదు అనేవి సమాధానం కోరుతున్న ప్రశ్నలని దీప్కే అన్నారు. 'ప్రధానమంత్రి చర్చలకు ఎందుకు నిరాకరిస్తున్నారు? విద్యాశాఖ మంత్రిని ఎందుకు ఇంకా బాధ్యులను చేయడం లేదు? ఇవే సమాధానం కోరుతున్న ప్రశ్నలు; అధికారంలో ఉన్నవారిని బాధ్యత నుండి తప్పించడానికి ఉపయోగపడే పక్కదారి పట్టించే అంశాలు కావు' అని ఆయన అన్నారు.

**సోనమ్ ఆరోగ్యంపై మీ వైఖరేమిటి?**
సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం మరింత క్షీణించిందని, రెండు రోజుల్లో చనిపోయే ప్రమాదం ఉందని, వెంటనే జోక్యం చేసుకుని ఆయనను రక్షించాలంటూ ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన హైకోర్టు, సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం తమ వైఖరిని తెలియజేయాలని నోటీసులు జారీ చేసింది. కేసును గురువారం మరోసారి విచారించనున్నట్లు వెల్లడించింది. సోనం వాంగ్‌చుక్ జూన్ 28 నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. దీక్ష కొనసాగుతున్న కొద్దీ ఆయన ఆరోగ్యం ఆందోళనకరంగా మారిందని రాకేశ్ కుమార్ సైనీ పిల్‌ను దాఖలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరైన ఆయన, వాంగ్‌చుక్ ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోందని, ప్రాణాపాయం తలెత్తే పరిస్థితి ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వైద్య సహాయం అందేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

## మమత వర్గంలో మరో ఎమ్మెల్యే జంప్



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వర్గానికి మరో రాజకీయ దెబ్బ తగిలింది. సీనియర్ టిఎంసి ఎమ్మెల్యే మదన్ మిత్రా బుధవారం ప్రతిపక్ష నేత రీటాబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు శిబిరంలో చేరారు. అయినప్పటికీ, తాను పార్టీలోనే కొనసాగుతున్నానని ఆ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మమతా బెనర్జీకి అనుబంధంగా ఉన్న 'కాళీఘాట్ టిఎంసి' కింద పనిచేస్తున్న అన్ని జాతీయ, రాష్ట్ర సంస్థాగత కమిటీలకు రాజీనామా చేస్తున్నట్లు, అలాగే పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో పార్టీ చీఫ్ విప్ పదవికి కూడా తక్షణమే రాజీనామా చేస్తున్నట్లు కామర్‌హట్టి సీనియర్ ఎమ్మెల్యే ప్రకటించారు. సంస్థాగత చీలిక బహిరంగంగా వెలుగులోకి వచ్చినప్పటి నుంచి తిరుగుబాటు శిబిరంలోకి జరిగిన అత్యంత ముఖ్యమైన ఫిరాయింపు ఇదే. ఇది మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తుందని భావిస్తున్నారు. 'నేను నా గదిని మాత్రమే మార్చుకున్నాను, ఇంటిని కాదు. నేను పూర్తిగా టిఎంసిలోనే ఉన్నాను' అని అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో రీటాబ్రత బెనర్జీని కలిసిన అనంతరం మిత్రా విలేకరులతో అన్నారు. తెల్ల కుర్తా ధరించి, తన ట్రేడ్‌మార్క్ అయిన నల్ల కళ్లజోడు పెట్టుకుని, మిత్రా తిరుగుబాటు నాయకురాలి పక్కన కూర్చున్నారు. తాను తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే, మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గం కింద ఇకపై ఎలాంటి సంస్థాగత బాధ్యతలు చేపట్టబోనని ఆయన ప్రకటించారు.

# బిజెపితో రహస్య చర్చలేమీ లేవు

**డీలిమిటేషన్‌పై బిల్లు పెట్టిన తరువాతే ఇండియా కూటమి చర్చిస్తుంది : సుప్రియా సూలే**



**ముంబయి :** ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం పలు రాష్ట్రాల్లో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలో పార్టీల్లో చీలికలు వచ్చాయి. అయితే ఎన్‌సిపి (ఎస్‌పి), మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ మధ్య జరిగిన సమావేశాలపై వస్తున్న ఊహాగానాలను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే తోసిపుచ్చారు. ఈ సమావేశాల వెనుక ఎలాంటి రాజకీయ వ్యూహం లేదన్నారు. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో సూలే మాట్లాడుతూ, ఎన్‌సిపి (ఎస్‌పి) మున్సిపల్ కౌన్సిల్ అధ్యక్షుడిపై తీసుకున్న చర్యల విషయాన్ని ప్రస్తావించడానికి సీనియర్ పార్టీ నాయకుడు జయంత్ పాటిల్ అధికారికంగా ఫడ్నవిస్‌తో అపాయింట్‌మెంట్ కోరారని చెప్పారు. 'జయంత్ పాటిల్ అధికారికంగా ముఖ్యమంత్రితో సమయం కోరి, ఆయన కారులో వెళ్లి, కారులోనే తిరిగి వచ్చారు. ఆ సమావేశంలో రహస్యమేమీ లేదు. ముఖ్యమంత్రి నివాసంలో ఆయన్ను ఇంకా ఎవరు కలిశారో మీరు తెలుసుకోవాలనుకుంటే, ముఖ్యమంత్రినే అడగాలి, నన్ను కాదు,' అని ఆమె అన్నారు. మంగళవారం రాత్రి పొద్దుపోయాక ముఖ్యమంత్రి అధికారిక నివాసమైన 'వర్ష'లో అధికార ఎన్‌సిపి, ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకుల సమావేశాలు మహారాష్ట్రలో రాజకీయ సమీకరణాలు మారబోతున్నాయనే ఊహాగానాలకు ఆజ్యం పోశాయి. ఈనెల 20న ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ సీట్లను 850కి పెంచి, నియోజకవర్గాల పునర్విభజనను ప్రారంభించే 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు మద్దతు కూడగట్టేందుకు, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి (ఎస్‌పి), డిఎంకెలను బిజెపి ప్రలోభపెడుతోందని కాంగ్రెస్ నాయకుడు పి. చిదంబరం చేసిన ఆరోపణల నేపథ్యంలో ఈ సమావేశాలు జరిగాయి. ఎన్‌సిపి (ఎస్‌పి) అధికార కూటమిలో చేరనుందన్న ఊహాగానాలను తోసిపుచ్చుతూ, గత 12 ఏళ్లుగా మీడియా తన ప్రమాణ స్వీకారం, మంత్రి పదవి గురించి అంచనాలు వేస్తోందని సూలే అన్నారు. 'ఎవరికి ఏ మంత్రి పదవి ఇవ్వాలో ముఖ్యమంత్రి మాత్రమే నిర్ణయిస్తారు. ఆర్థిక శాఖ గురించి గానీ, వర్షలో జరిగిన సమావేశాల గురించి గానీ వస్తున్న ఈ వార్తలన్నీ ఊహాగానాలే. ఇలాంటి ప్రశ్నలకు ముఖ్యమంత్రి మాత్రమే సమాధానం చెప్పగలరు' అని ఆమె అన్నారు. ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై సూలే మాట్లాడుతూ కేంద్రం పార్లమెంటులో అధికారిక బిల్లును ప్రవేశపెట్టిన తర్వాతే 'ఇండియా' కూటమి తన వైఖరిని స్పష్టం చేస్తుందని అన్నారు. 'నియోజకవర్గాల పునర్విభజనపై మాకు ఎలాంటి ప్రతిపాదన అందలేదు. బిల్లు వచ్చిన తర్వాత, 'ఇండియా' కూటమిలో దానిపై వివరంగా చర్చిస్తాం. మేము గతంలోనే ఫార్ములాను లిఖితపూర్వకంగా ఇవ్వాలని డిమాండ్ చేశాం. చట్టాన్ని చూడకుండా మేము వ్యాఖ్యానించలేం' అని ఆమె అన్నారు. తాను 19న న్యూఢిల్లీలో జరిగే ఇండియా బ్లాక్ సమావేశానికి, 20న పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆధ్వర్యంలో జరిగే అఖిలపక్ష సమావేశానికి హాజరవుతానని బారామతి ఎంపి తెలిపారు. ఇండియా కూటమి ప్రతిపక్ష పార్టీల కూటమి అయినప్పటికీ, అది ఎల్లప్పుడూ భారతదేశానికే అండగా నిలిచిందని ఆమె అన్నారు. 'దేశంపై దాడి జరిగినప్పుడు, కాంగ్రెస్ దేశానికి, ప్రభుత్వానికి అండగా నిలిచింది. ఆ దాడి దేశంపైనే జరిగిందని, ఏ వ్యక్తిపైనో లేదా పార్టీపైనో కాదని రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో, భారతదేశ వైఖరిని తెలియజేయడానికి 100 మంది ఎంపిలు విదేశాలకు వెళ్లారు. ఆ సమయంలో ఎన్‌డిఎ లేదా ఇండియా కూటమి అనే ప్రశ్నే లేదు. మాకు దేశమే ప్రథమం, ఆ తర్వాతే రాష్ట్రం, పార్టీ, ఆపై కుటుంబం' అని ఆమె గుర్తు చేశారు. ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లుపై ప్రతిపక్షాల వైఖరిపై వస్తున్న ఊహాగానాలను ప్రస్తావిస్తూ, ఇండియా బ్లాక్‌కు వ్యతిరేకంగా వెళ్లే ప్రసక్తే లేదని ఆమె అన్నారు.

## ఆర్థిక సంక్షోభం వైపు దేశం..

**మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలే కారణం : కాంగ్రెస్**



**న్యూఢిల్లీ :** మోదీ ప్రభుత్వ 'ప్రజా వ్యతిరేక విధానాల' కారణంగా దేశం ఆర్థిక సంక్షోభం వైపు వేగంగా అడుగులు వేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. జూన్ నెలలో టోకు ధరల ద్రవ్యోల్బణం 9.87 శాతానికి పెరగడంతో ఈ వ్యాఖ్యలు చేసింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణంపై ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ ఈ ఆర్థిక వైఫల్యానికి ఆయనే బాధ్యత వహించాలని పేర్కొంది. 'మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశం ఆర్థిక సంక్షోభం వైపు వెళ్తోంది. గత కొన్ని నెలలుగా కాంగ్రెస్ పార్టీ దీని గురించి ప్రభుత్వాన్ని పదేపదే హెచ్చరిస్తూనే ఉంది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదరి జైరామ్ రమేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. గత 44 నెలల్లోనే అత్యధిక స్థాయికి (9.87%) చేరిన టోకు ద్రవ్యోల్బణం, ఇంధనం, విద్యుత్ ధరలలో భారీగా (27.4%) నమోదైన పెరుగుదల మధ్య, వ్యవసాయ సాగు విస్తీర్ణం మూడేళ్ల కనిష్ట స్థాయికి పడిపోయిందని ఆయన తెలిపారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగ భారం కింద సామాన్య ప్రజలు సతమతమవుతుండగా, రైతులు ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రెట్టింపు కష్టాలను ఎదుర్కొంటున్నారని రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ద్రవ్యోల్బణం పెరగడం వల్ల పరిశ్రమల నిర్వహణ వ్యయం కూడా పెరిగిందని ఆయన ఎత్తిచూపారు. ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన కీలక సూచీలన్నీ రెడ్ అలర్ట్ (ప్రమాద హెచ్చరిక) సంకేతాలను ఇస్తున్న తరుణంలో, పరిస్థితిని చక్కదిద్దడానికి బదులుగా మోదీ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేలా వార్తల్లో నిలవడానికే ప్రాధాన్యతనిస్తోందని రమేశ్ విమర్శించారు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి బదులుగా, ఆందోళనకరమైన ద్రవ్యోల్బణ గణాంకాలను దాచిపెట్టడానికే ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. తాజా టోకు ద్రవ్యోల్బణ గణాంకాలు మోదీ ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ లోపానికి, వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనంగా నిలిచాయన్నారు. 'ప్రధానమంత్రి గారూ, ద్రవ్యోల్బణం విషయంలో దేశం మీ సమాధానాన్ని కోరుతోంది; 12 ఏళ్లుగా పాలన సాగిస్తున్న మీరు, ఈ ఆర్థిక వైఫల్యానికి తప్పక సమాధానం చెప్పాలి' అని ఆయన అన్నారు. ఆహారేతర, ఆహార ఉత్పత్తుల ధరలు భారీగా పెరగడంతో, టోకు ధరల ద్రవ్యోల్బణం మే నెలలోని 9.68 శాతం నుండి జూన్ నెలలో 9.87 శాతానికి పెరిగింది.

### అమరవీరుల దినోత్సవ ర్యాలీ...

# 'టిఎంసి'కి హైకోర్టు అనుమతి



**కోల్‌కతా :** మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వర్గానికి హైకోర్టులో ఊరట లభించింది. బిర్లా ప్లానెటేరియం సమీపంలో ఈనెల 21 అమరవీరుల దినోత్సవ ర్యాలీని నిర్వహించుకోవడానికి కోలకత్తా హైకోర్టు అనుమతించింది. ఈ మేరకు పోలీసులను ఆదేశించింది. గత కొన్నేళ్లుగా సెంట్రల్ కోల్‌కతాలోని ఎస్ప్లనేడ్‌లో ఉన్న విక్టోరియా హౌస్ ముందు టిఎంసి జులై 21న అమరవీరుల దినోత్సవ ర్యాలీని నిర్వహిస్తోంది. అయితే ట్రాఫిక్ సజావుగా సాగేందుకు, శాంతి భద్రతలను కాపాడేందుకు ర్యాలీ వేదికను విక్టోరియా హౌస్ ముందు నుంచి బిర్లా ప్లానెటేరియం సమీపానికి మార్చాలని హైకోర్టు ఆదేశించింది. సమావేశం నిర్వహించేందుకు అనుమతి కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ అనంతరం, బిర్లా ప్లానెటేరియం ముందున్న రోడ్డుపై మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వర్గం అమరవీరుల దినోత్సవ ర్యాలీని నిర్వహించుకోవడానికి అనుమతించాలని జస్టిస్ సౌగత భట్టాచార్య కోల్‌కతా పోలీసు అధికారులను ఆదేశించారు. కోల్‌కతా నగర నడిబొడ్డున ఉన్న ఎస్ప్లనేడ్ ప్రాంతానికి సమీపంలో కాంగ్రెస్ పార్టీ, టిఎంసి ప్రత్యర్థి వర్గం నిర్వహించే మరో రెండు అమరవీరుల దినోత్సవ సమావేశాలు కూడా జరగనున్నాయని గమనించిన కోర్టు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు తగినంత మంది సిబ్బందిని నియమించాలని పోలీసు అధికారులను ఆదేశించింది. బిర్లా ప్లానెటేరియం ముందున్న రోడ్డుకు ఒక వైపున పిటిషనర్ సంస్థ సమావేశం నిర్వహించుకోవడానికి అనుమతించాలని, మరో వైపును వాహనాల రాకపోకలకు ఖాళీగా ఉంచాలని జస్టిస్ సౌగత భట్టాచార్య కోల్‌కతా పోలీసు అధికారులను ఆదేశించారు. పాల్గొనేవారి సంఖ్యను 2,500 లోపు ఉంచడానికి పిటిషనర్ పార్టీ ప్రయత్నించాలని కోర్టు పేర్కొంది. ఒకే రోజు మూడు వేర్వేరు ప్రదేశాలలో మూడు సమావేశాలు జరగనున్నందున, శాంతిభద్రతలను కాపాడటానికి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు తగినంత మంది సిబ్బందిని నియమించాలని కోర్టు కోర్టు తెలిపింది. 21న మధ్యాహ్నం 12 గంటల నుండి 3.30 గంటల మధ్య సమావేశం నిర్వహించాలని కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశం అమలు జరిగేలా చూసే 20 మంది వలంటీర్ల పేర్లు, మొబైల్ నంబర్లను పిటిషనర్లు కోల్‌కతా పోలీస్ జాయింట్ కమిషనర్ (హెడ్‌క్వార్టర్స్)కు అందించాలని జస్టిస్ భట్టాచార్య ఆదేశించారు.

## రాజ్యసభ సభ్యులుగా ఇద్దరు ప్రమాణం




**న్యూఢిల్లీ :** ఇటీవల నూతనంగా ఎన్నికైన ఇద్దరు రాజ్యసభ సభ్యులు బుధవారం పదవీ ప్రమాణం చేశారు. మన్సూర్ అలీ ఖాన్, రాజ్‌నీశ్ కుమార్ అగర్వాలతో రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ చైర్మన్ హరివంశ్, సెక్రటరీ జనరల్ పిసి మోదీ కూడా పాల్గొన్నారు. కాంగ్రెస్ నేత ఖాన్ కర్నాటక నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. బిజెపికి చెందిన అగర్వాల్ మధ్యప్రదేశ్ నుంచి ఎన్నికయ్యారు. ఖాన్ ఇంగ్లీష్‌లో ప్రమాణం చేయగా, అగర్వాల్ హిందీలో ప్రమాణం చేశారు.

## టోల్ వసూలు, రోడ్ల నిర్మాణ నాణ్యత, భద్రతపై పిఎసి చర్చ



**న్యూఢిల్లీ :** జాతీయ రహదారులపై టోల్ వసూలు, రోడ్ల నిర్మాణ నాణ్యత, రహదారి భద్రత వంటి అంశాలపై పార్లమెంటు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి) బుధవారం సమగ్రంగా చర్చించింది. కాంగ్రెస్ నాయకుడు కె.సి. వేణుగోపాల్ నేతృత్వంలోని పిఎసి, పార్లమెంట్ భవన సముదాయంలో 'ప్రజా మౌలిక సదుపాయాలు, ఇతర ప్రజా వినియోగ సేవలపై రుసుములు, టారిఫ్‌లు, వినియోగదారుల ఛార్జీల విధింపు, నియంత్రణ' అనే అంశంపై ఈ చర్చను నిర్వహించింది. ఈ సమావేశంలో రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఎఐ), ఇతర సంబంధిత సంస్థల ప్రతినిధులు వివరాలను అందించారు. చర్చ కోసం ఎన్‌హెచ్‌ఎఐ, మంత్రిత్వ శాఖ అధికారులు పిఎసి ముందు హాజరయ్యారని వేణుగోపాల్ తెలిపారు. 'మేము టోల్ వసూలు, నిర్మాణ నాణ్యత... ఇలా అన్ని అంశాలపై చర్చించాము. ఇది ఫలప్రదమైన చర్చ. గతంలో మేము పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో డిజైన్లు, నిర్మాణం వంటి వాటికి సంబంధించిన అనేక లోపాలను ఎత్తిచూపాము. ఆ ప్రధాన ఆందోళనలలో కొన్నింటినిఎన్‌హెచ్‌ఎఐ పరిష్కరించినందుకు నాకు సంతోషంగా ఉంది' అని ఆయన విలేకరులతో అన్నారు. సమావేశంలో రహదారి భద్రతకు సంబంధించిన అంశాలపై కూడా చర్చ జరిగిందని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా వాణిజ్య వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బుధవారం నాడు భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం, దాని మూల్యాంకనం, దానివల్ల కలిగే ప్రభావాలపై చర్చించిందని తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంపి డోలా సేన్ తెలిపారు. 'మేము భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం, దాని మూల్యాంకనం, దానివల్ల కలిగే ప్రభావాలపై చర్చించాము. గత ఆరు నెలలుగా పరిశ్రమలు, వ్యవసాయంపై ఈ వాణిజ్య ఒప్పందం చూపే ప్రభావాల గురించి చర్చిస్తున్నాము. ఆందోళన కలిగించే అన్ని అంశాలను చర్చిస్తున్నాము' అని ఆమె అన్నారు. కమిటీ నివేదికను త్వరలో పార్లమెంటులో సమర్పిస్తామని ఆమె తెలిపారు.

# భారీ అగ్నిప్రమాదాలు

**నోయిడాలోని బహుళ అంతస్తుల భవనంలో ఎగిసి పడిన అగ్నికీలలు: ఇద్దరు మృతి**
**గురుగ్రామ్‌లో ఓ గిడ్డంగిని, మూసివేసిన కింగ్‌డమ్ ఆఫ్ డ్రీమ్స్ కాంప్లెక్స్‌ను చుట్టుముట్టిన మంటలు**



**నోయిడా/ గురుగ్రామ్ :** ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా, దేశ రాజధాని ప్రాంతం గురుగ్రామ్‌లో భారీ ప్రమాద ఘటనలు సంభవించాయి. నోయిడా గ్రామంలోని ఒక బహుళ అంతస్తుల భవనంలో బుధవారం అగ్నిప్రమాదం సంభవించి ఇద్దరు మరణించినట్లు పోలీసులు తెలిపారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చామని, సెక్టార్ 66లోని మామురా గ్రామంలో ఉన్న ఆ భవనంలో నివసిస్తున్న సుమారు 50 మంది నివాసితులను సురక్షితంగా ఖాళీ చేయించామని అధికారులు తెలిపారు. ఆసుపత్రికి తరలించినవారిలో ఒక పురుషుడు, ఒక మహిళ మరణించినట్లు వైద్యులు ప్రకటించారని పోలీసులు తెలిపారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజీవ్ మిశ్రా ప్రకారం జి ప్లస్‌ఫోర్ అంతస్తులు ఉన్న ఆ భవనంలో ప్రతి అంతస్తులో సుమారు 10 నుండి 12 గదులు ఉన్నాయి, వాటిని నివాస ఫ్లాట్లుగా ఉపయోగిస్తున్నారు. భవన యజమానిని అరెస్టు చేశారు. భవనం లోపల ఛార్జింగ్ పెడుతున్న ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం కారణంగా మంటలు చెలరేగినట్లు తెలుస్తోందని, ఆ మంటలు ఆవరణలో పార్క్ చేసిన సమీపంలోని పెట్రోల్ ద్విచక్ర వాహనాలకు వ్యాపించాయని మిశ్రా తెలిపారు. మంటలు చెలరేగిన వెంటనే ఏడు అగ్నిమాపక వాహనాలు, ఒక హైడ్రాలిక్ ప్లాట్‌ఫామ్‌ను ఘటనా స్థలానికి పంపించి, చాలా మంది నివాసితులను సురక్షితంగా ఖాళీ చేయించామన్నారు. ఇప్పటికే ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులు పొగ పీల్చడం వల్ల అస్వస్థతకు గురయ్యారని, వారిని అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు మిశ్రా విలేకరులతో అన్నారు. చట్టంలోని సంబంధిత నిబంధనల కింద భవన యజమాని (లీజుదారు)పై ఫేజ్ 3 పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. మరో ఘటనలో గురుగ్రామ్‌లో వేర్వేరు ప్రాంతాల్లో రెండు భారీ అగ్నిప్రమాదాలు సంభవించాయి. వాటిలో ఒకటి కంపెనీ గిడ్డంగిని, మరొకటి మూసివేసిన కింగ్‌డమ్ ఆఫ్ డ్రీమ్స్ కాంప్లెక్స్‌ను మంటలు చుట్టుముట్టాయి. ఈ రెండు ఘటనల్లోనూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి గురుగ్రామ్‌లోని పటౌడీ రోడ్డులో గల ఝుండ్ సరాయ్‌లోని లైఫ్‌లాంగ్ కంపెనీ గిడ్డంగిలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే గిడ్డంగిలో ఉన్న ఉద్యోగులు ప్రాంగణాన్ని ఖాళీ చేశారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే చర్యలు చేపట్టారు. మంటల తీవ్రత దృష్ట్యా, గురుగ్రామ్‌లోని అన్ని అగ్నిమాపక కేంద్రాల నుండి, అలాగే ప్రైవేట్ కంపెనీల నుండి రెండు డజన్లకు పైగా ఫైర్ టెండర్లను రంగంలోకి దించారు. మంటలను అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది రాత్రంతా శ్రమించారు. మంటలు వేగంగా వ్యాపించి, అదే భవనంలో పనిచేస్తున్న మరో రెండు కంపెనీలను చుట్టుముట్టాయని ఒక సీనియర్ అగ్నిమాపక అధికారి తెలిపారు. గురుగ్రామ్‌లోని సెక్టార్ 29లో మూసివేసిన 'కింగ్‌డమ్ ఆఫ్ డ్రీమ్స్' సాంస్కృతిక సముదాయంలో బుధవారం మధ్యాహ్నం మరో భారీ అగ్నిప్రమాదం జరిగింది. మధ్యాహ్నం 1.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన గురించి అగ్నిమాపక విభాగానికి సమాచారం అందడంతో, 12 ఫైర్ టెండర్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, భవనంలో ఎవరూ చిక్కుకుపోలేదని అధికారులు తెలిపారు.

# సికింద్రాబాద్ రైళ్ల రద్దీకి చెక్

**సీతాఫల్‌మండి–లాలాగూడ కార్డ్ లైన్‌ను తనిఖీ చేసిన రైల్వే జిఎం**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సికింద్రాబాద్ జంక్షన్‌పై రైళ్ల రద్దీని తగ్గించి, కాజీపేట–కాచిగూడ మార్గంలో ప్రయాణ సమయం, దూరాన్ని గణనీయంగా తగ్గించే లక్ష్యంతో ఇటీవల ప్రారంభించిన సీతాఫల్‌మండి–లాలాగూడ కార్డ్ లైన్‌ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బుధవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. హైదరాబాద్ డివిజన్ డిఆర్‌ఎం సంతోష్ కుమార్ వర్మతో పాటు పలువురు సీనియర్ అధికారులు ఈ తనిఖీలో పాల్గొన్నారు. సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్‌లో తనిఖీ ప్రారంభించిన జిఎం.. స్టేషన్ పరిశుభ్రత, ప్రయాణికుల వేచి ఉండే హాల్, టికెట్ కౌంటర్లు, ప్లాట్‌ఫారాలు, స్టేషన్ మాస్టర్ కార్యాలయం, సిగ్నలింగ్ వ్యవస్థ, భద్రతా పరికరాలను పరిశీలించారు. అనంతరం కొత్తగా నిర్మించిన సీతాఫల్‌మండి–లాలాగూడ కార్డ్ లైన్‌పై ట్రాలీ తనిఖీ నిర్వహించి, పాయింట్లు, క్రాసింగ్‌లను పరిశీలించారు. సుమారు 3 కిలోమీటర్ల పొడవున్న ఈ కార్డ్ లైన్‌లో ఐదు చిన్న వంతెనలు నిర్మించగా, అలుగడ్డ బావి రోడ్ అండర్ బ్రిడ్జ్ ప్రధాన వంతెనగా ఉంది. ఈ మార్గంలో పూర్తి ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ కొత్త లైన్ అందుబాటులోకి రావడంతో కాజీపేట నుంచి కాచిగూడకు వెళ్లే రైళ్లు ఇకపై మౌలాలీ, మల్కాజిగిరి మీదుగా సుమారు 15 కిలోమీటర్ల అదనపు ప్రయాణం చేయాల్సిన అవసరం ఉండదు. లాలాగూడ మీదుగా నేరుగా కాచిగూడకు చేరుకునే అవకాశం కలగడంతో సుమారు 12 కిలోమీటర్ల దూరం, దాదాపు 20 నిమిషాల ప్రయాణ సమయం ఆదా కానుంది. తనిఖీ అనంతరం జీఎం లాలాగూడ స్టేషన్‌ను కూడా సందర్శించి, సిగ్నలింగ్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, స్టేషన్ మాస్టర్‌తో చర్చించారు.

# ఒక్క చుక్క చమురు కూడా ఎగుమతి చేయం: ఇరాన్

- చర్చలకు రాకపోతే విద్యుత్‌ప్లాంట్లు, వంతెనలు ధ్వంసం: ట్రంప్
- ఏడు గంటలసేపు ఏకధాటి దాడులు
- దక్షిణ ఇరాన్‌లో 30 మంది మృతి: ఏడుగురు ఐఆర్‌జిసి సైనికులు మృతి



**దుబాయ్/వాషింగ్టన్:** అమెరికా–ఇరాన్ మధ్య వరుసగా నాలుగోరోజు బుధవారం కూడా తీవ్రస్థాయిలో గగనతల దాడులు కొనసాగాయి. ఒక్క చుక్క చమురు–గ్యాస్ కూడా పశ్చిమాసియా నుండి ఎగుమతి చేయబోమని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా బలగాలకు ప్రధానంగా ఆశ్రయం కల్పిస్తున్న బహ్రైన్,జోర్డాన్,కువైట్‌లలో స్థావరాలపై ఇరాన్ దాడులు కొనసాగించింది. అమెరికా దాడుల్లో ఏడుగురు ఇస్లామిక్ రిపబ్లిక్ సైనికులు హతులయ్యారు. ఒమన్ జలాల్లో రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ చేసిన దాడుల్లో మరణించిన నావికుల సంఖ్య రెండు పెరిగిందని అంతర్జాతీయ సముద్రయాన సంస్థ (ఐఎంఓ) ప్రకటించింది. ఇటీవల అమెరికా చేసిన దాడులవల్ల దక్షిణ ఇరాన్‌లో 30 మంది పౌరులు మరణించారని వారి పాలకులు చెప్పారు. అదే సమయంలో రెండు దేశాల నాయకులమధ్యా హెచ్చరికల వాగ్యుద్ధం తీవ్రరూపం దాల్చింది.ఇస్లామాబాద్ ఒప్పందాన్ని గౌరవించకుండా ఇదేవిధంగా అమెరికా ప్రవర్తిస్తే పశ్చిమాసియా నుండి ఇంధన ఎగుమతులన్నింటినీ నిలిపివేస్తామని, హోర్ముజ్‌లో మరిన్ని వాణిజ్య మార్గాలను అడ్డుకుంటామని, అమెరికా దురాక్రమణ ఆగే వరకూ జలసంధిని మూసే ఉంచుతామని ఇరాన్ పాలకులు హెచ్చరికలు చేయగా, చర్చల బల్ల వద్దకు తిరిగి రాకపోతే యుద్ధాన్ని విస్తరించి ఇరాన్ వ్యాప్తంగా విద్యుత్ ప్లాంటులను సమూలంగా తుడిచిపెడతామని, వంతెనలు ధ్వంసం చేస్తామని డోనాల్డ్ ట్రంప్ ప్రతి హెచ్చరిక చేశారు. ఇరాన్ సెంట్రల్ బ్యాంక్‌కు అనుసంధానమై ఉన్న డిజిటల్ వాలెట్‌లలో ఉన్న 130 మిలియన్ డాలర్లను స్తంభింపజేసినట్లు అమెరికా ఆర్థికశాఖామంత్రి స్కాట్ బెస్సెంట్ చెప్పారు. ఇరాన్ చమురు,క్రిప్టో కరెన్సీపై ఆంక్షలను పునరుద్ధరించారు. "వచ్చేవారం ఆరంభంలో వారి పరిస్థితి మరింత ఘోరంగా ఉంటుంది" అని ఫాక్స్‌న్యూస్‌కు ట్రంప్ బుధవారం చెప్పారు. దాడులు ఇంకా ఎంతకాలం కొనసాగుతాయని అడగ్గా, "నేను మళ్లీ చెప్పే వరకు దాడులు కొనసాగుతాయి" అని సమాధానమిచ్చారు. ప్రస్తుత దాడులకంటే మరింత విస్తృతంగా భారీ స్థాయిలో దాడులకు ప్రణాళిక రచించినట్లు తన ఉన్నత స్థాయి సహాయకులతో ట్రంప్ సిత్యుయేషన్ రూములో సమావేశం జరిపారని ఈ విషయం తెలిసిన వర్గాలను ఉటంకిస్తూ ఆక్సియోస్ పేర్కొంది. జలసంధిని తెరిపించడం, అణు కార్యక్రమంపై అమెరికా డిమాండ్లకు తలొగ్గేలా ఇరాన్‌ను ఒప్పించడానికే ఈ వ్యూహ రచన చేస్తున్నారు. జలసంధిలో నౌకలను కదలనీయకుండా ఇరాన్ ఆంక్షలు విధిస్తుందువల్ల చర్చలు ముందుకు కదలడంలేదని ట్రంప్ పాలనాయంత్రాంగం బుధవారం ప్రకటించింది. గడచిన ఏప్రిల్‌లో కాల్పుల విరమణ ప్రకటన,గతనెలలో ఎంఓయు ఒప్పందం పై సంతకాల తర్వాత హోర్ముజ్ జలసంధిలో ప్రత్యామ్నాయ జలమార్గాలు,సుంకాల వసూళ్లపై వివాదం తలెత్తడంతో జులై ఏడో తేదీ నుండి మళ్లీ ఇరాన్‌లో లక్ష్యాలపై అమెరికా దాడులు చేయడం ప్రారంభించి కొనసాగిస్తోంది.సెంట్‌కామ్ అధిపతి అడ్మిరల్ బ్రాడ్ కూపర్ మాట్లాడుతూ, ఇరాన్ ఏడు నౌకలపై ఇటీవల చేసిన దాడుల్లో 12 మంది మరణించడం లేదా గాయపడటం, గల్లంతుకావడం జరిగిందన్నారు. దాడులు జరుగుతున్నప్పటికీ వారం రోజుల్లో 300 నౌకల ప్రయాణాలు సజావుగా సాగేందుకు సమన్వయ చర్యలు తీసుకున్నామన్నారు. ఇదిలా ఉండగా, ఇరాన్ క్షిపణి,డ్రోన్ నిల్వకేంద్రాలు,తీర ప్రాంత నిఘా కేంద్రాలపైన, జలసంధి సమీపంలో అమెరికా సెంట్‌కామ్ దాడులు కొనసాగించింది. ఇరాన్‌లో ఏకైక అణువిద్యుత్ కేంద్రం ఉన్న ఓడరేవు నగరం అల్ బుషెర్‌లో పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయి. ఇరాన్ తీరప్రాంత రక్షణదళాలపైన, గ్రేటర్ టన్స్ ద్వీపంలోని క్రూయిజ్ క్షిపణి ప్రయోగస్థావరాలే లక్ష్యంగా 90 నిమిషాలు దాడులు చేసినట్లు సెంట్‌కామ్ అధికారులు చెప్పారు. పలుచోట్ల నగరాల్లో పేలుళ్ళు సంభవించాయి. బందర్ అబ్బాస్, ఖేష్మ్,బందర్ ఇమామ్ ఖొమైనీలో కూడా పేలుళ్ళు సంభవించాయి. మరీ ముఖ్యంగా ఇరాన్ పెట్రోలియం షిప్పింగ్ దిగ్గజం "మహ్మద్ హొస్సేన్ షంఖానీ నెట్‌వర్క్"ను లక్ష్యంగా చేసుకుని ఎక్కువ దాడులు చేసింది. అమెరికా దాడుల్లో అమరుడైన అలీ ఖమేనీ సలహాదారుడు అలీ షంఖానీ కుమారుడు మహ్మద్ హొస్సేన్ షంఖానీ. ఆయన అంతటా పనిచేస్తున్న 200 సంస్థలు,వ్యక్తులు,నౌకలపై ఆంక్షలు విధించినట్లు అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ చెప్పారు. ఇరాన్ చమురు ఎగుమతుల వెనుక షంఖానీ నెట్‌వర్క్ ఒక కీలక శక్తి అని, ఇప్పుడు ప్రపంచ వస్తు వాణిజ్యంలోకి కూడా విస్తరించిందని ఆర్థికశాఖ పేర్కొంది. బ్రిటన్‌లో అమెరికా గగనతల స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేయగా, ఇరాన్ ప్రయోగించిన మూడు క్షిపణులను కూల్చివేసినట్లు జోర్డాన్ సాయుధ దళం ప్రకటించింది. గడచిన నాలుగు రోజులుగా జోర్డాన్‌పై ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసింది.

ఇరాన్ ఓడరేవులపై తొలగించిన దిగ్బంధనాన్ని కూడా మంగళవారం అర్థరాత్రి దాటాక సెంట్‌కామ్ సైన్యాలు అమలు చేస్తూ నిఘా,గస్తీ ప్రారంభించాయి. ఈ దశలో పశ్చిమాసియా నుండి అన్ని రకాల ఇంధన ఎగుమతులను నిలిపివేస్తామని ఇరాన్ హెచ్చరిక చేసింది.ఎట్టిపరిస్థితుల్లోనూ హోర్ముజ్ జలసంధిలో విదేశీ జోక్యాన్ని సహించబోమని పునరుద్ఘాటించింది. దీనికి ముందుగా, హోర్ముజ్‌లో నౌకల నుండి 20 శాతం సుంకాలు వసూలు చేస్తామన్న ప్రకటనను ట్రంప్ వెనక్కు తీసుకున్నారు. సుంకాల వసూళ్ళ బదులు గల్ఫ్ మిత్రదేశాలతో పెట్టుబడి ఒప్పందాలు చేసుకుంటామన్నారు.

## ఇరాన్ దాడిలో గల్లంతైన భారత నావికుడు

### హేరంబ్ కర్మార్కర్ మృతి

**దుబాయ్:** సైప్రస్ జెండాతో వెళుతున్న చమురు ట్యాంకర్‌పై గడచిన ఆదివారం ఇరాన్ చేసిన దాడిలో జాడ తెలియకుండాపోయిన భారత నావికుడు,మెరైన్ ఇంజనీర్ హేరంబ్ కర్మార్కర్ మరణించారు. ఆయన వయసు 30 సంవత్సరాలు. కర్మార్కర్ మామగారు వివేక్ టాండాన్ రాయిటర్స్ వార్తాసంస్థతో మాట్లాడుతూ,తమ అల్లుడి మరణం గురించి ట్యాంకర్ నడుపుతున్న నౌకాసంస్థ తమకు ఈ సమాచారాన్ని తెలియజేసిందని చెప్పారు. సౌదీ అరేబియా ప్రభుత్వ పత్రిక బుధవారం ఈ విషయం వెల్లడించింది. ఈ విషయాన్ని ధృవీకరించేందుకు రాయిటర్స్ సంస్థ సంప్రదించినప్పటికీ భారత విదేశీమంత్రిత్వశాఖ వెంటనే స్పందించలేదు. కర్మార్కర్ మృతదేహం కోసం సైప్రస్ ప్రభుత్వం తీవ్ర గాలింపు చేసింది. 24 మంది సిబ్బందితో వెళుతున్న ఈ ట్యాంకర్‌లో 11 మంది భారతీయ నావికులు,సిబ్బంది ఉన్నారు. సైప్రస్ నౌక తాము చెప్పిన అధికారిక మార్గంలో కాకుండా అక్రమ మార్గంలో జలసంధి దాటి వెళ్ళేందుకు ప్రయత్నం చేసిందని, ఎన్ని హెచ్చరికలు చేసినా పెడచెవిన పెట్టడంతో తాము క్షిపణి దాడి చేశామని ఇరాన్ ఐఆర్‌జిసి ఇంతకుముందే ప్రకటించింది. ఈ దాడిలో కేవలం హేరంబ్ కర్మార్కర్ ఒక్కరే మరణించగా మిగిలిన పదిమంది భారత నావికులు సురక్షితంగా లైఫ్‌బోటు ఎక్కి తీరానికి చేరుకున్నారు. ఆ తర్వాత మళ్ళీ మంగళవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన ఎంటి అల్ బహియా,ఎంటి మొంబాసా ట్యాంకర్లపై కూడా ఇరాన్ క్షిపణి దాడి చేయడంతో మరో భారతీయ నావికుడు గల్లంతయ్యాడు. ఈ దాడిలో మొత్తం 12 మంది నావికులు గాయపడగా వారిలో తొమ్మిదిమంది భారతీయులు ఉన్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. గతవారంలో అమెరికా–ఇరాన్ మధ్య ఘర్షణలు తిరిగి రాజుకున్నాయి. హోర్ముజ్‌ను మూసివేసినట్లు ఇరాన్ చెబుతుండగా, జలసంధి తెరిచే ఉందని, జలసంధిలో నౌకల రాకపోకలకు తమ సెంట్‌కామ్ సైన్యాలు రక్షకుడి పాత్రలో కాపలాకాస్తాయని ట్రంప్ చెబుతున్నారు.

## సింగపూర్‌లో పెరుగుతున్న మతిమరపు జనం

- 2030 నాటికి 1.52 లక్షలకు చేరే అవకాశం
- పలు ఆసియా దేశాల్లో ఇవే పరిస్థితులు

**సింగపూర్:** ఆగ్నేయ ఆసియాలో సార్వభౌమాధికారంగల ప్రసిద్ధ ద్వీపదేశం సింగపూర్‌లో రోజు రోజుకూ మతిమరపు ప్రజలసంఖ్య పెరిగిపోతందంటట! ఈ సంఖ్య రాబోయే నాలుగేళ్ళలో లక్షల్లో చేరుతుందని ఒక అధ్యయనం వెల్లడించింది. సింగపూర్‌లో మతిమరపు కారణంగా ప్రతినెలా కనీసం ఇద్దరు పౌరులు జాడ తెలియకుండా పోతున్నారని తాజా అధ్యయనం వెల్లడించింది. ప్రస్తుతం సింగపూర్‌లో 72 వేలమంది మతిమరుపు (డెమెన్షియా) గల ప్రజలు ఉన్నారు. 2030 నాటికి ఈ మ తిమరపు జనం సంఖ్య 1.52 లక్షలకు చేరుకుంటుందని సంబంధిత వైద్య నిపుణులు అంచనా వేశారు. కేవలం సింగపూర్‌లోనే కాకుండా ఆసియావ్యాప్తంగా కూడా వివిధ వాతావరణ పరిస్థితులు,ఆధునిక జీవన శైలి కారణంగా ప్రజల్లో మతిమరపు ధోరణి పెరుగుతోందని 2024లోనే ఒక అధ్యయనం వెల్లడించింది. సింగపూర్,ఆసియా దేశాల్లో వృద్ధులసంఖ్యతోపాటు మతిమరపు ప్రజల సంఖ్య కూడా పెరుగుతోంది. సింగపూర్‌లో 60 ఏళ్ళు వయసు దాటిన ప్రజల్లో ప్రతి పది మందిలో ఒకరికి మతిమరపు ఉంది. పాపులేషన్ ఇన్ బ్రీఫ్ నివేదిక ప్రకారం, ఆ దేశంలో 65 ఏళ్ళు వయసుదాటిన ప్రజలు 19.1 శాతం పైగా ఉన్నారు. 2030 నాటికి ఈ సంఖ్య ప్రతి నలుగురిలో ఒకరికి మతిమరపు వచ్చేస్థాయికి చేరుతుంది. ఈ విధంగా వృద్ధుల్లో మతిమరపు నిష్పత్తి పెరుగుతూనే ఉంటుందని అధ్యయన నివేదిక తెలియజేసింది. ఒకదేశంలో ఏడూశాతం అంతకంటే ఎక్కువమంది 65 ఏళ్ళు వయసుదాటినవారు గనుక ఉంటే ఆ దేశాన్ని ఐక్యరాజ్యసమితి "వృద్ధాప్య సమాజం"గా నిర్వచిస్తుంది. సూపర్ ఏజ్‌డ్ సొసైటీలో ఈ విధంగా వృద్ధులవాటి 20 శాతం కంటే ఎక్కువగా ఉంటుంది.సింగపూర్ ఇప్పుడు ఈ సూపర్ ఏజ్‌డ్ సొసైటీ హోదా సంపాదించేందుకు సమీపంలో ఉంది. అదేవిధంగా సింగపూర్‌లో సగటు ఆయుర్దాయం కూడా పెరుగుతూనే ఉంది. 2040 నాటికి ఆ దేశంలో మతిమరపుతోపాటు సగటు ఆయుర్దాయం కూడా 85.4 శాతానికి చేరుకుంటుంది. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం ఎక్కువ కాలం జీవించడం ముఖ్యంకాదు, ఎక్కువ కాలం ఆరోగ్యంగా,సంపూర్ణ భౌతిక ప్రపంచ చైతన్యస్థితిలో జీవించడం ముఖ్యం. కానీ జపాన్, దక్షిణకొరియా, హాంకాంగ్, తైవాన్‌లలో కూడా నిర్దిష్ట వయసువారిలో డెమెన్షియా ప్రభావం పెరగుతున్నట్లు అధ్యయనం పేర్కొంది.ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో ప్రభుత్వాలు ఈ డెమెన్షియా మరింత ఆలస్యంగా వచ్చేందుకు వీలుగా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. లాన్సెట్ కమిషన్ కూడా ప్రపంచవ్యాప్తంగా 40 శాతం డెమెన్షియా కేసులకు సంబంధించిన పలు ప్రమాదకర కారణాలు తెలియజేసింది. జీ జిన్‌పింగ్ కూడా 'హెల్తీ చైనా' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.ప్రజలు కూడా డెమెన్షియా నియంత్రణ విద్యపై దృష్టిసారించాలని ఐక్యరాజ్యసమితి పేర్కొంది.

## జీరో టాలరెన్స్ (మొదటి పేజీ తరువాయి)

పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ అండ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి విద్యాసంస్థలో ఒక క్యాంపస్ సేఫ్టీ కోఆర్డినేటర్‌ను నియమించి విద్యార్థుల భద్రత, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్, తల్లిదండ్రులు, పోలీసులతో సమన్వయం వంటి బాధ్యతలను అప్పగించాలని సూచించారు. సమావేశంలో ఈగల్ అధికారులు ప్రతిపాదిత యాంటీ డ్రగ్ అండ సేఫ్టీ కమిటీల నిర్మాణం, బాధ్యతలు, అమలు విధానం, పర్యవేక్షణ వ్యవస్థ, కార్యాచరణ మార్గదర్శకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనిని పరిశీలించిన డిజిపి పలు మార్పులు, చేర్పులు సూచించి మరింత సమగ్ర మార్గదర్శకాలను రూపొందించాలని ఆదేశించారు. అలాగే విద్యాశాఖ అధికారులు, నిపుణులు, ఇతర సంబంధిత శాఖల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ , నియంత్రణ మార్గదర్శకాలను ఖరారు చేయాలని సూచించారు. తుది ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపే ముందు మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల అడ్మిషన్ల సమయంలో తప్పనిసరిగా డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, సైకాలజిస్టులు, కౌన్సెలర్ల సేవలు అందుబాటులో ఉంచడం, విద్యార్థులకు కౌన్సెలింగ్, తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచడం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. డ్రగ్స్ నియంత్రణలో పోలీసు శాఖ, విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖతో పాటు ఇతర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని డిజిపి ఆదేశించారు. తెలంగాణలో ప్రతి విద్యార్థికి సురక్షితమైన, ఆరోగ్యకరమైన, డ్రగ్స్ రహిత విద్యా వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఈగల్ డైరెక్టర్ సందీప్ షాండిల్యా, ఐజి పద్మజా రెడ్డి, ఎస్పీ గిరిధర్‌తో పాటు ఈగల్ ఫోర్స్‌కు చెందిన పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## పేర్ల తొలగింపునకే

(మొదటి పేజీ తరువాయి)

ఓటర్ జాబితా సమగ్ర సవరణ అవసరం లేదని నిర్ణయించారు. ఇప్పుడు ఓటర్ జాబితాలో 99 శాతం మంది పేర్లు ఇప్పటికే నమోదై ఉన్నప్పుడు మళ్లీ ఇంటింటికి వెళ్లి అక్కడ ఎవరు నివసిస్తున్నారో మొదటి నుంచి ఆరా తీయడమనేది తెలివి తక్కువ పనవుతుంది. అక్రమ వలసదారులను గుర్తించే పేరుతో బిహార్‌లో గతేడాది ఎస్ఐఆర్ చేపట్టారు. దీనివల్ల దాదాపు ఎనిమిది కోట్ల మంది ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కానీ చివరికి ఎంత మంది విదేశీయులు దొరికారు? ఈ రోజు వరకు బిహార్‌లో ఓట్లు కలిగి ఉన్న అక్రమ వలసదారులు ఎంత మందో ఇసి వెల్లడించలేదు. ఇదేమైనా పిల్లలాటనా? లేక వారి ఇష్టాయిష్టాలా? 500 మంది విదేశీయులను బిహార్‌లో ఎస్ఐఆర్ చేపట్టి గుర్తించారని మీడియా ద్వారా మాకు తెలిసింది. వారిలో 150 మంది బంగ్లాదేశీయులు కాగా, 350 మంది బిహార్ వ్యక్తులను పెళ్లాడిన నేపాలీ హిందూ మహిళలు. కేవలం 150 మంది బంగ్లాదేశీయులను గుర్తించడానికి మీరు ఎనిమిది కోట్ల మంది ప్రజలను ఇబ్బంది పెట్టారు. ఆ పేరిట లక్షలాది మంది పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించారు. దీని వల్ల ఈసీ సాధించిన ప్రయోజనం ఏంటి? ఇది సమంజసమేనా? అసలు కాదు' అని ఖురేషీ అన్నారు. ఎస్ఐఆర్‌పై ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధుల చేసిన విమర్శలపై స్పందించారు ఎస్‌వై ఖురేషీ. దేశంలో ఎన్నికలు ఎలా నిర్వహించాలో విదేశీయులు మనకు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. 'ఒక విదేశీ బృందం దేశంలో ఎన్నికల నిర్వహణపై లేఖ రాసే పరిస్థితికి మనం చేరుకోవడం చాలా బాధాకరం. ఇలా జరిగి ఉండకూడదు. కానీ అదే సమయంలో దీనిని కేవలం మన దేశ అంతర్గత వ్యవహారమని కొట్టిపారేయకూడదు. ఇది చాలా తీవ్రమైన విషయం. ఇది అంతర్జాతీయ వార్తగా మారినందున భారత్ మౌనంగా ఉంటే అనుమానాలు బలపడే అవకాశం ఉంది' అని ఖురేషీ స్పష్టం చేశారు.

**యుపిఎ సర్కార్ నన్ను ఒత్తిడి పెట్టలేదు :** తన సిఇసి పదవి కాలంలో యుపిఎ–2 ప్రభుత్వం నుంచి ఎటువంటి ఒత్తిడిని ఎదుర్కోలేదని ఖురేషీ తెలిపారు. అప్పట్లో ఇసికి ఉన్న ప్రతిష్ట దృష్ట్యా అటువంటి పని చేయడానికి (ఒత్తిడి తెచ్చేందుకు) ఎవరూ సాహసించేవారు కాదని స్పష్టం చేశారు. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే విషయం ప్రభుత్వానికి ఎప్పుడూ అందరికంటే ఆఖరిగా తెలిసేదని పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌ను విలేకరుల సమావేశంలో ప్రకటించేవాళ్లమని, అప్పుడే ప్రభుత్వానికి కూడా ఆ విషయం తెలిసేదన్నారు.

## ఇక కఠినం

(మొదటి పేజీ తరువాయి)

అఫిలియేషన్ కోసం కళాశాలల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి వాటిని పరిష్కరిస్తున్నారు. నియమ నిబంధనల ప్రకారం ఏమైనా పత్రాలు తక్కువగా ఉంటే ఆయా పత్రాలను జత చేసేందుకు కళాశాలలకు కొంత గడువు ఇవ్వనున్నారు. ప్రస్తుతం బోర్డ్ వద్ద పెండింగ్‌లో ఉన్న అనుబంధ గుర్తింపు దరఖాస్తులను పరిశీలించి, ప్రతి రోజూ 50 నుంచి 60 దరఖాస్తులను పరిష్కరిస్తున్నట్టు ఇంటర్‌బోర్డ్ వర్గాలు చెబుతున్నాయి. అనుబంధ గుర్తింపు ప్రక్రి యను ప్రతి ఏటా తీవ్ర ఆలస్యమవుతున్న నేపథ్యంలో ఈ సారి జూలై చివరి నాటికి పూర్తి చేసి,ఆ తర్వాత బోర్డ్ నియమ నిబంధనల ప్రకారం కళాశాలల ల్యాబ్స్ ఇతర అంశాలపై దృష్టి పెట్టాలని బోర్డ్ కార్యదర్శి అభిలాష అభినవ్ భావిస్తున్నారు.

**ఇక జిల్లా అధికారులే బాధ్యులు...**

రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందని (ఇంటర్ బోర్డ్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోని) ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉండకూడదని ఇంటర్ బోర్డ్ భావించింది. ఇంటర్ ఫీజు చెల్లించే సమయం వరకు ఆగడంతో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకని నిర్ణయం తీసుకునే పరిస్థితి నెలకొంటుందని అధికారులు భావించారు. ప్రతి ఏటా నిత్యం జరిగే ఈ ప్రక్రియకు ఇక నుంచి చెక్ పెట్టాలని, ఇందుకు జిల్లా అధికారులను బాధ్యులను చేస్తే కొంత వరకు సఫలీకృతం అయ్యే అవకాశాలు ఉంటాయని ఇంటర్ బోర్డ్ భావిస్తోంది. రిజిస్ట్రేషన్ కోసం ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని కళాశాలలు ఈనెలాఖరు(జూలై) వరకు దరఖాస్తులు చేసుకునేలా చూడాలని, అలాగే ఇంటర్‌బోర్డ్ నుంచి అనుబంధ గుర్తింపు కోసం కూడా అందరూ దరఖాస్తులు చేసుకునేలా జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇంటర్ బో ర్డ్ ఆదేశించినట్టు సమాచారం. ఇక నుంచి ఆయా జిల్లా పరిధిలో ఏ ఒక్క కళాశాల కూడా అనుమతి పొందని, అనుబంధ గుర్తింపు లేని కళాశాలలు ఉండకూడదని,ఈ బాధ్యత మొత్తం ఆయా జిల్లా ఇంటర్ బోర్డ్ అధికారులదేనని ఇంటర్ బోర్డ్ స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఆయా కళాశాల గుర్తింపు విషయంలో ఏమైనా వివాదాలు వచ్చినా, లేదా ఏదైనా సంఘటనలు జరిగినా అందుకు జిల్లా అధికారులను బాధ్యులను చేయాలని ఇంటర్‌బోర్డ్ ఒక నిర్ణయానికి వచ్చింది.

**ప్రత్యేక కోర్సులు నిర్వహించే కళాశాలకు నోటీసులు..జరిమానా..**

ఇంటర్ బోర్డు నియమనిబంధనలను విరుద్ధంగా ప్రత్యేక కోర్సుల పేరుతో ప్రచారం చేసుకుంటున్న, ప్రత్యేక కోర్సులలో శిక్షణ ఇస్తున్న పలు జూనియర్ కళాశాలపైన ఇంటర్ బోర్డ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఇటీవల దాడులు నిర్వహించారు. ఐఐటి,జీ,నిట్ కోర్సులతో ప్రచారం చేసుకునే జూనియర్ కళాశాలలకు ఇంటర్ బోర్డ్ టాస్క్ ఫోర్స్ బృందం గుర్తించింది. ఇందులో భాగంగా సుమారు 70 నుంచి వంద జూనియర్ కళాశాలలను గుర్తించి నోటీసులను జారీ చేసింది.మరి కొన్ని కళాశాలలకు రూ.70 లక్షల వరకు జరిమానాలు విధించినట్టు తెలిసింది.

ఇంటర్ బోర్డ్ నిబంధనల ప్రకారం ప్రత్యేక కోర్సులకు అనుమతి లేదని ఇంటర్‌బోర్డ్ స్పష్టం చేసింది. ఇక నుంచి కళాశాళల వెబ్‌సైట్స్, వారు చేసుకునే ప్రచార పత్రాలను పరిశీలిస్తామని, ఎక్కడైనా ఇంటర్ కోర్సులకు ప్రత్యేక కోర్సులు కలిసి ఉన్నట్టు గుర్తిస్తే ఇంటర్ బోర్డ్ నిబంధనల ప్రకారం జరిమానా విధిస్తామని ఇంటర్ బోర్ట్ స్పష్టం చేసింది.

## యూరియా ప్లాంట్లు

(మొదటి పేజీ తరువాయి)

సాధనకు జాతీయ పెట్టుబడి విధానం ద్వారా పెట్టుబడులు ప్రోత్సహించి కొత్తగా ఎనిమిది లేదా తొమ్మిది గ్యాస్ ఆధారిత యూరియా ఉత్పత్తి కర్మాగారాలు ఏర్పాటు చేయడం తద్వారా మరో కోటి టన్నుల యూరియా ఉత్పత్తి సామర్థ్యం సాధించడం ఈ కొత్త జాతీయ పెట్టుబడి విధాన లక్ష్యం. దీనివల్ల దిగుమతులపై దేశం ఎక్కువగా ఆధారపడకుండా మన అవసరాలకు సరిపడినస్థాయిలో స్వయంసమృద్ధి సాధించగలుగుతామని మంత్రివర్గ సమావేశానంతరం సమాచార–ప్రసారాలశాఖామంత్రి అశ్వనీ వైష్ణవ్ పాత్రికేయులకు చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. దేశంలో కొత్త యూరియా ప్లాంటు ఏర్పాటు చేసేందుకు కొత్త ప్రతిపాదనలు ఎరువుల మంత్రిత్వశాఖకు కొత్త ప్రతిపాదనలు రావడంతో అందుకు అనుగుణంగా దేశీయ అవసరాలమేరకు మంత్రివర్గం ఈ కొత్త జాతీయ విధానానికి ఆమోదం తెలియజేసిందని అశ్వనీవైష్ణవ్ చెప్పారు.గడచిన దశాబ్ద కాలంలో దేశంలో ఆరు యూరియా ప్లాంట్లు ఏర్పాటు చేశామని, తద్వారా యూరియా దిగుమతులు తగ్గాయని చెప్పారు. 2012లో ప్రభుత్వం రూపొందించిన జాతీయ పెట్టుబడుల విధానం 2019తో ముగిసింది. ఈ కాలంలో లక్ష్యాలమేరకు ప్రభుత్వరంగంలో నాలుగు యూరియా కర్మాగారాలు,ప్రైవేటు రంగంలో రెండు యూరియా కర్మాగారాలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు మళ్ళీ కొత్త ప్రతిపాదనల మేరకు స్వయంసమృద్ధి సాధన నిర్ణయం తీసుకున్నారు. దేశంలో ప్రస్తుతం 33 యూరియా తయారీ కర్మాగారాలు పని చేస్తున్నాయి. కొత్త విధానం కింద యూరియా కర్మాగారాలను గ్యాస్ ఆధారిత ప్లాంట్లుగా నిర్మిస్తారు. ప్రస్తుతం దేశంలో మూడుకోట్ల టన్నులు (30 మిలియన్లు) యూరియా ఏటా ఉత్పత్తి చేస్తుండగా, రైతుల అవసరాల నిమిత్తం నాలుగుకోట్ల టన్నులు అవసరం అవుతోంది. కొత్తగా మరో కోటి (10 మిలియన్) టన్నులు యూరియా ఉత్పత్తి సామర్థ్యం సాధించడానికి ఈ తొమ్మిది యూరియా కర్మాగారాలను రాబోయే కాలంలో ఏర్పాటు చేస్తారు.అదేవిధంగా రెండో విడత సెమీకండక్టర్ల వ్యవస్థ విస్తరణకు,దేశీయంగా సొంత మొబైల్ బ్రాండ్లను ఉత్పత్తి చేసేందుకు కూడా మరో రెండు కార్యక్రమాలకు కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. దీని ప్రకారం, రూ.1.27 లక్షల కోట్లతో సెమీకాన్ 2.0 కార్యక్రమాన్ని విస్తరిస్తారు. దీని వల్ల సెమీకండక్టర్ల డిజైన్, ఉత్పత్తి సామర్థ్యాలు బ్రహ్మాండంగా పుంజుకుంటాయి. రెండో విడత సెమీకండక్టర్ మిషన్ కార్యక్రమాన్ని అమలు చేయడంలో భాగంగా ఈ వ్యవస్థకు అవసరమైన అన్ని విభాగాలను విస్తరించేందుకు దృష్టి కేంద్రీకరించి వాటిని అభివృద్ధి చేస్తారు. అంటే చిప్ డిజైన్, సెమీకండక్టర్ పరికరాలు,సెమీకండక్టర్లకు అవసరమైన సూక్ష్మ ముడిపదార్థాలను వివిధ ఆకారాలలో విడిభాగాలుగా పోతపోసి తయారు చేయడం, అధునాతన ప్యాకేజింగ్ విధానం, నిర్ధారణ పరీక్షలు, పరిశోధన, కొత్త నైపుణ్యాన్ని, ప్రతిభను పెంపొందించే చర్యలు తీసుకోవడం వంటి విషయాలపై ఈ 2.0 కార్యక్రమం దృష్టి సారిస్తుంది. ఈ రెండో దశ సెమీకండక్టర్ల వ్యవస్థ అమలును పూర్తిచేస్తే భారతదేశం ఈ రంగంలో స్వదేశీ చిప్‌ల ఉత్పత్తిలో స్వయంసమృద్ధిని సాధించినట్లే అవుతుంది. ఈ పథకం ద్వారా నాలుగు లక్షల కోట్ల పెట్టుబడులను దేశం ఆకర్షిస్తుంది. అదేవిధంగా ఈ స్వయం సమృద్ధి ప్రక్రియ పూర్తయ్యేలోపు రెండు లక్షలకోట్ల రూపాయలు విలువైన సెమీకండక్టర్లు ఉత్పత్తి చేయగలుగుతామని కేంద్ర ప్రభుత్వం అంచనావేస్తున్నట్లు మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. మరోవైపు రూ.62,500 కోట్లతో భారత్ మొబైల్ ఫోన్ బ్రాండ్లను ఉత్పత్తి చేసే పథకం ఎంపిఎంఎస్ (మొబైల్ ఫోన్ మాన్యుఫాక్చరింగ్ స్కీమ్)కు కేంద్ర మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. తద్వారా దేశంలో మొబైల్ తయారీ పరిశ్రమ మరింత బలోపేతం అవుతుందని, సాంకేతిక సార్వభౌమత్వాన్ని సాధిస్తామని చెప్పారు.భారతదేశ మొబైల్ ఫోన్ల ఉత్పత్తికి కొన్ని ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తామని, ఒక ప్రత్యేక ప్రాజెక్టును అమలు చేస్తామని చెప్పారు. తొలుత ప్రభుత్వం దేశంలో ఈ పథకం కింద ఇంతకుముందు భారీస్థాయిలో మొబైల్ ఉత్పత్తులకుగాను ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పిఎల్ఐ–ఎల్ఎస్ఇఎం)ను ప్రారంభించింది. ఇప్పుడు ఈ రెండో దశ పథకం 2026–27 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభమై 2030–31 ఆర్థిక సంవత్సరంలో ముగుస్తుంది. దీని కోసం రూ.62,500 కోట్లు కేటాయిస్తూ మంత్రివర్గం తీర్మానం చేసింది. ఈ పథకం కింద మొబైల్ రంగంలో కొత్త డిజైన్లను, పరిశోధన,అభివృద్ధితో పాటు పేటెంట్ వ్యవస్థను కూడా అమలు చేస్తుంది. ఈ పథకం అమలు కాలంలో దేశంలో ఎగుమతులు గణనీయంగా పెరగడంతోపాటు మొబైల్ ఫోన్ల ఉత్పత్తి కూడా భారీస్థాయిలో 39 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనావేస్తున్నట్లు మంత్రి చెప్పారు.అదేవిధంగా ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో రద్దీని తగ్గించేందుకు రూ.25,500 కోట్ల పెట్టుబడులతో రెండు హైవే ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్ర ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ కమిటీ (సిసిఇఎ) బుధవారం సమావేశంలో ఆమోదముద్ర వేసింది. వరుణానది వెంట ఉన్న ఎన్‌హెచ్–31ను కాశీ రైల్వే స్టేషన్‌ను కలుపుతూ ప్రయాణ సమయం తగ్గించేందుకు హైవే నిర్మిస్తారు. అదేవిధంగా వారణాసిలో రద్దీ తగ్గించేందుకు జాతీయరహదారి ఎన్‌హెచ్–19 కు వారణాసి రింగ్‌రోడ్‌కు మధ్య గంగాతీరం వెంట ఒక నదీతీర కారిడార్ అభివృద్ధికి సిసిఇఎ ఆమోదం తెలియజేసింది. దీనిని ఆరులైన్ల రహదారిగా అభివృద్ధి చేస్తారు. అదేవిధంగా రూ.3,907 కోట్ల అంచనావ్యయంతో రెండు రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర సిసిఇఎ ఆమోదం తెలియజేసింది. పారదీప్–హరిదాస్‌పూర్ సెక్షన్‌లో రైల్వే లైను డబ్లింగ్, రాజ్‌ఖర్సావాన్–దాంగోయాపోసి సెక్షన్‌లో నాలుగవ రైల్వే లైను నిర్మాణానికి ఆమోదం తెలియజేశారు. ప్రధానమంత్రి గతిశక్తి పథకం కింద ఈ ప్రాజెక్టులు నిర్మిస్తారు.

## గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

షెడ్యూల్ వివరాలను తక్షణమే క్షేత్ర స్థాయి అధికారులతో పాటు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకు తెలియజేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధా న అధికారికి కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**ప్రభుత్వ విజ్ఞప్తితోనే సవరణ..**

వర్షాలు, ఇతర పరిపాలనాపరమైన కారణాల దృష్ట్యా ఓటర్ల సవరణ గ డువును పొడిగించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ఎన్నికల సంఘా న్ని కోరింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ విజ్ఞప్తి చేసినట్లు అధికారు లు తెలిపారు. ఈ ప్రతిపాదనను పరిశీలించిన ఈసి, షెడ్యూల్‌లో మార్పు లు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనివల్ల కొత్తగా ఓటు హక్కు నమో దు చేసుకునే వారికి, తప్పుల సవరణలకు మరికొంత సమయం లభించినట్లయింది.

**సవరించిన 'సర్' నూతన షెడ్యూల్..**

–బిఎల్‌ఓల ఇంటింటి సర్వే ముగింపు ఆగస్టు 3.
–డ్రాఫ్ట్ (ప్రాథమిక) ఓటరు జాబితా విడుదల ఆగస్టు 10.
–క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ సెప్టెంబర్ 9.
–అభ్యంతరాల పరిష్కారం (గడువు) అక్టోబర్ 8.
–తుది ఓటరు జాబితా ప్రచురణ (ఫైనల్ లిస్ట్)అక్టోబర్ 12.

## తొలిమెట్టు (మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి కోరారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మించనున్న డేటా సెంటర్‌కు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు ఇతర ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం కల్పించడానికి సింగిల్ విండో పద్ధతిలో అన్ని అనుమతులు మంజూరు చేస్తున్నామని, 2025 డిసెంబర్‌లో రూపొందించిన పాలసీ మేరకు ఇప్పుడు అమెజాన్‌కు భూమి కేటాయించి ప్రభుత్వం చెప్పింది చేస్తుందన్నారు. వచ్చే 14 ఏళ్లలో 7 బిలియన్ డాలర్లను అమెజాన్ పెట్టుబడులు పెడుతోందని, ప్రభుత్వ సంకల్పం నెరవేరే దిశగా 1 లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టాలని, అందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని విధాలుగా అమెజాన్‌కు సహకరిస్తుందని, ఏది కావాలన్నా సమకూర్చుతామని, పెట్టుబడులపై ప్రతి నెలా సమీక్షిస్తానని సిఎం హామీ ఇచ్చారు. డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఏ దిశగా అయితే భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలని సంకల్పించామో, అమెజాన్ నిర్మిస్తున్న దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఈ ప్రాంతంలో రానున్న పరిశ్రమలకు ప్రోత్సాహకరంగా నిలుస్తుందని అన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచంలోనే ఫార్చ్యూన్ 500 కంపెనీల పెట్టుబడులను ఆహ్వానించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. ఆ ప్రయత్నంలో భాగంగానే 108 దేశాలకు చెందిన ప్రతినిధులు, 3 వేలకు పైగా కార్పొరేట్ దిగ్గజాలను ఆహ్వానించి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను ఇక్కడ నిర్వహించాం. '2034 నాటికి 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ ఎదగాలనే కల. కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.

**అత్యాధునిక నగరంగా ఫ్యూచర్ సిటీ**

ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా ప్రపంచ స్థాయి,కాలుష్యరహిత,అత్యాధునిక నగరాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. సింగిల్ విండో విధానం,పారదర్శక అనుమతుల వ్యవస్థ, వేగవంతమైన భూ కేటాయింపులతో పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.పెట్టుబడిదారుల సమస్యలను ప్రతి నెల స్వయంగా సమీక్షించి తక్షణ పరిష్కారం అందిస్తామని హామీ ఇచ్చారు. పారిశ్రామిక, పర్యాటక,ఇంధన,క్రీడలు,ఆరోగ్యం,సంక్షేమ రంగాలకు సమగ్ర విధానాలను రూపొందించామని, నాణ్యమైన విశ్వవిద్యాలయాలు,పరిశోధనా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ద్వారా యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

**డేటా సెంటర్ ఎకోసిస్టమ్ మరింత బలోపేతం**

అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటుతో తెలంగాణలో డేటా సెంటర్ ఎకోసిస్టమ్ మరింత బలోపేతం అవుతుందని, దీనివల్ల ఐటీ, సాఫ్ట్‌వేర్, అనుబంధ పరిశ్రమలు పెద్ద ఎత్తున రాష్ట్రానికి వచ్చే అవకాశముందని తెలిపారు.హైదరాబాద్‌ను కాలుష్యరహిత, సుస్థిర మహానగరంగా తీర్చిదిద్దేందుకు ఎలక్ట్రిక్ బస్సులు, ఈవీ వాహనాలకు ప్రోత్సాహకాలు, పన్ను మినహాయింపులు వంటి చర్యలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఢిల్లీ కాలుష్యం, ముంబై వరదలు, బెంగళూరు ట్రాఫిక్ సమస్యలు వంటి పరిస్థితులు హైదరాబాద్‌లో తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో నగరాభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ వెలుపల, రీజినల్ రింగ్ రోడ్ లోపల ఉన్న విస్తార ప్రాంతాన్ని తయారీ పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేసి, విద్యుత్, నీరు, భూమి, అనుమతులు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులను అందుబాటులో ఉంచడం ద్వారా భారీ పెట్టుబడులను ఆకర్షించి లక్షలాది ఉద్యోగాలను సృష్టిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

**రైతుల త్యాగం ప్రభుత్వం ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటుంది**

ప్రభుత్వం విజన్ సాధనలో రైతుల త్యాగం ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటుందని, అభివృద్ధి కోసం భూములు ఇస్తున్న రైతులకు మరింత నష్టపరిహారాన్ని పెంచి గౌరవించాలని, వారికి మరింత భరోసా, వారిలో విశ్వాసం కల్పించాల్సి ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు కె.రామకృష్ణా రావు, అమెజాన్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**డేటా సెంటర్ తెలంగాణకు గర్వకారణ: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యూఎస్) డేటా సెంటర్‌కు భూమిపూజ కార్యక్రమం నిర్వహించడం తెలంగాణకు గర్వకారణమని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణకు, పెట్టుబడుల ఆకర్షణకు, ఉపాధి అవకాశాల కల్పనకు కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వం పరిశ్రమలకు నియంత్రణ సంస్థగా కాకుండా సహాయకుడిగా(ఫెసిలిటేటర్) వ్యవహరిస్తోందని,పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, అనుమతులు, మౌలిక సదుపాయాలు వేగంగా అందించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా భావిస్తోందన్నారు.

## ఫిఫా ప్రపంచకప్‌లో స్పెయిన్ సంచలనం..

# ఫ్రాన్స్‌ను ఓడించి ఫైనల్‌లోకి



'ఫిఫా ప్రపంచ కప్ 2026' లో స్పెయిన్ సంచలనం సృష్టించింది. టోర్నీలో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఫ్రాన్స్‌కు షాకిచ్చి ఫైనల్లోకి దూసుకెళ్లింది. టెక్సాస్‌లోని ఏటీ, టీ స్టేడియంలో బుధవారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్ 2–0 గోల్స్ తేడాతో ఫ్రాన్స్‌పై ఘన విజయం సాధించింది. 2010లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత స్పెయిన్ మళ్లీ వరల్ కప్ ఫైనల్‌కు అర్హత సాధించడం ఇదే తొలిసారి. మ్యాచ్ ఆరంభం నుంచే స్పెయిన్ పట్టు బిగించింది. ఆట 22వ నిమిషంలో స్పెయిన్ యువ సంచలనం లామిన్ యమాల్ను ఫ్రాన్స్ డిఫెండర్ లూకాస్ డిగ్నే ఫౌల్ చేయడంతో రిఫరీ పెనాల్టీని కేటాయించారు. ఈ అవకాశాన్ని మికెల్ ఒయర్జాబల్ గోల్గా మలచి స్పెయిన్కు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత కూడా స్పెయిన్ తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ 58వ నిమిషంలో మరో గోల్ సాధించింది. డానీ ఓల్మోతో కలిసి అద్భుతమైన పాస్‌లు మార్చుకున్న పెడ్రో పోరో, గోల్ కీపర్ మైక్ను దాటుకుంటూ బంతిని నెట్లోకి పంపి స్పెయిన్ విజయాన్ని ఖాయం చేశాడు. ఈ మ్యాచ్‌లో ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు కైలియన్ ఎంబాపే సహా ఇతర అటాకింగ్ ప్లేయర్లు పూర్తిగా తేలిపోయారు. స్పెయిన్ పటిష్ఠమైన డిఫెన్స్ వారిని పూర్తిగా కట్టడి చేసింది. దాంతో ఫ్రాన్స్ గోల్ చేసే అవకాశాలను కూడా సృష్టించుకోలేకపోయింది. వరుసగా మూడోసారి వరల్ కప్ ఫైనల్ చేరాలన్న ఫ్రాన్స్ ఆశలకు ఈ ఓటమితో తెరపడింది. 14 ఏళ్లుగా కోచ్గా ఉన్న డిడియర్ డెషాంప్స్కు ఇది చేదు వీడ్కోలుగా మిగిలింది. తాజా విజయంతో 2010 నాటి స్వర్ణయుగాన్ని స్పెయిన్ గుర్తుకు తెచ్చింది. తమ జట్టు సమష్టిగా రాణించిందని, ముఖ్యంగా ఫ్రాన్స్ బలాలను అడ్డుకోవడంలో సఫలమయ్యామని స్పెయిన్ మేనేజర్ లూయిస్ డిలా ఫ్యూయెంటె ప్రశంసించాడు. ఆదివారం న్యూజెర్సీలోని మెట్లైఫ్ స్టేడియంలో జరిగే ఫైనల్లో అర్జెంటీనా ఇంగ్లండ్ మధ్య జరిగే రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ విజేతతో స్పెయిన్ తలపడనుంది.

## తొలిరౌండ్ దాటని ఆయుష్, లక్ష్యసేన్..ఆశలన్నీ సింధుపైనే






టోక్యోలో జరుగుతున్న జపాన్ ఓపెన్‌లో భారత యువ షట్లర్లు తీవ్రంగా నిరాశపరిచారు. ఇప్పటికే సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి జోడీ గాయంతో ఈ సూపర్ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించగా.. కుర్రాళ్లు లక్ష్యసేన్, ఆయుశ్ షెట్టిలు సైతం ఇంటిదారి పట్టారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లోనే సేన్, ఆయుశ్ ఓటమి పాలయ్యారు. స్థానిక షట్లర్ కొకి వటనాబే చేతిలో సేన్ కంగుతినగా.. థాయ్లాండ్కు చెందిన రెండో సీడ్ కున్లవుత్ విటిడ్సర్న్తో పోరాడి ఓడాడు ఆయుష్. ప్రతిష్ఠాత్మక జపాన్ ఓపెన్లో భారత షట్లర్లు తేలిపోయారు. ఫేవరెట్ లక్ష్యసేన్, ఆయుష్ శెట్టిలు తొలి రౌండ్లోనే వెనుదిరిగారు. బుధవారం జరిగిన మ్యాచ్లో జపాన్ కుర్రాడు కొకి వటనాబే ధాటికి సేన్ చేతులెత్తేశాడు. తొలి సెట్ను 16–21తో అలవోకగా కోల్పోయిన భారత స్టార్ రెండో సెట్లోనూ పుంజుకోలేదు. 17వ ర్యాంకర్ వటనాబె శక్తివంతమైన స్మాష్లతో విరుచుకుపడి 21–14తో గెలుపొందాడు. దాంతో సేన్ నిరాశగా కోర్టును వీడాడు.

**ఆయుష్‌పోటాపోటీగా...**మరో మ్యాచ్‌లో ఆయుష్ శెట్టి మాత్రం రెండో సీడ్ ఆటగాడు కున్లవుత్ విటిడ్సర్న్(థాయ్లాండ్)తో హోరాహోరీగా తలపడ్డాడు. ఇద్దరూ పోటాపోటీగా ఆడి చెరొక సెట్ గెలిచారు. దాంతో, నిర్ణయాత్మక మూడో సెట్ అనివార్యమైంది. చివరి సెట్లోల అత్యుత్తమ ఆట కనబరిచిన కున్లవుత్ 21–15తో గెలుపొంది రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. సేన్, ఆయుశ్ల ఓటమితో పురుషుల బృందం వెనుదిరగగా.. జపాన్ ఓపెన్‌లో పతకం ఆశలన్నీ సింధుపైనే ఉన్నాయి. తొలిరౌండ్ దాటిన తెలుగు తేజం గురువారం హన్యూ(చైనా)ను రెండో రౌండ్‌లో ఢీకొట్టనుంది.

## శాసనాలు..చరిత్రకు ఆధారాలు




ఎన్నో శాసనాలు గత చరిత్రకు ఆధారాలుగా నిలుస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా వీటికి ఎంతో ప్రాధాన్యం ఉంది. మన దేశంలో వెలుగు చూసిన శాసనాల్లో కీలకమైనవిగా నాసిక్ శాసనం (గౌతమీపుత్ర శాతకర్ణి తల్లి గౌతమీ బాలశ్రీ), నానాఘాట్ శాసనం–(నాగనిక /శాతకర్ణి భార్య), నందవాడి శాసనం (రాజరాజ నరేంద్రుడు), మోటుపల్లి అభయ శాసనం (గణపతి దేవుడు), బయ్యారం చెరువు శాసనం (మైలాంబ/ గణపతి దేవుడి సోదరి), ఎలూరు శాసనం (రవికీర్తి), అలహాబాద్ ప్రసస్తి (హరిసేనుడు), గిర్నార్ / జునాగఢ శాసనం (రుద్రదాముడు), ఇహోళే శాసనం ( రెండవ పులకేశి/ శాసనాన్ని రచించింది రవికీర్తి), మేడోలు శాసనం (దీనేశ్వరుడు), రాజుల మండగిరి శాసనం (అశోకుడు), విజయవాడ శాసనం (యుద్ధమల్లుడు), గారియార్ ప్రసస్తి (నాగభట్టుడు), హాథిగుంఫా శాసనం (ఖారవేలుడు), అద్దంకి శాసనం (పాండురంగుడు), ఎర్రగుడి శాసనం (అశోకుడు).

ఈ శాసనాలన్నీ చారిత్రక ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. నాసిక్ శాసనంలో సాతవాహనుల గొప్ప రాజు గౌతమీపుత్ర శాతకర్ణి విజయాలు, సామ్రాజ్య విస్తృతి, శత్రువులపై విజయాలు కనిపిస్తాయి. దీనిని అతని తల్లి గౌతమీ బాలశ్రీ చెక్కించింది. శాతకర్ణి భార్య నాగనిక చెక్కించిన నానాఘాట్ శాసనంలో సాతవాహనుల వంశావళి, యజ్ఞాలు, దానాలు గురించి సమాచారం కనిపిస్తుంది. కాగా, నందవాడి శాసనం తూర్పు చాళుక్యుల కాలానికి చెందినది. పరిపాలన, భూదానాలు, సామాజిక నిర్మాణం గురించి తెలియజేస్తుంది. కాకతీయుల కాలం. విదేశీ వ్యాపారులకు రక్షణ (అభయం) ఇచ్చినట్లు పేర్కొంటుంది. ఇది వాణిజ్య అభివృద్ధిని మోటుపల్లి అభియ శాసనం సూచిస్తుంది. గణపతి దేవుడి సోదరి మైలాంబ చెరువు నిర్మాణం చేసినట్లు 'బయ్యారం చెరువు శాసనం' చెబుతుంది. నాటి నీటి పారుదల వ్యవస్థపై సమాచారం ఇస్తుంది. ఎలూరు శాసనాన్ని రవికీర్తికి చెందిందిగా చెప్తారు. అయితే, రవికీర్తి అనే పేరు ఐహోలే శాసనంలో కనిపిస్తుంది. నాటి నాగరికత వంటి అంశాలు అందులో ఉన్నప్పటికీ, ఎవరికి సంబంధించిందనే విషయంపై స్పష్టత లేదు. సముద్రగుప్తుని విజయాలను వర్ణించే ప్రసిద్ధ శాసనం 'అలహాబాద్ ప్రసస్తి'. అతని దిగ్విజయ జైత్రయాత్రలను ఈ శాసనం వివరంగా చెబుతుంది. శక రాజు రుద్రదాముడు చెక్కించిన గిర్నార్/జునాగఢ శాసనంలో సుధర్శణ సరస్సు మరమ్మతుల గురించిన వివరణ ఉంది. చాళుక్య రాజు పులకేశి II విజయాలను ఐహోలే శాసనం కవి రవికీర్తి వర్ణించాడు. ఇది చాళుక్య చరిత్రకు కీలకం. మౌర్య చక్రవర్తి అశోకుడు ధర్మప్రచారం కోసం చెక్కించిన శాసనాలలో 'రాజుల మండగిరి శాసనం' ఒకటి. ఇందులో బౌద్ధ ధర్మానికి సంబంధించిన అంశాలను పేర్కొన్నారు. ఎర్రగుడి శాసనంలో అశోకుడి ధర్మశాసనాలలో ఒకటి. ప్రజలకు నైతిక జీవన విధానాన్ని సూచిస్తుంది. కలింగ రాజు ఖారవేలు జీవిత విశేషాలు, యుద్ధాలు, ప్రజల కోసం ఆయన చేపట్టిన పనుల వివరాలను 'హాథిగుంఫా' శాసనం వివరిస్తుంది. తూర్పు చాళుక్య కాలానికి చెందిన అద్దంకి శాసనం అప్పటి భూదానాలు, సామాజిక వ్యవస్థపై సమాచారం ఇస్తుంది.

## తవ్వకాల్లో బయటపడిన బారెల్స్



నార్వేలోని స్కియెన్ పట్టణంలో జరిగిన పురావస్తు తవ్వకాలలో 17వ శతాబ్దానికి చెందిన మూడు మూసివేసిన ఓక్ చెక్క బారెల్స్ వెలుగులోకి రావడం చరిత్ర పరిశోధనలో విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. నీటి, మురుగునీటి వ్యవస్థల ఆధునీకరణ పనుల సందర్భంగా బయటపడిన ఈ బారెల్స్ శతాబ్దాల పాటు భూమిలో ఉన్నప్పటికీ దాదాపు చెక్కుచెదరకుండా ఉండటం పరిశోధకులను ఆశ్చర్యపరిచింది. వీటితో పాటు చెక్కతో తయారైన ఒక భారీ ముద్ద పరికరం, అలాగే నిర్మాణ పనులకు ఉపయోగించే లైమ్ పదార్థం కూడా లభించాయి. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, ఈ బారెల్స్‌లో నిల్వ చేసిన స్లేక్డ్ లైమ్‌ను నిర్మాణాల్లో ఉపయోగించే మోర్టార్ తయారీ కోసం భూమిలో ఉద్దేశపూర్వకంగా పాతిపెట్టారు. తీవ్రమైన చలిలో అది గడ్డకట్టకుండా, రసాయనిక లక్షణాలు దెబ్బతినకుండా కాపాడేందుకు ఈ పద్ధతిని అనుసరించినట్లు తెలుస్తోంది. ఇది అప్పటి నిర్మాణ కార్మికులకు ప్రకృతి పరిస్థితులపై ఉన్న అవగాహనను, వారి సాంకేతిక నైపుణ్యాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. తవ్వకాలలో లభించిన నేల పొరల విశ్లేషణలో 17వ శతాబ్దపు అవశేషాల కింద 9వ శతాబ్దానికి చెందిన సాంస్కృతిక ఆనవాళ్లు కూడా గుర్తించారు. దీనివల్ల స్కియెన్ ఒకప్పుడు ప్రముఖ వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందినట్లు భావిస్తున్నారు. లైమ్ కారణంగా ఏర్పడిన ఆక్సిజన్ లేని వాతావరణమే ఈ చెక్క బారెల్స్‌ను శతాబ్దాల పాటు కాపాడిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం వీటిని సంరక్షించి మ్యూజియంలో ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం మీద ఈ బారెల్స్ గత సమాజాల నిర్మాణ విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, ప్రకృతితో వారి అనుబంధాన్ని అర్థం చేసుకోవడానికి విలువైన ఆధారంగా నిలుస్తున్నాయి.

## ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు కేంద్రం కుట్ర

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఉపాధి హామీ పథకం నీరుగార్చేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం నకిరేకల్ మార్కెట్ యార్డ్‌లో జరిగిన ఎఐటియుసి నియోజకవర్గ 5వ మహాసభలో ముఖ్య అతిథిగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్దం కావాలని కోరారు. రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాల అవుతున్న నేటికీ రాష్ట్రంలో అవుట్ సోర్సింగ్ కాంటాక్ట్ కార్మికుల జీవితాలు మారలేదన్నారు. కనీస వేతనం లేక పిఎఫ్, ఇఎస్ఐ అమలు నోచుకోక కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. ఈనెల 19న గుర్రంపోడులో జరిగే ఎఐటియుసి నల్లగొండ జిల్లా 11 మహాసభలను విజయవంతం చేయాలని దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లొడంగి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. మహాసభలో ఎఐటియుసి నాయకులు గౌనీ లక్ష్మీనరసయ్య, వంగూరి రవి, పందిరి యాదగిరి, పాల్వాయి సాగర్, ఎషబోయిన అనిల్, ఇంద్రకంటి శ్రీను, వింజమూరి పరమేష్, బొజ్జ ముత్తయ్య, రమేష్ లింగయ్య, లింగయ్య, యాదగిరి, బాలస్వామి, వెంకటేష్, జంగయ్య, సైదులు, బాలరాజు, సాగర్ రాజు, విక్రమ్ పాల్గొన్నారు.

## సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



**ప్రజాపక్షం/వాంకిడి :** సంఘటిత, అసంఘటిత కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. వాంకిడి సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఎఐటియుసి జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, గతంలో అమల్లో ఉన్న 44 కార్మిక చట్టాలను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి నెలకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని లేదా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ఆర్‌టిసిని పూర్తిస్థాయిలో ప్రభుత్వంలో విలీనం చేసి, డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వైద్యశాఖలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనం కల్పించి రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మహేష్, పుప్పిరి వెంకటేష్, దినకర్, భాగ్యలక్ష్మి , రాధిక, సాయికిరణ్, సిద్ధు, సరోజ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం, హక్కుల రక్షణకు ఉద్యమించాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సామాజిక న్యాయం, భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో బుధవారం దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి కె.ఏసురత్నం అధ్యక్షత వహించారు. ''సమకాలీన రాజకీయ పరిస్థితులు – రాజకీయ కర్తవ్యాలు'' అనే అంశంపై చాడ వెంకట్‌రెడ్డి ఉపన్యసించారు. సమాజంలోని దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలు రాజ్యాంగం కల్పించిన హక్కులను పూర్తిస్థాయిలో అనుభవించే పరిస్థితులను కల్పించడం ప్రతి ప్రజాస్వామ్య ప్రభుత్వ బాధ్యత అని ఆయన అన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం సాధించాలనే రాజ్యాంగ లక్ష్యాలను అమలు చేసినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని ఆయన పేర్కొన్నారు. దేశంలో దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలపై వివక్ష, హింసాత్మక దాడులు, అన్యాయాలు పెరుగుతున్నాయని చాడ వెంకట్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్య శక్తులు, యువత, మహిళలు, కార్మికులు, రైతులు, విద్యార్థులు ఐక్యంగా ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ సామాజిక సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకిక విలువలను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన అన్నారు. రాజ్యాంగ హక్కులపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు నిరంతర ప్రజా ఉద్యమాలు కొనసాగించాలని సూచించారు. సామాజిక న్యాయం పూర్తిస్థాయిలో అమలయ్యే వరకు ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులు తమ పోరాటాలను మరింత ఉధృతం చేయాలని చాడ వెంకట్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానగంటి పర్వతాలు, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్ కుమార్, కార్యనిర్వహక అధ్యక్షులు తాళ్లపల్లి లక్ష్మణ్‌తో పాటు వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎఐటియుసిలో భారీగా చేరికలు

### కండువా కప్పి ఆహ్వానించిన సంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్ సారథిరెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం సిఐటియు కార్మిక సంఘం నుంచి ఎఐటియుసిలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సుమారు 40 మంది ఆర్‌టిసి అద్దె బస్ డ్రైవర్లు, క్లీనర్లు, కార్మికులు చేరారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారథిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చేరిన వారిని ఉద్దేశించి అజయ్ సారథిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ మాట్లాడుతూ ఆర్‌టిసిని పూర్తిస్థాయిలో ప్రభుత్వంలో విలీనం చేసి, సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో కార్మికుల కోసం అద్దె బస్ డ్రైవర్లు క్లీనర్ల కోసం ఎఐటియుసి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎఐటియుసి చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులు అయి జిల్లా కేంద్రంలో వందలాదిమంది కార్మికులు ఎఐటియుసిలో చేరుతున్నారన్నారన్నారు. అన్ని రంగాల కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీలు, భవన నిర్మాణ కార్మికులు, తాపీ కార్మికులు, ఆశాలు సెకండ్ ఎఎన్‌ఎంలు, తోపుడు బండ్లు, చెరుకురసం బండ్లు, గప్చుప్ బండ్లు, వీధి వ్యాపారస్తులు అనేకమంది వందలాదిమంది కార్మికులు ఎఐటియుసిలో చేరుతున్నారని, వారి కోసం వారికి అండగా ఎఐటియుసి ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని ఒకవైపు కార్మికులకు అండగా ఉంటూ యాజమాన్యాలతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రేట్లు పెంచుతూ ముందుకు పోతున్నామన్నారు. భవిష్యత్తులో ఏ కష్టం వచ్చినా కార్మికులకు ఎఐటియుసి ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు నుండి ఎఐటియుసిలో చేరిన అద్దె బస్ డ్రైవర్లు, క్లీనర్లు మరియు కార్మికులకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని వారు తెలిపారు. ఎఐటియుసిలో చేరిన వారిలో దొంతు రవీందర్ గౌడ్, గడ్డం శ్రవణ్ కుమార్, రవీందర్, సంతోష్, సతీష్, రవికుమార్, వీరన్న, వెంకన్న, ఎలేందర్, బిక్షపతి, హైమద్, యాకయ్య, పవన్, నరేష్, రాజేష్, సురేష్, దసరు నాగేష్, ఉన్నారు ఈ కార్యక్రమంలో వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్ తదితరులు పాల్గొన్నారు ఏఐటియుసిలో చేరిన సందర్భంగా మిఠాయి తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. ఇటీవల ఎన్నికల్లో 33 వ వార్డు లో హ్యాట్రిక్ విజయం సాధించి బి.అజయ్ సారథి రెడ్డిని, 18వ వార్డులో విజయం సాధించిన రేశపల్లి నవీన్‌ని కార్మికులు శాలువాతో సన్మానించారు.

## గిరిజన సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/సూర్యాపేట :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలపై గిరిజన హక్కుల పరిరక్షణ కోసం రాబోయే రోజుల్లో రాజీలేని పోరాటాలు నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్మ భిక్షం భవన్‌లో సూర్యాపేట జిల్లా 3వ మహాసభ గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు సుల్తాని వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై గిరిజన సమాజం అంతా ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. గిరిజన హక్కుల హక్కులు, సమస్యల సాధనకు ఉద్యమించాలని కోరారు. గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ రాజారామ్ నాయక్ మాట్లాడుతూ గిరిజన సమస్యలపై పోరాటాలు నిర్వహించేందుకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈనెల 18,19తేదీల్లో పాల్వంచ కేంద్రంగా జరిగే తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గిరిజనుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం వారి హక్కుల సాధనకై నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. అనంతరం గిరిజన సమైక్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాయపూడి కాటంరాజు, ఉపాధ్యక్షులుగా భూక్య లలిత, బానోత్ ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుగులోతు రాజారాం, సహాయ కార్యదర్శిగా సుల్తాన్ వెంకటేశ్వర్లు, ఇస్లావత్ మనోజ్, కోశాధికారిగా జి.నరేష్‌తోపాటు 19 మందితో కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, సంఘ నాయకులు రాయపూడి కాటంరాజు, భూక్య లలిత, బానోత్ ప్రతాప్, గుగులోతు నరేష్, బానోతు రవి, నాయకులు శ్రీకాంత్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



## డిఎల్, ఆర్‌సి కార్డుల ముద్రణ పంపిణీ వేగవంతం చేయాలి

పెండింగ్ కార్డులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలి: రవాణా కమిషనర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా డ్రైవింగ్ లైసెన్స్ (డిఎల్), రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సి) కార్డుల ముద్రణ, పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న కార్డులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని తెలంగాణ రవాణా కమిషనర్ అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా రవాణా అధికారులు (డిటిఒలు), మోటారు వాహన తనిఖీ అధికారులు (ఎంవిఐలు)తో కలిసి డిఎల్, ఆర్‌సి కార్డుల ముద్రణ, పంపిణీ పురోగతిని సమీక్షించారు. ఆర్‌సి కార్డుల ముద్రణకు ముందు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ వివరాల అప్‌లోడ్ తప్పనిసరి అని పేర్కొన్న కమిషనర్, పెండింగ్‌లో ఉన్న హెచ్‌ఎస్‌ఆర్‌పి వివరాల నమోదును వేగవంతం చేసి మిగిలిన ఆర్‌సి కార్డులను త్వరితగతిన ముద్రించాలని అధికారులను ఆదేశించారు. ఇఎంఎస్ (ఎలక్ట్రానిక్ మీడియా సర్వీస్) వ్యవస్థలో తలెత్తుతున్న సాంకేతిక లోపాలు, స్థానికంగా ఉన్న పరికరాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్డుల పంపిణీ ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి కార్డుకు సంబంధించిన ఇఎంఎస్ డిస్పాచ్ నంబర్ నమోదు చేయడంతో పాటు, జిల్లాల వారీగా ప్రతిరోజూ ముద్రణ, పంపిణీ వివరాలను నమోదు చేసే విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కార్డులను సకాలంలో అందించడం రవాణా శాఖ ప్రధాన లక్ష్యమని రవాణా కమిషనర్ పునరుద్ఘాటించారు. కార్డుల ముద్రణ, సరఫరా లేదా పరికరాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి కార్యాలయాలకు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

## ఎన్‌డిఎస్‌ఎ నివేదికను అమలు చేయడం తప్పని సరికాదు

బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కన్నెపల్లి నుంచి నీళ్లు లిఫ్ట్ చేయాలని మొత్తుకున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని, ప్రస్తుతం నీళ్లు లిఫ్ట్ చేద్దామన్న నీళ్లు లేని పరిస్థితి ఉన్నదని బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఎన్‌డిఎస్‌ఎ నివేదికను అమలు చేయడం తప్పని సరికాదన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు, ప్రతిపక్ష నేత జగన్ ఇద్దరూ పాము, ముంగీస తరహా ఉన్నప్పటికీ పోలవరం ప్రాజెక్ట్ విషయంలో విమర్శలు చేసుకోలేదని, పది సార్లు పోలవరం నిర్మాణాల్లో తప్పిదాలు జరిగినా చంద్రబాబు, జగన్ పరస్పరం తప్పుపట్టుకోలేదని తెలిపారు. పోలవం ప్రాజెక్ట్‌లో అక్కడి నాయకులు ప్రదర్శిస్తున్న విజ్ఞతను తెలంగాణ రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి కూడా ప్రదర్శించాలని సూచించారు. ఎన్నికలకు చివరి సంవత్సరంలో రాజకీయాలు చేసుకుందామని, అప్పటి వరకు ద్వేషరహిత పాలన చేయాలని ఆయన తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిపోయిందని ఇంకా ఎన్ని రోజులు మాట్లాడతారన్నారు. ఇప్పటికైనా ఎన్‌డిఎస్‌ఎను బూచీగా చూపడం మానేసి మేడిగడ్డ, కన్నెపల్లి నుంచి ఎప్పుడు నీళ్లు అందుబాటులో ఉంటే అప్పుడే లిఫ్ట్ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నీళ్లు అనేది రాష్ట్ర అంశమని, కేవలం ద్వేష పూరిత రాజకీయాల్లో భాగంగానే సిఎం రేవంత్ రెడ్డి ఎన్‌డిఎస్‌ఎ రిపోర్టును సాకుగా చూపుతున్నారని మండిపడ్డారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు పడకపోతే హైదరాబాద్‌లో మొహం కడుక్కోవడానికి కూడా నీళ్లు ఉండబోవని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్‌వి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ,కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## కవలలు పుట్టినా రెండో ప్రసవానికి ప్రసూతి సెలవు ఇవ్వాలి

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** మొదటి ప్రసవంలో కవలలు జన్మించిన మహిళకు రెండో ప్రసవానికి ప్రసూతి సెలవు నిరాకరించడం చట్టబద్ధం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన గురుకుల జూనియర్ లెక్చరర్ జాడి స్వరూపరాణి దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతిస్తూ, మొదటి కాన్పులో కవలలు పుట్టినందున రెండో ప్రసవానికి సెలవు నిరాకరించలేమని పేర్కొంది. పిటిషనర్‌కు 180 రోజుల ప్రసూతి సెలవుతో పాటు ఆ కాలానికి సంబంధించిన పూర్తి వేతనాలు చెల్లించాలని గురుకుల సొసైటీ అధికారులను ఆదేశించింది.

## ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు తాత్కాలిక ఊరట

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలున్నాయంటూ జిహెచ్‌ఎంసి జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు మధ్యంతర ఊరట కల్పించింది. నిర్మాణాలకు సంబంధించి ప్రస్తుతం యథాతథస్థితి కొనసాగించాలని, వారం రోజుల పాటు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని జిహెచ్‌ఎంసి, హైడ్రాలకు ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సూచిస్తూ విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది.

## తెలంగాణ న్యాయవాదులకే ప్రాధాన్యం ఇవ్వాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో తెలంగాణ మూలాలు ఉన్న న్యాయవాదులకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ అంశంపై భారత ప్రధాన న్యాయమూర్తిని కలిసి వినతిపత్రం సమర్పించాలని బుధవారం జరిగిన అత్యవసర సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించింది. నియామకాల్లో స్థానిక న్యాయవాదులకు అవకాశాలు కల్పించడంతో పాటు సామాజిక న్యాయ సూత్రాలకు అనుగుణంగా అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని సమావేశం కోరింది.

## రెండు తాజ్ హోటల్స్‌కు ఎదురుదెబ్బ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అబిడ్స్‌లోని తాజ్ మహల్ హోటల్, సికింద్రాబాద్ సెవెన్ హిల్స్ ప్లాజాలోని తాజ్ ట్రిస్టార్ హోటల్ క్రాస్ సబ్సిడీ సర్‌చార్జ్ (సిఎస్‌ఎస్) డిమాండ్ నోటీసులను సవాల్ చేస్తూ దాఖలు చేసిన రెండు వేర్వేరు రిట్ పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. గతంలో ఇదే వివాదంపై దాఖలైన పిటిషన్లను ఉపసంహరించుకుని, బకాయిలను వాయిదాల్లో చెల్లించేందుకు విద్యుత్ సంస్థ నుంచి అనుమతి పొందిన విషయాలను కోర్టు ముందు దాచిపెట్టారని పేర్కొంటూ ఒక్కో పిటిషన్‌పై రూ.10 లక్షల చొప్పున కాస్ట్స్ విధించింది. ఆ మొత్తాన్ని తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థకు చెల్లించాలని ఆదేశించింది.

## 'కాళేశ్వరం' భద్రతపై ప్రభుత్వాలకు నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, కన్నెపల్లి, సుందిళ్ల పంపుహౌస్‌ల భద్రతపై ఎన్‌డీఎస్‌ఏ నివేదికను అమలు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు బుధవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది. ప్రాజెక్టు భద్రతపై సమగ్ర సాంకేతిక అధ్యయనం చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరగా, దీనిపై ప్రతివాదులు వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 21కు వాయిదా వేసింది.

# ఫలక్‌నుమా ప్యాలెస్‌లో బ్రిక్స్ మంత్రులకు విందు

హాజరైన సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లో జరుగుతున్న బ్రిక్స్ కార్మిక, ఉపాధి మంత్రుల సదస్సు మరియు బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ సమ్మిట్–2026 సందర్భంగా కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఫలక్‌నుమా ప్యాలెస్‌లో బ్రిక్స్ దేశాల మంత్రుల బృందానికి అధికారిక విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరై బ్రిక్స్ దేశాల ప్రతినిధులతో ఆత్మీయంగా మమేకమయ్యారు.ఈ సందర్భంగా దక్షిణాఫ్రికా, ఇండోనేషియా, చైనా, రష్యా, ఇరాన్, ఇథియోపియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), బ్రెజిల్ దేశాల మంత్రులను సిఎం రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకుని పలకరించారు. అంతర్జాతీయ సహకారం, పరస్పర సంబంధాల బలోపేతానికి ఇలాంటి సమావేశాలు దోహదపడతాయని ఈ సందర్భంగా అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిపింది. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో పాటు రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ముఖ్యమంత్రి సలహాదారు వేం. రామకృష్ణారావు, సిఎం ప్రధాన కార్యదర్శి ఎస్. శ్రీధర్, తెలంగాణ డిజిపి సివి ఆనంద్, కార్మిక శాఖ కార్యదర్శి హరిచందనతో పాటు పలువురు ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నేటి నుంచి ఆషాఢ బోనాలు

రూ.20 కోట్లతో ఘనంగా ఏర్పాట్లు
గోల్కొండలో తొలి బోనంతో ప్రారంభం..
ఆగస్టు 13 వరకు ఉత్సవాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ఆషాఢ బోనాల ఉత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పణతో ప్రారంభమయ్యే ఉత్సవాలు ఆగస్టు 13న హరిబౌలిలోని అక్కన్న–మాదన్న మహంకాళి ఆలయంలో ఘటాల నిమజ్జనంతో ముగియనున్నాయి. ఈ మేరకు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్న సుమారు మూడు వేలకుపైగా దేవాలయాల్లో బోనాల ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. లక్షలాది మంది భక్తులు పాల్గొనే నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. బోనాల ఉత్సవాలు తెలంగాణ గంగా–జమున సంస్కృతికి, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఈ ఏడాది బోనాల నిర్వహణకు రూ.20 కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవార్ల అనుగ్రహంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రజలకు ఆషాఢ బోనాల శుభాకాంక్షలు తెలియజేశారు.

# సైబర్ మోసాల బాధితులకు డబ్బు రీఫండ్‌కు ఎంఆర్ఎం వినియోగించాలి

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ మోసాలకు గురై డబ్బు కోల్పోయిన బాధితులు తమ రీఫండ్ అభ్యర్థనలను నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్న మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ (ఎంఆర్ఎం) ద్వారానే సమర్పించాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) సూచించింది. హోం మంత్రిత్వ శాఖ నుంచి రీఫండ్‌కు సంబంధించిన ఎస్ఎంఎస్ లేదా నోటిఫికేషన్ అందుకున్న బాధితులు ఈ విధానాన్ని తప్పనిసరిగా అనుసరించాలని వెల్లడించింది. రీఫండ్ ప్రక్రియకు సంబంధించి సందేహాలు లేదా సాంకేతిక సహాయం అవసరమైతే ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 8712665600 హెల్ప్‌డెస్క్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపింది. అలాగే సమీప పోలీస్ స్టేషన్ ,కేసు దర్యాప్తు చేస్తున్న దర్యాప్తు అధికారిని కూడా సంప్రదించవచ్చని పేర్కొంది. సైబర్ నేరాల ద్వారా నిలిపివేయబడిన లేదా ఫ్రీజ్ చేసిన నిధులను చట్ట అమలు సంస్థలు, బ్యాంకులు అవసరమైన ధృవీకరణ పూర్తిచేసిన తర్వాత అర్హులైన బాధితుల ఖాతాలకు తిరిగి జమ చేసే విధానమే మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ అని టిజిసిఎస్‌బి వివరించింది.

### రీఫండ్ కోసం అనుసరించాల్సిన విధానం

సైబర్ క్రైమ్ ఫిర్యాదుకు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో పోర్టల్‌లో లాగిన్ కావాలి. అనంతరం ఒటిపి ద్వారా ధృవీకరణ పూర్తి చేసి, అర్హత కలిగిన ఫిర్యాదు, సంబంధిత బ్యాంకు ఖాతాను ఎంపిక చేయాలి. అవసరమైతే పాన్ కార్డు వివరాలను అప్లోడ్ చేసి గుర్తింపును ధృవీకరించాలి. రీఫండ్ వివరాలను పరిశీలించిన తర్వాత ఆన్‌లైన్‌లో అభ్యర్థనను సమర్పించాలి. అభ్యర్థన అందిన తర్వాత చట్టపరమైన, పరిపాలనా మార్గదర్శకాల ప్రకారం పరిశీలన, ధృవీకరణ చేపడతారు. ప్రక్రియ పూర్తయిన అనంత రం అర్హత కలిగిన రీఫండ్ మొత్తాన్ని బాధితుడి ధృవీకరించబడిన బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తారు.

### ప్రజలకు కీలక సూచనలు..

హోం మంత్రిత్వ శాఖ ప్రకటించిన అధికారిక విధానాన్ని మాత్రమే అనుసరించాలని టిజిసిఎస్‌బి సూచించింది. రీఫండ్ త్వరగా ఇప్పిస్తామని చెప్పే వ్యక్తులకు ఒటిపిలు, పాస్‌వర్డు, బ్యాంకు ఖాతా వివరాలు లేదా వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వొద్దని హెచ్చరించింది. పోలీసు, బ్యాంకు లేదా ప్రభుత్వ అధికారుల పేరుతో డబ్బు లేదా రహస్య సమాచారం అడిగే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. ఎంఆర్ఎం ద్వారా రీఫండ్ అభ్యర్థన సమర్పించేందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఈ సమాచారాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులతో పంచుకోవాలని, సైబర్ నేరాలకు సంబంధించిన సేవల కోసం ప్రభుత్వ అధికారిక వేదికలను మాత్రమే వినియోగించాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయెల్ విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ,ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో...
# నియోజకవర్గాల అభివృద్ధి సుసాధ్యం

తెలంగాణ రాష్ట్ర శాసనసభ సచివాలయం, 'ఈక్విప్' ఎంఒయు కార్యక్రమంలో వక్తలు
హాజరైన గుత్తా సుఖేందర్‌రెడ్డి, గడ్డం ప్రసాద్‌కుమార్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో నియోజకవర్గాల అభివృద్ధి సుసాధ్యం అవుతుందని, ప్రైవేట్ సంస్థలు కూడా అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర శాసనసభ సచివాలయం, ఈక్విప్ (ఇక్యుయుఐపిపిపి) సోషల్ ఇంపాక్ట్ టెక్నాలజీస్ లిమిటెడ్ మధ్య నియోజక వర్గ అభివృద్ధి మార్పిడి (సిడిఎక్స్) పై ఒక అవగాహన ఒప్పందం (ఎంఒయు)జరిగింది. శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ ఎంఒయు కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాష్, కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, ఈక్విప్ ఫౌండర్ లక్ష్మీ నారాయణ, ఈక్విప్ డైరెక్టర్ వింధ్యా ధర్మరాజు, ఐల్యాబ్స్ ఛైర్మన్‌ఖ శ్రీనిరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 119అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రజల సంక్షేమం కోసం సరికొత్తగా ఈక్విప్ సోషల్ ఇంపాక్ట్ టెక్నాలజీ లిమిటెడ్ సంస్థతో ఎంఒయు జరగడం శుభపరిణామం అన్నారు. ప్రస్తుత రాజకీయాలలో చాలా మార్పులు వచ్చాయని, చట్టాలు తయారుచేసే ఎమ్మెల్యేలు నేడు నియోజకవర్గ స్థాయిలో అన్ని పనులుచేసే బాధ్యుడుగా మారారని తెలియజేశారు. ఏ చిన్న సమస్య ఉన్నా స్థానిక ఎమ్మెల్యే పైనే ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అసెంబ్లీ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వంతోపాటు ప్రైవేట్ రంగం, పౌర సమాజం, విద్యా సంస్థలు, దాతలు, ఎన్‌జిఓలను సమీకరించి సిఎస్‌ఆర్ నిధులను సమీకరించి వారిని అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడం ద్వారా తెలంగాణరాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులను సాధించవచ్చని పేర్కొన్నారు. శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వనిధుల అవసరం లేకుండా నియోజకవర్గాల అభివృద్ధికి ఒక వేదికగా ఈక్విప్ సంస్థ నూతన ఆలోచనతో ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని శ్రీధర్‌బాబు భరోసా ఇచ్చారు.

# 23 నియోజకవర్గాలకు తెలంగాణ రక్షణ సేన ఇన్‌చార్జిలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**రాష్ట్రంలోని 23 శాసనసభ నియోజకవర్గాలకు తెలంగాణ రక్షణ సేన ఇన్‌చార్జిలను నియమించినట్టు ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బుధవారం ప్రకటించారు. 23 మంది ఇన్‌చార్జిలలో 12 మంది బిసిలు, ఐదుగురు ఎస్‌సిలు, ఒక ఎస్‌టి, ఒసి నాయకునికి అవకాశం కల్పించారు. కవిత లక్కీ నంబర్ 5 అంకెలు వచ్చే విధంగా 23 స్థానాలకు ఇన్ చార్జిలను ప్రకటించారు. మిగతా నియోజకవర్గాలకు కూడా త్వరలోనే ఇన్ చార్జిలను ప్రకటించనున్నారు. ఇన్‌చార్జిలుగా నియామితులైన వారు స్థానిక నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ, స్థానిక సమస్యలపై పోరాడాలని కవిత వారికి సూచించారు. పార్టీ పాంచజన్య సిద్ధాంతాన్ని ప్రతి గడపకు చేరవేసి, తెలంగాణ రక్షణ సేన పార్టీని బలోపేతానికి కృషి చేయాలన్నారు. సింగరేణి మెడికల్ బోర్డుపై స్పష్టమైన ప్రకటన చేయాలని, లేదంటే ఈ నెల 20వ తేదీ నుంచి నిరవధిక దీక్ష చేపట్టనున్నట్టు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. సింగరేణిలో కార్మికులకు డిపెండెంట్ ఉద్యోగాలు హక్కు భుక్తంగా ఉండాలని, మెడికల్ బోర్డు కచ్చితంగా నెలకు ఒకసారి పెట్టాలని ఆమె బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలన్నీ క్లియర్ అయ్యే వరకు నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టాలన్నారు. తాము బాయిబాట పట్టగానే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు.

## ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వాలు ప్రధాన బాధ్యులు కావాలి

సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** దేశంలోపెరుగుతున్న నిరుద్యోగ సమస్య నిలువరించేందుకు ఉపాధి అవకాశాల కల్పనను ప్రభుత్వాలు ప్రధాన బాధ్యతగా తీసుకోవాలని సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు డిమాండ్ చేశారు. ఉపాధిని ప్రాథమిక హక్కుగా మార్చే దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడంతో పాటు ఉద్యోగ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో మహాధర్నాను నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి రాఘవులు మాట్లాడుతూ ప్రభుత్వాలు జాబ్ క్యాలెండర్లు విడుదల చేసి నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ పెరుగుతోందని, ఉన్నత విద్య చదివిన వారిలో కూడా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని రాఘవులు ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్ వంటి ఘటనలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని అన్నారు. సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. యువత కులం, మతం, ప్రాంతాల పేరుతో విడిపోకుండా ఉపాధి, హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ తెలంగాణలో ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపించారు. నిరుద్యోగుల సమస్యలపై ఆగస్టులో జిల్లా, మండల స్థాయిలో ఆందోళనలు చేపడతామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ ఉద్యోగాల కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాధర్నాలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్, మల్లు లక్ష్మి , బండారు రవి కుమార్, ఎం.డి.జహంగీర్, అబ్బాస్, నున్నా నాగేశ్వర్‌రావు, డివైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటరమేశ్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## సిసిఐ ప్లాంట్‌ను వెంటనే తెరిపించాలి

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ప్లాంట్‌ను వెంటనే తెరిపించాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కెటిఆర్ నేతృత్వంలో సిసిఐ సాధన సమితి సభ్యుల బృందం, బిఆర్‌ఎస్ నాయకులు ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం కెటిఆర్ మాట్లాడుతూ సిసిఐ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. సిసిఐ ప్లాంట్ పునఃప్రారంభానికి ప్రస్తుత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రోత్సాహం, చిత్తశుద్ధి ఎంతో అవసరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్లాంట్ కోసం ఎలాంటి ప్రతిపాదనలు చేస్తుందో, ఎంత పెట్టుబడి పెడుతుందో వెంటనే బహిరంగంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. మారుమూల ప్రాంతానికి చెందిన వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే సిసిఐ ప్లాంట్‌ను తిరిగి తెరిపించే వరకు బిఆర్‌ఎస్ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందన్నారు. సిసిఐ పునరుద్ధరణ కోసం గత ఏడాది కాలంగా కేంద్రం ఇన్సెంటివ్స్, పవర్ సబ్సిడీ, క్యాపిటల్ సబ్సిడీ, జిఎస్‌టి మినహాయింపులపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు కోరుతున్నప్పటికీ స్పందించడం లేదని ఈ విషయాలను దాటవేస్తోందని ఆరోపించారు. ఎన్‌డిఎస్‌ఎ అనేది ఒక అడ్వైజరీ,రెగ్యులేటరీ బాడీ మాత్రమేనని, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలను శాసించే సంపూర్ణ అధికారాలు ఆ ఎన్‌డిఎస్‌ఎకు ఏ మాత్రం లేదని కెటిఆర్ తెలిపారు. ఈ ప్రతినిధి బృదంలో బిఆర్‌ఎస్ నాయకులు మాజీ మంత్రి జోగురామన్న, రాజ్యసభలో బిఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తదితరులు ఉన్నారు.



## 'అంబేద్కర్'యూనివర్సిటీలో ఐదు కొత్త కోర్సులకు యుజిసి అనుమతి...



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో (బిఆర్ఎఒయు) కొత్తగా ఐదు కోర్సులకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) ఆమోదం తెలిపిందని విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి తెలిపారు. ఈ ఐదు కోర్సులకు ప్రొఫెషనల్, అకాడమిక్ రం గాల్లో ఎక్కువ డిమాండ్ ఉందన్నారు. కొత్తగా యుజిసి ఆమోదం తెలిపిన కోర్సుల్లో...: ఎం.ఎ ఎడ్యుకేషన్; ఎం.ఎ.ఎడ్యుకేషన్ (స్కూల్ అడ్మినిస్ట్రేషన్); మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యు); ఎమ్మెస్సీ . (జాగ్రఫీ); బిఇడి. (స్పెషల్ ఎడ్యుకేషన్) (అనుమతి పునరుద్ధరణ) ఉన్నాయని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కొత్త కోర్సులకు అనుమతి రావడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటు ఉందన్నారు. రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగిత రాణా రాష్ట్రంలోని టీచర్లకు ఓపెన్, డిస్టెన్స్ లర్నింగ్ ద్వారా ప్రత్యేక ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అందించాలనే ఉద్దేశ్యంతో ఈ కోర్సులనురూ పొం దించగా, వీటిని యుజిసి ఆమోదించిందని ఆయన వివరించారు.విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తమ అర్హతలను మెరుగుపర్చుకునేందుకు, న్యా యకత్వ లక్షణాలను పెంపొందించుకునేందుకు, స్కూల్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్ష ణ పొందేందుకు విధి నిర్వహణలో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఈ కోర్సులు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు శిక్షణను అందించే విషయమై త్వరలోనే తెలంగాణ విద్యా శాఖతో అవగాహనా ఒప్పందం చేసుకోనున్నట్లు వెల్లడించారు. ఈ కొత్త కోర్సుల కోసం కనీస అర్హత, అడ్మిషన్ విధానం, ఫీజుల వివరాలు, కోర్సు వ్యవధి, స్టడీ సెంటర్లు వివరాలతో విశ్వవిద్యాలయం త్వరలో అడ్మిషన్ నోటిఫికేషన్ జారీ చేస్తుందని ఆయన వివరించారు. తాజా సమాచారం కోసం విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.braou.ac.in లేదా www.braouonline.inను సందర్శించాలని, లేదా హెల్ప్ డెస్క్ 040 23680 333/555ను సంప్రదించాలని సూచించారు.

## వరంగల్ ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ కేంద్రానిదే

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**వరంగల్ (మామునూరు) ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు విషయంలో కేంద్ర ప్రభుత్వ పాత్రను విస్మరించి, మొత్తం క్రెడిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని ప్రయత్నించడం సరైంది కాదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2011లోనే రైట్స్ సంస్థ ఫీజిబిలిటీ నివేదిక సమర్పించినప్పటికీ, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, అనంతరం బిఆర్‌ఎస్ ప్రభుత్వం భూసేకరణ చేపట్టకపోవడంతో ప్రాజెక్టు ఆలస్యమైందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉడాన్ పథకం కింద అవసరమైన వెసులుబాట్లు కల్పించి వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు మార్గం సుగమం చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇక ఆలస్యం చేయకుండా భూసేకర ణ పూర్తి చేసి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ)కి భూములు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. వరంగల్‌లో పాటు ఆదిలాబాద్ డిఫెన్స్ ఎయిర్‌పోర్ట్‌కు కూడా కేంద్రం సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం చేస్తున్న ప్రకటనలతో కాకుండా పనులు పూర్తి చేసి చూపించాలని సిఎం రేవంత్‌రెడ్డికి సూచించారు.

## ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ కార్డులు వెంటనే జారీ చేయాలి :హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు,పెన్షనర్ల హెల్త్ స్కీమ్ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన కాలపరిమితి ముగిసనప్పటికీ, ఇప్పటి వరకు హెల్త్ కార్డులను జారీ చేయలేదని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఉద్యోగుల నుంచి ప్రభుత్వం రెండు నెలల ప్రీమియంను వసూలు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఆ పథకాన్ని మాత్రం అమలు చేయకపోవడం మోసం చేయడమేనని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక వైపు ఉపాధ్యాయులకు వేతనాలు ఎక్కువగా ఉన్నాయని నివేదికను తెప్పించుకుంటారని, మరోవైపు రిటైర్డ్ ఇంజనీర్లను బెదిరింపులకు గురి చేస్తారని, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు అంటే ప్రభుత్వానికి ఎందుకంత కక్ష అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఉద్యోగులకు వెంటనే హెల్త్ కార్డులను జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పథకాన్ని అమలు చేయక ముందే రెండు నెలలుగా ఉద్యోగులు జీతం, పెన్షన్ల నుంచి ప్రభుత్వం 1.5 శాతం కోత విధించిందని గుర్తు చేశారు. 30 నెలలు గడిచినప్పటికీ పీఆర్సీ లేదని, హెల్త్ కార్డులు రాలేదని, 6డీఏల జాడే లేదని, సీపీఎస్ రద్దు ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. ఆసుపత్రులకు నిధులు చెల్లించకుండా పోలీసులకు భద్రత పథకాన్ని అటకెక్కించారన్నారు. జర్నలిస్టుల హెల్త్ కార్డులను గాలికి వదిలేశారని, తద్వారా వారి సంక్షేమం ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు.



## మాసెచూసెట్స్ పసుపుమయం

అమెరికాలోని మాసెచూసెట్స్ రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం పసుపు వర్ణాన్ని సంతరించుకుంది. కాలిఫోర్నియా సహా పలు ప్రాంతాలతో పాటు కెనడాలోనూ చోటు చేసుకుంటున్న కార్చిర్చు ప్రభావమే ఈ మార్పుకు కారణమని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. సాధారణంగా కనిపించే ఆకాశాన్ని, పసుపు రంగులో ఉన్న వైనాన్ని ఈ ఫొటోల్లో చూడవచ్చు.



## బిపిసిఎల్‌లో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** రెటినోవా ఫౌండేషన్, పీపుల్ వెల్ఫేర్ ట్రస్ట్, నవోదయ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో బిపిసిఎల్ ప్రాంగణంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి, దంత పరీక్షలు, సాధారణ పరీక్షలు, బాడీ చెకప్, బిపి, షుగర్ పరీక్షలు చేశారు. ఇందులో రెటినోవా ఫౌండేషన్ డెరెక్టర్ సునీల్‌కుమార్, నవోదయ సంక్షేమ వేదిక అధ్యక్షురాలు శ్రీదేవి, పిడబ్ల్యూటి చైర్మన్ వరప్రసాద్, బిపిసిఎల్ సంస్థ ఇన్ చార్జ్, చీఫ్ మేనేజర్ మనోజిత్, కిషన్,శ్రీనివాస్ ఉద్యోగులు,వారి కుటుంబ సభ్యులు,స్థానిక ప్రజలు.ప్లానెట్ ఆప్టిక్స్,క్లోస్ డెంటల్,కేర్ ఆసుపత్రి, శ్రీకర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ వేగవంతం

### కీసర డిప్యూటీ కమిషనర్ రామలింగం

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** కీసర సర్కిల్ పరిధిలోని జవహర్ నగర్‌లో ఓటర్ల నమోదు ప్రక్రియ సర్‌ను వేగవంతం చేసినట్లు కీసర డిప్యూటీ కమిషనర్ రామలింగం తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ సర్ ప్రక్రియను గడువులోగా, త్వరితగతిన పూర్తి చేసేందుకు బూత్ స్థాయి అధికారులతో పాటు అధికారుల సూచన మేరకు మున్సిపల్ సిబ్బందిని కూడా ప్రత్యేకంగా కేటాయించినట్లు వెల్లడించారు. ఓటర్ల నమోదు ఫారాలు పూర్తిచేసిన వారందరూ విధిగా వాటిని అధికారులకు అందజేయాలని ఆయన సూచించారు. ఇంకా ఫారాలు నింపని వారు ఎవరైనా ఉంటే, వారు స్థానిక బిఎల్‌ఒల సహాయం తీసుకుని త్వరగా పూర్తి చేయాలని కోరారు. నిర్దేశిత గడువులోగా ఈ ప్రక్రియను ముగించేలా స్థానిక, అధికారులు వివిధ పార్టీల నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిసి పేర్కొన్నారు.



## బాధ్యతల స్వీకారం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఘట్‌కేసర్ సర్కిల్‌లో కాంట్రాక్ట్ సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ సంక్షేమం లక్ష్మంగా కాంట్రాక్ట్ యూనియన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా నూతన సభ్యులను ఎన్నుకుని అభినందనలు తెలిపారు. యూనియన్ అధ్యక్షుడిగా బొంత సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా బోదాస్ రవి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మెడబోయిన సంజీవ ముదిరాజ్, ట్రెజరర్‌గా వరికుప్పల శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ రంజిత్ రెడ్డి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం కాంట్రాక్ట్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వారి సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కాంట్రాక్ట్‌ల ప్రయోజనాల కోసం ఐక్యంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

## రేషన్ కార్డు ఇ-కెవైసి చేసుకోవాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో రేషన్ కార్డులు ఉన్న వినియోగదారులంతా తమ సమీప రేషన్ దుకాణాల్లో ఈ కెవైసీ పూర్తి చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి కోరారు. ఇప్పటి వరకు జిల్లాలో ఉన్న 22,52,492 రేషన్ కార్డుల్లో 73.56 శాతంగా 16,57,003 మంది వినియోగదార్లు ఈ కెవైసి పూర్తి చేసుకొన్నారని, మిగిలిన వినియోగదారులు సైతం వెంటనే పూర్తి చేసుకోవాలన్నారు.



## సహకార బ్యాంకుల చైర్మన్, డైరెక్టర్ల నియామక ప్రక్రియ షురూ

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో సహకార బ్యాంకుల చైర్మన్, డైరెక్టర్ల నియామక ప్రక్రియ ప్రారంభమైంది. దీనిలో భాగంగా ఈ పదవులను ఆశిస్తున్న వారి నుండి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించి అభిప్రాయ సేకరణ చేపట్టారు. బుధవారం కిష్టాపూర్ డివిజన్ అత్వెల్లిలోని జిఎన్ఆర్ ఫంక్షన్ హాలులో పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయరమణరావు, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు ప్రభాకర్ గౌడ్, జిల్లా జడ్‌పి మాజీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, ఓబిసి చైర్మన్ రవి ముదిరాజ్, ఆర్‌టిఏ సభ్యుడు జైపాల్ రెడ్డి, మహేష్ గౌడ్, ఆలియాబాద్ మున్సిపల్ చైర్మన్ శిరిష రెడ్డి, తదితరులతో సమావేశమై చర్చించారు.



## ఇంటింటికీ ఎస్ఐఆర్...బిఆర్ఎస్ ముందడుగు

### మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** మున్సిపల్ కార్పొరేషన్ పోచారం 8వ డివిజన్‌లో అన్నోజిగూడ రాజీవ్ గృహకల్పలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి కార్యక్రమాన్ని పరిశీలించి ప్రజలకు ఎస్ఐఆర్ ప్రకియపై అవగాహన కల్పించారు. బిఆర్ఎస్ యువజన అధ్యక్షుడు కొమ్ముల ప్రశాంత్ ఆధ్వర్యంలో 354నుంచి 361వరకు ఉన్న ఎనిమిది పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రచారం చేపట్టారు. కెటిఆర్ ఆదేశాల మేరకు బూత్‌స్థాయి నాయకులు అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి దరఖాస్తు పత్రాలను బూత్ స్థాయి అధికారులకు అంజేయాలని బోయపల్లి కొండల్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చింతల రాజశేఖర్, బెజ్జంకి హరిప్రసాద్‌రావు, అబ్బవతిని నర్సింహా, నానావత్ జితేందర్ నాయక్ లు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే హోటళ్లు సీజ్

### ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి హెచ్చరిక



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే విధంగా వ్యవహరించే హోటళ్లను సీజ్ చేస్తామని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన మేడ్చల్ జిల్లాలోని హబ్సిగూడ ప్రాంతంలో ఉన్న సుప్రభాత్, అమరావతి హోటళ్లను ఆకస్మికంగా తనిఖీలు చేసారు. ఆ హోటళ్ల కిచెన్ల నుండి మిగిలిన ఆహార వ్యర్థాలను పశువులు, పందుల ఫార్మ్‌లకు అందిస్తున్నట్లు గమనించారు. అనంతరం సమీపంలోని పశువుల ఫార్మ్‌లను సైతం పరిశీలించిన ఆయన హోటళ్ల ద్వారా వచ్చే వ్యర్థ ఆహార పదార్థాలను పశువులు తినటం వల్ల అనారోగ్యాల పాలవుతున్నట్లు తెలుసుకున్నారు. ఈ కారణంగా హోటళ్లు పశువుల ఫార్మ్‌లకు బహిరంగంగా నిలువ ఉంచిన ఆహార వ్యర్థ పదార్థాలను తరలించటం పట్ల యాజమాన్యాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. దీని వల్ల పశువులు అనారోగ్యానికి గురవటమే కాక దుర్వాసన, కాలుష్యం, వ్యాధుల వ్యాప్తికి దారి తీసి ప్రజారోగ్యానికి ప్రమాదకర పరిస్థితులు నెలకొంటాయని కమిషనర్ పేర్కొన్నారు. అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు తమ వద్ద ఉత్పత్తి అయ్యే తడి ఆహార వ్యర్థాల నిర్వహణ కోసం తప్పనిసరిగా ఇన్‌సిటు బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవటం కానీ అధీకృత వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలకు మాత్రమే తరలించే ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఆహార వ్యర్థ పదార్థాలను బహిరంగంగా పారవేయటం, పశువుల అనారోగ్యాలకు దారి తీసే విధంగా పశువుల ఫార్మ్‌లకు తరలించటం చేస్తే సహించబోమని, ఇలాంటి పనులు పునరావృతమైతే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ప్రజారోగ్య పరిరక్షణ, పరిశుభ్రమైన నగర నిర్మాణం, శాస్త్రీయ ఘన వ్యర్థాల నిర్వహణలో అన్ని వ్యాపార సంస్థలు తమ సామాజిక బాధ్యతను గుర్తించి ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం వికారాబాద్ జిల్లా కమిటీ ఎన్నిక

### ముఖ్యఅతిథిగా రాష్ట రైతు సంఘ రాష్ట కార్యదర్శి పశ్యపద్మ



**ప్రజాపక్షం/వికారాబాద్:** జిల్లా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సమావేశం వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కమిటీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఎన్నికకు ముఖ్య అతిథిగా రాష్ట రైతు సంఘ రాష్ట కార్యదర్శి పశ్య పద్మ హాజరై కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా జి. హనుమంతు, కమిటీ సభ్యులుగా లోకేష్ రాథోడ్, కె. అంజిలయ్య, విమలమ్మ, హుస్సేనప్ప, నర్సింలు, బోయినిరాజు, ఆంజనేయులు, మంగమ్మ, అంజిలప్ప, నరసింహులు, నందన్, అనంతయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాపై నమ్మకం ఉంచి నూతన జిల్లా కమిటీలోకి తీసుకున్న జిల్లా, రాష్టనాయకులు నూతన కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి తెలంగాణ రాష్ట రైతుసంఘం జిల్లా కార్యదర్శి, గంటి సురేష్ ,సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ అభినందనలు తెలిపారు. నూతన కమిటీ రైతు సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని రాష్ట కార్యదర్శి పశ్యపద్మ తెలిపారు.

## రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి

### ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు:** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. బుదవారం తాండూరు మండల పరిధి జినగుర్తిలో శ్రీనివాస్ స్మారకార్థ పందికొట్టె రాములు ఆధ్వర్యాన నిర్వహించిన మెమోరియల్ వాలీబాల్ పోటీలను పట్నం మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. అంతకు ముందు శ్రీనివాస్ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. శ్రీనివాస్ స్మారకార్థం హెల్మెట్ల ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ తమ బాధ్యతగా వాహనాలను నడిపించాలని సూచించారు. క్రీడలు మానసిక వికాసం, శారీరక దృడత్వానికి దోహదపడుతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో దాగి ఉన్న క్రీడాకారులను వెలికి తీసేందుకు తమ వంతు సహకారం అందజేస్తానని అన్నారు. క్రీడలను ప్రోత్సహించడానికే అంతరాష్ట్ర క్రీడాపోటీలను తాండూరులో నిర్వహించామన్నారు. దివంగత తమ సోదరుడు పట్నం రాజేందర్‌రెడ్డి స్మారకార్థం ప్రతి యేటా యువతకు క్రీడా పోటీలను నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రచార కమిటి సమన్వయకర్త,సర్ నియోజకవర్గం కన్వీనర్ పురుషోత్తమరావు, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, మాజీ ఎంపిపి రాంలింగారెడ్డి, వడ్డేర సంఘం నేత రాములు, ఎంఆర్‌పిఎస్ నాయకులు నర్సింహులు, సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసి మాజీ సర్పంచ్ విజయలక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

## రాంకీ జిఎం శ్రీనివాస్ బెదిరింపులు మానుకోవాలి

- ✻ జవహర్‌నగర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట కమిటీ హెచ్చరిక
- ✻ 26న జరిగే సదస్సును విజయవంతం చేయాలని పిలుపు



**ప్రజాపక్షం/జవహర్‌నగర్:**జవహర్‌నగర్ జిహెచ్ఎంసి డంపింగ్ యార్డు బాధిత ప్రాంతాల ప్రజలపై జరుగుతున్న అన్ని రకాల బెదిరింపులను రాంకీ యాజమాన్యం వెంటనే మానుకోవాలని జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి తీవ్రంగా హెచ్చరించారు. ఈ నెల 26న డంపింగ్ యార్డు సమస్యపై నిర్వహించతలపెట్టిన సదస్సును విజయవంతం చేసేందుకు బుధవారం ఒక సన్నాహక సమావేశం జరిగింది. ఐఎఫ్‌టియు కోశాధికారి పి.శివబాబు, టియుసిఐ కో కన్వీనర్ వి. ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో షేక్ షావలి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. గత మంగళవారం (జూలై14, 2026) సాయంత్రం ఆర్‌డిt, ఎమ్మార్వో, ఆర్.ఐ. సమక్షంలోనే రాంకీ డంపింగ్ యార్డు జనరల్ మేనేజర్ (జిఎం) శ్రీనివాస్ కార్మిక నగర్ ప్రజలను బెదిరింపులకు గురిచేయడాన్ని పోరాట కమిటీ తీవ్రంగా ఖండించింది. డంపింగ్ యార్డును ఆనుకుని ఉన్న కార్మిక నగర్‌లోని సామాన్య, పేద ప్రజలను వారి నివాస స్థలాల నుండి బలవంతంగా వెళ్లగొట్టేందుకు కుట్రలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. అర్ధరాత్రి వేళ దుర్వాసన వెదజల్లే చెత్త మురుగు నీటి పైపును పగులగొట్టి, కక్షపూరితంగా కార్మిక నగర్ వాసుల ఇళ్లలోకి, ప్రధాన రహదారిపైకి మురుగునీరు చేరేలా చేసిన జిఎం శ్రీనివాస్ చర్యలు మానవత్వానికే మాయని మచ్చని పోరాట కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది.

**ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి**

పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య భద్రత కోసం డంపింగ్ యార్డును శాశ్వతంగా ఎత్తివేయాలని ప్రజలు శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళనలు చేస్తుంటే.. అధికారులు, రాంకీ యాజమాన్యం కలిసి ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారని నేతలు మండిపడ్డారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి, ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న రాంకీ జిఎం శ్రీనివాస్‌తో పాటు బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సన్నాహక సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాల్గొన్న వారిలో కారింగుల శంకర్ గౌడ్ మాజీ సర్పంచ్, రావల్ కోల్ నర్సింహ్మా గౌడ్ మాజీ ఉప సర్పంచ్, అనంత లక్ష్మి మహిళా కాంగ్రెస్ కో కన్వీనర్, మేక లలిత యాదవ్ బిఆర్ఎస్ జాగృతి, బద్రగామి ఆంజనేయులు టిజేఎస్,టి.శంకర్ (సిపిఐ), గడ్డం సదానందం సిపిఐఎంఎల్ మాస్‌లైన్ చర్చల చంద్రన్న ప్రసాద్ టియుజెఎసి,జయ సిఎంఎస్, పెర్క సునీత పిఓడబ్ల్యూ విముక్తి మహ్మద్ మహాషామియా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్, మోఇన్‌ఆమ్ ఆద్మీ పార్టీ, పోరాట కమిటీ సభ్యులు, కార్మిక నగర్ నివాసులు పాల్గొన్నారు.

## పార్టీలో పనిచేస్తున్న వారికి కాంగ్రెస్ న్యాయం చేసింది

### నవాబుపేట్ మండల సర్పంచుల అధ్యక్షుడు కొండల్ యాదవ్

**ప్రజాపక్షం/నవాబుపేట్:** గ్రామాలలో సర్పంచులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి సమస్యను పరిష్కరించి ప్రభుత్వం ద్వారా తీర్చే విధంగా ముందుకు వెళ్తానని నవాబుపేట మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కావాలి కొండల్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవాబుపేట్ మండలంలోని గ్రామాలలో సర్పంచులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి సమస్యను పరిష్కరించి ప్రభుత్వం ద్వారా తీర్చే విధంగా ముందుకు వెళ్తానని తెలిపారు నిన్న మొన్న వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వకుండా పార్టీ జెండా మోసిన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేసిందని తెలిపారు. మండలంలో ఎన్ని పార్టీలు ఉన్నా కాంగ్రెస్ పార్టీకి సాటి లేదన్నారు. అదే విధంగా అతి చిన్న వయసులో మండల గ్రామాల సర్పంచ్ లు నా మీద నమ్మకంతో నన్ను సర్పంచుల అధ్యక్షుడిగా నియమించినప్పటి నుండి గ్రామాల అభివృద్ధికి కృషి చేయ డానికి దేనికైనా సిద్ధం అని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పిసిసి మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా మండల అధ్యక్షుడిగా సామ వెంకట్ రెడ్డికి ఆర్డర్ కాపీ ఇచ్చి న్యాయం చేశారని తెలిపారు. మండల అధ్యక్షుడు మండలంలోని పలు గ్రామాలకు అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చి మండలాన్ని అభివృద్ధి పరిచే విధంగా కృషి చేసే విధంగా ముందుకు సాగుతాడని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండుసార్లు సర్పంచిగా పనిచేసే తిమ్మారెడ్డిపల్లిలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న సామ వెంకట్ రెడ్డికి పదవి రావడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. పార్టీ సీనియర్ నాయకులతో కలిసి ఇద్దరం మండల అదే విధంగా గ్రామాల ప్రజలకు న్యాయం జరిగే విధంగా అధిక నిధులను తీసుకొచ్చి అభివృద్ధి పథంలో నడిపించే విధంగా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు.




## బ్లాక్‌మెయిలింగ్ చేసే బోగస్ విద్యార్థి సంఘాలపై చర్యలు

### విద్యాసంస్థల కరస్పాండెంట్లతో డిసిపి సురేష్ కుమార్

**ప్రజాపక్షం/ఉప్పల్:** బెదిరింపులతో బ్లాక్‌మెయిలింగ్ చేస్తూ డబ్బులు వసూలు చేసే లక్ష్యంగా ప్రవేశించే బోగస్ విద్యార్థి సంఘాలకు ప్రయివేట్ విద్యా సంస్థల్లోకి ప్రవేశాలను అరికట్టాలంటూ ఉప్పల్ ప్రయివేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పోలీసు అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం విద్యాసంస్థల కరస్పాండెంట్లు విజయేందర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, సతీష్, షేక్ మదార్, శ్రీధర్, కిరణ్ కుమార్, తదితరులు డిసిపి సురేష్‌కుమార్, ఉప్పల్ ఏసిపి వెంకటరెడ్డిలను కల్సి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఇకపై ముందస్తు అనుమతులు లేకుండా విద్యాసంస్థలోనికి ఎలాంటి విద్యార్థి సంఘాలకు అనుమతించవద్దని, అలాచేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకొంటామని డిసిపి తెలిపారు. ఈ మేరకు విద్యాసంస్థ గేట్ల వద్ద హెచ్చరిక, సూచనలతో కూడిన నోటీసు బోర్డును ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యాసంస్థల భద్రత దృష్ట్యా సంబంధిత చట్టాల గురించి ఆయన కరస్పాండెంట్లకు వివరించారు.



## ప్రభుత్వ స్థలాలను స్వాధీన పరుచుకోవాలి

### సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ మండలంలోని ప్రభుత్వ స్థలాలను కబ్జాకు గురికాకుండా స్వాధీన పరుచుకోవాలని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా సిపిఐ కార్యదర్శి ఉమామహేశ్ డిమాండ్ చేశారు. గాజులరామారం, దేవేందర్ నగర్‌లోని కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ కార్యాలయంలో మండల తహశీల్దార్ బైరెడ్డి రాజేశ్‌ని కలిసిన ఉమామహేశ్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్ మాట్లాడుతూ మండలంలోని జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన సర్వేనంబరు 348/1లోని ప్రభుత్వ స్థలాన్ని స్వాధీన పరుచుకోవాలని హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు. గాజులరామారంలోని స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ భూములను ఆర్టీసీ, పోలీస్ అకాడమి విభాగాలకు కేటాయించినప్పటికీ కబ్జాదారులు లక్షలాది రూపాయలకు అమాయక ప్రజలకు విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారని అన్నారు. అమాయక ప్రజలు ప్రభుత్వ స్థలాలను కొనుగోలు చేసి కబ్జాదారుల చేతిలో మోసపోతున్నారని, అట్టి భూములను సైతం వెంటనే స్వాధీన పరుచుకోవాలని, పేట్‌బషీరాబాద్ సర్వేనంబరు 5లో జరుగుతున్న ఆక్రమణలపై స్పందించాలని కోరారు. సిపిఐ ఆధ్వర్యంలో పేదల కోసం గుడిసెలు వేసి పంచితే ప్రభుత్వ అధికారులు కూల్చివేసి లక్షలాది రూపాయలకు అమ్ముకుంటున్న కబ్జాదారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేరని ప్రశ్నించారు. రాబోవు రోజుల్లో ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు లేనివారికి ప్రజలను సమీకరించి రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు సెప్టెంబర్ మాసంలో భూ పోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్, కార్యవర్గ సభ్యులు నర్సింహారెడ్డి, కనకయ్య, కృష్ణ, కార్తీక్ పాల్గొన్నారు.



## ఓటరు నమోదుకు స్వచ్ఛంద సేవా స్ఫూర్తి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం విజయవంతానికి స్వచ్ఛంద సంస్థలు వాలంటీర్ల భాగస్వామ్యం కీలకమని ఘట్‌కేసర్ తహసీల్దారు చంద్రశేఖర్ అన్నారు. పోచారం డివిజన్ చౌదరిగూడ పరిధిలోని వేంకటాద్రి టౌన్‌షిప్, స్వర్ణగిరి, విజయపురి తదితర కాలనీల్లో స్ఫూర్తి సంస్థ ఆధ్వర్యంలో కొండాపూర్ విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన సుమారు 40 మంది జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వాలంటీర్లు బూత్ స్థాయి అధికారులతో కలిసి ఓటర్ల గణన పత్రాలు నింపించడం ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దారు చంద్రశేఖర్ పరిశీలించారు. ప్రజల్లో ఎన్నికల అవగాహన పెంచడంతో పాటు ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా స్వచ్ఛంద సంస్థ లు సేవాభావంతో పనిచేయాలని తహసీల్దారు చంద్రశేఖర్ సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కావ్య, స్ఫూర్తి సంస్థ అధ్యక్షుడు కుంటోళ్ల యాదగిరి, విజ్ఞాన్ కళాశాల విద్యా సంచాలకుడు కోటేశ్వరరావు, బూత్ స్థాయి అధికారులు, జాతీయ సేవా పథకం వాలంటీర్లు పాల్గొన్నారు.





## దేశ నిర్మాణ కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం

### 'మై భారత్ పోర్టల్' పోస్టర్లను ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన దేశ నిర్మాణ కార్యక్రమాల్లో యువత భాగస్వాములను చేసే లక్ష్యంగా ఆసక్తి కలిగిన వారంతా మై భారత్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ కోరారు. బుధవారం ఆయన ఈ పోర్టల్‌కు సంబంధించిన పోస్టర్లను జిల్లా మై భారత్ డిప్యూటి డైరెక్టర్ స్నేహల్ బసుత్కర్‌తో కల్సి ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సేవ, అనుభవ పూర్వక అభ్యాసం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సేవల్లో ఆసక్తి కలిగి ఉన్న 15 నుండి 29 ఏళ్ల వయస్సున్న యువతీ యువకులు తమ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే వివిధ యువజన కేంద్రీకృత కార్యక్రమాల్లో వీరంతా పాల్గొనేందుకు వేదికగా అవకాశం ఏర్పడుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా జరుగుతున్న ఈ నమోదు కార్యక్రమంలో విద్యా సంస్థలు, ప్రభుత్వ శాఖలు, యువజన సంఘాలు, ఎన్ఎస్ఎస్ యూనిట్లు చురుకుగా పాల్గొని అధియ సంఖ్యలో యువత నమోదు చేసుకొనేలా చూడాలని ఆయన కోరారు. దీని కోసం ముందుగా తమ మొబైల్ ఫోన్లలో మై భారత్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తమ ఫోన్ నంబరు కానీ ఈ మెయిల్ కానీ ఇచ్చి ఒటిపి నమోదు చేయాలన్నారు. ఆ తర్వాత తమ పేరు, పుట్టిన తేదీ, చిరునామా తదితర వివరాలు సమర్పించటం ద్వారా ఈ పోర్టల్‌లో నమోదు చేసుకొని భారత ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొన వచ్చన్నారు.

## మరో 18రోజులు 'సర్'

### ఆగస్టు 3వరకు పెంచిన ఎన్నికల సంఘం



**ప్రజాపక్షం/వికారాబాద్ :** ఒక నెలలో లక్షలాదిమంది ఓటర్ల జాబితా క్షేత్రస్థాయిలో పరిశీలించాలి, ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయాలి, పూర్తి చేసిన వాటిని సేకరించాలి,వివరాలను తనిఖీ చేయాలి,అనంతరం మ్యాపింగ్ చేయాలి ఇదే లక్ష్యంతో కలెక్టర్ నుంచి బిఎల్‌ఓ వరకు పరుగులు తీశారు. ప్రధానంగా శనివారం, అదివారం రోజున పనిచేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆగస్టు 3వర కు పొడిగించడంతో జిల్లా యంత్రాగానికి కాస్త ఉపశమనం లభించింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర జాబితా సవరణ ప్రక్రియ మరో 18రోజులు పాటు కొనసాగనుంది. జిలాల్లలో ఇప్పటికీ పలువు రు ఓటర్లు త మ ఎన్యూమరేషన్ ఫారాలను నింపి బిఎల్‌ఒలకు తిరిగి ఇవ్వకపోవడంతో మరోవైపు డేటా ఎంట్రీ పెండింగ్ ఉండటంతో కేంద్ర ఎన్నికల సంఘం ఆగస్టు 3వరకు పొడగించింది. వికారాబాద్ జిల్లాలో వందశాతం పూర్తి చేయడానికి జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షిస్తుందన్నారు. తాండూర్, వికారాబాద్, పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ డిజిటలైజేషన్ వెనుకబడి ఉంది అని అధికారులు తెలిపారు. ఇప్పటికైన ఓటర్లు స్పందించి తమ ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే అందజేయాలని,అలాగే బిఎల్‌ఒలు మిగిలిన కొద్దిపాటిపెండింగ్‌ను యుద్ధ ప్రాతిపదికన డిజిటలైజేషన్ చేయాలని అధికారులు కలెక్టన్ అదేశించారు.

12
ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
గురువారం
16-07-2026
www.prajapaksham.in

‘చెన్నై లవ్ స్టోరీ’ సినిమా తన కెరీర్ లో మరో గోప సినిమాగా నిలిచిపోతుందని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. కిరణ్ అబ్బవరం జన్మదిన వేడుకలు ఎఫ్ ఎన్ సి సి లో ఘనంగా జరిగాయి.




హీరో కిరణ్ అబ్బవరం

## ‘చెన్నై లవ్ స్టోరీ’ నా కెరీర్‌లో గొప్ప సినిమా

చెన్నై లవ్ స్టోరీ’ సినిమా తన కెరీర్ లో మరో గోప సినిమాగా నిలిచిపోతుందని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. కిరణ్ సబ్బవరం జన్మదిన వేడుకలు ఎఫ్ ఎన్ సి సి లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భాంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ఈ సినిమా స్టోరీ చెప్పగానే ఖచ్చితంగా చేయాలనీ అనుకున్నానని చెప్పారు. సాయిరాజేష్ ఇచ్చిన కథ, ఎస్ కె ఎన్ లాంటి నిర్మాత నాకు దొరకడం భావిస్తున్నానని అన్నారు. చెన్నైలో జరిగే ఒక ప్రేమ కథ అని తెలిపారు. ఇంతకు ముందు తన సినిమాలను ఆదరించినట్టే ఈ సినిమాను కూడా ప్రేక్షకులు ఆదరిస్తారని , ఆదరించాలని కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు. ఈ ప్రేమ కథ చాలా కొత్తగా ఉంటుందన్నారు. ఈ మధ్య కాలంలో వచ్చిన సినిమాలకు చాలా భిన్నంగా ఉంటుందని చెప్పారు. ప్రతీ క్యారెక్టర్‌కు జెస్టిఫికేషన్ ఉంటుందన్నారు. మణిశర్మ ఇచ్చిన మ్యూజిక్ ఇప్పటికే శ్రోతలను అలరిస్తుందని , ఈ సినిమాకు మ్యూజిక్ ఎంతో ప్లస్ అవుతుందని తెలిపారు. కిరణ్ అబ్బవరం ఈ కథకు కిరణ్ మాత్రమే సూట్ అవుతాడని అనుకున్నామని కథ రచయిత సాయి రాజేష్ చెప్పారు. నిర్మాత ఎస్ కె ఎన్ మాట్లాడుతూ 24న సినేమాను విడుదల చేస్తున్నామని అన్నారు. ప్రొ డక్షన్ పరంగా అన్ని విధాలుగా సం ఉన్నామని చెప్పారు. ఈ వేడుకల్లో హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ , సహ నిర్మాత ధీరజ్ మొగిలినేని , రవి పాల్గొన్నారు.

## ‘వదలా’ మూవీని సక్సెస్ చేయండి

### ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అనిల్ రావిపూడి

చరిత చిత్ర బ్యానర్ మీద కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం ‘వదలా’. జగపతి బాబు, లయ, హృతిక శ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో ఆకెళ్ల వి కృష్ణ ఈ సినిమాని తెరకెక్కించారు. ఈ మూవీని జూలై 17న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెన్సేషనల్ డైరెక్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ ఈవెంట్లో అనిల్ రావిపూడి మాట్లాడుతూ ‘తెలుగు ఇండస్ట్రీలోకి నిర్మాతగా వస్తున్న కిషోర్ కి థాంక్స్. ‘వదలా’ చిత్రంతో నిర్మాత కిషోర్ కి మంచి విజయం దక్కాలి. తమ్మారెడ్డి, జగపతి బాబు మీదున్న ప్రేమ, గౌరవంతో ఇక్కడకు వచ్చాను. ‘వదలా’ ట్రైలర్ నాకు చాలా నచ్చింది. కాన్సెప్ట్, కథ చాలా కొత్తగా అనిపించింది. పాటలు నాకు చాలా నచ్చాయి. ట్రైలర్ను చూస్తే అందరూ సహజంగా నటించారని అర్థం అవుతోంది. చోటా గారు అందరికీ సన్నిహితులు. ఆయన విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. తమ్మారెడ్డి ఏదైనా సరే కుండ బద్దలు కొట్టినట్టు కాదు..



ముక్కలు చేసినట్టుగా మాట్లాడతారు. జగపతి బాబు అంటే ఫ్యామిలీ హీరో. జగపతి బాబు అన్ని రకాల పాత్రల్ని, సినిమాలను చేశారు. జూలై 17న అందరూ ‘వదలా’ మూవీని చూసి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు.జగపతి బాబు మాట్లాడుతూ ‘వదలా’ లాంటి థ్రిల్లర్ మూవీని చేయడం ఆనందంగా ఉంది. ఇదొక ఫ్యామిలీ ఎమోషనల్ థ్రిల్లర్. ఈ మూవీలో విషయం ఉంది, కంటెంట్ ఉంది అని నమ్మాను. అందుకే ప్రతీ విషయంలో నేను జాగ్రత్తగా తీసుకున్నాను. ఈ ‘వదలా’ చిత్రాన్ని వదలకుండా నాకోసం చూడండి. ఈ సినిమాకి ఇంకా బిజినెస్ కాలేదు. మా తమ్మారెడ్డి , కిషోర్ ధైర్యంతో ముందు అడుగు వేశారు. అన్నారు.నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ ‘సినిమా ఇండస్ట్రీలోకి వచ్చి యాభై ఏళ్లు అవుతోంది. ఓ పదేళ్ల క్రితం వైరాగ్యంతో సినీ సన్యాసం తీసుకుంటే.. కిశోర్ గారు మాత్రం ‘వదలా’ అనే సినిమా నిర్మించాల్సిందే అని పట్టు పట్టారు. పన్నెండేళ్ల క్రితం మేకింగ్ ఆపేశాను. ఈ కార్యక్రమంలో నిర్మాత కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, ‘రాజు వెడ్స్ రాంబాయి’ నిర్మాత నాగేశ్వర్ రావు, హీరోయిన్ హృతిక శ్రీనివాస్, సంగీత దర్శకుడు కార్తీక్ బి. కొడకండ్ల, కెమెరామెన్ చోటా కె. నాయుడు, గేయ రచయితలు కృష్ణవేణి మల్లవజ్జల, శివకృష్ణాచారి ఎర్రోజు, వీరు గడ్డం పాల్గొన్నారు.

## ‘రోమాంచకం’ కొత్త పోస్టర్ రిలీజ్



సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా ‘రోమాంచకం‘. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణు గోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ‘రోమాంచకం‘ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్ ఆడియెన్స్ ను అట్రాక్ట్ చేసి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటున్నాయి. ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా ‘రోమాంచకం‘ సినిమా నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ‘రోమాంచకం‘ సినిమా సుమంత్ ప్రభాస్ కు మంచి ల్యాండ్ మార్క్ మూవీ కాబోతోందనే అంచనాలు ఏర్పడుతున్నాయి. ఈ సినిమా ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపి ప్రేక్షకులను ఉర్రూతలూగించేందుకు వస్తోంది. ‘రోమాంచకం‘ సినిమా ఒక ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ గా రూపొందుతోంది. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్, ఉపేంద్ర లిమయె, వెంకటేష్ కాకుమాను, నరేంద్ర రవి, మణి, సోహన్, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి డీవోపీ పవన్ పప్పుల, మ్యూజిక్ వాసుకి వైభవ్ అందిస్తున్నారు.

## ‘కరుణామయ’ చిత్రం షూటింగ్ షురూ



బాబీ పిక్చర్స్ మీద ప్రొడక్షన్ నెంబర్. 1గా సంకాబత్తుల నాగేశ్వరరావు నిర్మించనున్న చిత్రం ‘కరుణామయ’. చైతన్య శక్తి, స్వాతి శ్రీ జంటగా రాబోతోన్న ఈ సినిమాకి హర్షవర్ధన్ పారెళ్ళ దర్శకత్వం వహించనున్నారు. ఆరాధ్య హైందవి సమర్పణలో ఫ్యామిలీ ఎమోషన్స్‌తో తెరకెక్కుతోంది. ఈ మేరకు నిర్వహించిన పూజా కార్యక్రమాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు వి. వి. వినాయక్ , వి.ఎన్ ఆదిత్య గా ముఖ్య అతిథులుగా హాకరైయ్యారు.. వారి చేతుల మీదుగా ఈ మూవీని లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్మాత సంకాబత్తుల నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రిస్మస్ సందర్భంగా మా సినిమాని ఈ ఏడాది డిసెంబర్ 23న రిలీజ్ చేయాలని అనుకుంటున్నాం అని అన్నారు. దర్శకుడు హర్షవర్ధన్ పారెళ్ళ మాట్లాడుతూ ‘కుటుంబ కథా చిత్రంగా మా ‘కరుణామయ’ తెరకెక్కబోతోంది. తండ్రీ కొడుకు నేపథ్యంలో మంచి ఎమోషన్స్‌తో కూడిన కథ గా సినిమా ఉంటుంది. .ఆగస్ట్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అవుతుంది. పగలు రాత్రి అన్న తేడా లేకుండా టీం మొత్తం కష్టపడతాం. డిసెంబర్ 23న మా మూవీని రిలీజ్ చేస్తామ’ని అన్నారు. హీరోగా చైతన్య శక్తి .హీరోయిన్ స్వాతి శ్రీ .నటిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ : ఆరాధ్య హైందవి,ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : మోనిక.



## 23న వస్తున్న ‘జన నాయకుడు’

తమిళ ముఖ్యమంత్రి విజయ్ హీరోగా నటించిన జన నయగన్ సినిమా తెలుగులో జన నాయకుడు పేరుతో విడుదల కానుంది. తమిళ నాడు ఎన్నికలకు ముందు ఆగిపోయిన ఈ సినిమాను విజయ్ ముఖ్యమంత్రి అయిన తరువాత విడుదల చేస్తున్నారు. ఇటీవలే సెన్సార్ క్లియరెన్స్ కూడా వచ్చిన నేపథ్యంలో ఈనెల 23వ తేదీన తమిళంలో జననయగన్ సినిమాను విడుదల చేస్తున్నారు. అదేరోజు తెలుగులో జన నాయకుడు పేరుతో విడుదల కానుంది. వినాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన పొలిటికల్ థ్రిల్లర్ సినిమా ఇది. విజయ్ సరసన , మమిత బైజు, పూజ హెగ్డే హీరోయిన్లుగా నటించారు. . కె వి ఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రానికి అనిరుద్ సంగీతం అందించారు. టి సిరీస్ సంస్థ ఈ సినిమా పాటలను విడుదల చేసింది. కచ్చితంగా ఈ సినిమా సంచలన విజయం సాధిస్తుందని నిర్మాతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ‘ఓ. సుకుమారి’ పర్ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

యంగ్ హీరో తిరువీర్, హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ విలేజ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ’ఓ. సుకుమారి’తో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. జులై 17న ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హీరో తిరువీర్ విలేకరుల తో ‘చిట్ చాట్ ’నిర్వహించారు. ఐశ్వర్య రాజేష్ , నిత్యా మీనన్ లాంటి మంచి నటీమణులతో పనిచేయడం ఎప్పుడూ ఛాలెంజింగ్గా ఉంటుంది. వాళ్లతో కలిసి పనిచేసినప్పుడు మన నటన కూడా మరింత మెరుగవుతుంది.ఇంతకుముందు ఐశ్వర్యతో ’టక్ జగదీష్’ సినిమాలో పనిచేశాను. కానీ హీరో, హీరోయిన్‌గా కలిసి నటించడం మాత్రం ఈ సినిమాతోనే జరిగింది. ఈ సినిమాలో పనిచేసిన చాలామందితో గతంలోనే కలిసి పనిచేయడం వల్ల సెట్‌లో చాలా కంఫర్ట్‌గా అనిపించింది.ఐశ్వర్యతో సీన్స్ చేసేటప్పుడు చాలా విషయాలు చర్చించేవాళ్లం. ఆమె తన అనుభవాలను నాతో పంచుకునేవారు. అది నాకు చాలా ఉపయోగపడింది.మా దర్శకుడు భరత్ దర్శన్ సిద్ధిపేటకు చెందిన వారు. ఈ మధ్యకాలంలో చాలా మంది దర్శకులు తమ ప్రాంతాల కథలు, పాత్రలను చెప్పడానికి ఆసక్తి చూపుతున్నారు. నిజానికి ఇది ఒక అరుదైన పరిస్థితి ఆధారంగా రూపొందించిన కథ. ఇందులోని కాన్సె చాలా కొత్తగా ఉంటుంది.ఇది పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఎంత నవ్విస్తుందో, అంతే భావోద్వేగానికి గురి చేస్తుంది. మంచి హ్యూమర్‌తో పాటు భావోద్వేగాలు కూడా ప్రేక్షకులను కదిలిస్తాయి. ఒక మంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా అందరికీ నచ్చుతుంది.నాటకం ఒక ప్రత్యేకమైన ప్రక్రియ. సినిమా మరో ప్రత్యేకమైన మాధ్యమం. నాటకాలు రాసేటప్పుడు ఒక చిన్న కథను తీసుకుని నటీనటులతో కలిసి ఇంప్రొవైజ్ చేసేవాడిని. సినిమా అనేది చాలా పెద్ద బాధ్యత, భారీ వ్యయంతో కూడుకున్నది. ప్రస్తుతం నటనపైనే పూర్తిగా దృష్టి పెట్టాను. ’భగవంతుడు’తో పాటు మరో రెండు సినిమాలు చేస్తున్నాను. అలాగే అమెజాన్ ప్రైమ్ కోసం ఒక వెబ్ సిరీస్ కూడా చేస్తున్నాను.


హీరో తిరువీర్

# విద్యలో రాణించకపోతే క్రీడల్లో రాణించాలి

### గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేనందునే ప్రైవేటు వైపు మెగ్గు

### వనపర్తి జిల్లా కొత్తకోటలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల భవనం ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి / కొత్తకోట :** గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపోవడం కారణంగానే విద్యార్థులు చేరలేదని, అధిక శాతం మంది ప్రైవేటు స్కూళ్ల వైపు మళ్లారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్కారు బడులపై ప్రత్యేక దృష్టిసారించామని, ఉపాధ్యాయుల సిబ్బంది సమస్యలు పరిష్కరించామని సిఎం తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని, విద్యలో రాణించకపోతే క్రీడల్లో రాణించాలన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలోని రూ.1.77 కోట్ల (సీఎస్ఆర్ నిధులతో) వ్యయంతో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభిచారు. ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి స్థానిక శాసనసభ్యులు జి.మధుసూదన్‌రెడ్డి తో కలిసి పాఠశాలతో పాటు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రూ.1.45 కోట్ల వ్యయంతో 4,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు కురుమూర్తి రాయలిఫ్ట్ ఇరిగేషన్, రూ.92 లక్షల వ్యయంతో 3,100 ఎకరాలకు సాగునీరు అందించే నెల్విడి లిఫ్ట్ ఇరిగేషన్ నిర్వహణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.1.94 కోట్ల వ్యయంతో 4,200 ఎకరాలకు సాగునీరు అందించే సరళ సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్వహణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ఫర్‌ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్2.0లో దేశంలోనే తెలంగాణ రాష్ట్రానికి 18 స్థానం వచ్చిందన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆయన ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారించామన్నారు. విద్యార్థులకు తెలంగాణ విద్యా కిట్ కింద 9 వస్తువులు అందించేందుకు నిర్ణయం తీసుకున్నామని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. రూ.1000 కోట్లతో 27,50,000 మంది విద్యార్థులకు ఆగస్టు 15వ తేదీలోపు ఈ కిట్‌ను ఇవ్వనున్నట్లుగా వెల్లడించారు. ఒక్కో విద్యార్థి చదువు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.8లక్షలు ఖర్చు చేస్తుందని వివరించారు. ఒకప్పుడు స్టడీటూర్‌కు ఐఎఎస్‌లు వెళ్లేవారని, ఈ ఏడాది టీచర్లను స్టడీటూర్‌కు సింగపూర్, సౌత్ కొరియా లాంటి దేశాలకు పంపించామని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ‘ఒక్కో విద్యార్థిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.1.08లక్షలు ఖర్చు చేస్తోంది. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలి. విద్యలో రాణించకపోతే క్రీడల్లో రాణించాలి. క్రీడాకారులు మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్‌కు గ్రూప్–1 ఉద్యోగాలు ఇచ్చాం. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి. విద్యార్థులు మైదానాల్లోనూ పోటీపడాలి. మీ భవిష్యత్‌కు నాదీ హామీ. క్రీడల్లో రాణించేవారిని ఉన్నతస్థాయిలో నిలిపే బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతాం’ అని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లురవి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునితా రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివ సేన రెడ్డి, ఇతర కార్పోరేషన్ల చైర్మన్లు సరితా తిరుపతయ్య, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, కొత్తకోట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పల్లవి సునీతా , ఇతర ప్రజా ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**అమరరాజా యూనిట్ ప్రారంభం**

అంతకుముందు మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజ సంస్థ చేపట్టిన ’సెల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ యూనిట్’ను సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి కోసం గత ప్రభుత్వాలు చేసిన పాలసీలను మరింత మెరుగుపరిచామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అమరరాజా సంస్థ మహబూబ్‌నగర్‌లో పెట్టడం ఆ జిల్లా ప్రజలకు గర్వకారణమని రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ సంస్థతో పోటీ పడేది దేశంలో ఏదీ లేదన్నారు. చైనాతో పోటీ పడే అమరరాజా సంస్థకు సంపూర్ణంగా సహకరిస్తున్నామని వివరించారు. వికసిత్ భారత్ 2047 కల్లా 3 ట్రిలియన్ డాలర్లకు చేరడమే లక్ష్యమన్న సిఎం, అమర రాజ సంస్థ తన లక్ష్యానికి సహకరిస్తుందని వివరించారు.

## నిరంతర సంప్రదింపులు

**(మొదటి పేజీ తరువాయి)**



ప్రస్తుతం లైనింగ్ పనులు కొనసాగుతున్నాయని మంత్రి వివరించారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పరిహారాన్ని త్వరగా విడుదల చేయాలని మంత్రి తుమ్మల కోరారు. అశ్వారావుపేట, సత్తుపల్లి ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ సాగు ఎక్కువగా ఉన్నందున సంప్రదాయ కాలువల స్థానంలో పైపుల ద్వారా సాగునీటి సరఫరా (పైప్డ్ ఇరిగేషన్) సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. సీతారామ ప్రధాన కాలువలో నిలిచిపోయిన జూలూరుపాడు సొరంగం పనులను త్వరగా ప్రారంభించాలని ఈ పనులు పూర్తయితే పాలేరు జలాశయానికి నీటిని అందించే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా ఖమ్మం జిల్లాలో సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయని తెలిపారు.

## ‘సుప్రీం’ ఆందోళన

**(మొదటి పేజీ తరువాయి)**

ఉన్న తీవ్ర అసహనాన్ని గమనించండి’ అని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది.అలాగే ఈ కేసు వ్యవహారంలో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సహాయాన్ని కోరింది.న్యాయమూర్తులు జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలు కూడా ప్రాతినిథ్యం వహిస్తున్న ఈ ధర్మాసనం డిజిటల్ మూల్యాంకన ప్రక్రియలో వ్యవస్థాగతమైన, ‘క్రమంగా పెరుగుతోన్న సమస్యలు’ ఉన్నట్లు కనిపిస్తున్నదని పేర్కొంది. ‘మేం మీ సహాయం కోరుతున్నది విరోధ భావంతో కాదు. కొన్ని సమస్యలున్నాయి’ అని జస్టిస్ బాగ్చీ సొలిసిటర్ జనరల్‌తో చెప్పి, కేసు స్థితిగతులపై నివేదిక కోరారు. పిటీషన్‌లో పేర్కొన్న వ్యక్తిగత మార్కెట్ షీట్ వ్యత్యాసాలు చాలా వరకు పరిష్కరించబడినప్పటికీ, ప్రభుత్వం వ్యవస్థాగత సమస్యలను తీవ్రంగా పరిగణిస్తోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి తెలియజేశారు. మూల్యాంకన వ్యవస్థను సమీక్షించి, అవసరమైన వ్యవస్థాగత మార్పులను సిఫార్సు చేయడానికి ఎస్.రాధా చౌహాన్ నేతృత్వంలో ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సిబిఎస్ఇ తీసుకుంటున్న చర్యల గురించి తమకు తెలియజేయాలని ధర్మాసనం ఇప్పుడు సొలిసిటర్ జనరల్‌ను కోరింది. కాగా, తదుపరి విచారణ కోసం ఈ విషయాన్ని వచ్చే వారానికి జాబితా చేసింది. న్యాయవాది లక్ష్మీకాంత్ మాతాదన్ శుక్లా ద్వారా రాకేష్ బింజోలా ఈ ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. సిబిఎస్ఇ మూల్యాంకన విధానం ద్వారా సిబిఎస్ఇ బోర్డు పరీక్షలను నిర్వహించడానికి నిబంధనలను రూపొందించాలని, అలాగే అటువంటి సంస్కరణలను పర్యవేక్షించి, అమలు చేయడానికి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని, సిబిఎస్ఇని ఆదేశించాలని ఈ పిటిషన్ కోరుతోంది.ఇప్పటికే తాత్కాలిక ప్రవేశాలు పొందిన లేదా ప్రవేశ పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు కనీస అర్హత మార్కులలో సడలింపు ఇవ్వాలని, అలాగే వివిధ కోర్సులలో ప్రవేశానికి నిర్దేశించిన 75శాతం లేదా ఇతర కనీస 12వ తరగతి మార్కుల ప్రమాణం నుంచి మినహాయింపు ఇవ్వాలని కూడా పిటిషనర్ సుప్రీంకోర్టు నుంచి ఆదేశాలను కోరారు.

## దారుణ హత్యలు

**(మొదటి పేజీ తరువాయి)**

వచ్చి ఒక్కసారిగా అతని ఆటోను అడ్డుకున్నారు. ఆటోలో ఉన్న అస్లంపై కత్తులతో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. అతని మెడ, కడుపు భాగంలో కత్తులతో బలంగా పొడిచి తీవ్రంగా గాయపర్చారు. అక్కడి నుండి క్షణాల్లో పరారయ్యారు. తీవ్ర రక్తస్రావంతో పడిపోయిన యువకుడిని గమనించిన స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అయితే అత్యవసర విభాగం వైద్యులు పరీక్షించి, అప్పటికే అస్లం మృతి చెందినట్లు ధృవీకరించారు.

**వ్యక్తిగత కారణాలే హత్యకు కారణం :**

అందిన వెంటనే నిర్మల్ డిఎస్‌పి శ్రీనివాస్ పోలీసు బలగాలతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరించారు. ఈ ఘోర హత్యపై జిల్లా ఎస్‌పి డాక్టర్ జి. జానకి షర్మిల ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ కాలనీలో జరిగిన ఈ హత్య ఘటన ప్రాథమిక విచారణలో మృతుడి వ్యక్తిగత కారణాల వల్లే జరిగినట్లు గుర్తించామని తెలియజేశారు. ఈ దారుణానికి ఒడిగట్టి పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను పోలీసులు ఇప్పటికే చాకచక్యంగా గుర్తించారని పేర్కొన్నారు.ఈ కేసు దర్యాప్తును పోలీసులు అత్యంత వేగంగా, అన్ని కోణాల్లో సమగ్రంగా కొనసాగిస్తున్నారని, నిందితులను త్వరలోనే అరెస్ట్ చేసి కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని ఎస్‌పి జానకి షర్మిల స్పష్టం చేశారు.

**ప్రేమ వ్యవహారానికి అండగా నిలిచాడని మేనమామను దారుణ హత్య**

మంచిర్యాల జిల్లా రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామ శివారులో వేమునూరీ స్వామి అనే కూలీని ఆయన అల్లుళ్ల గొడ్డలితో నరికి దారుణంగా హత్య చేశారు.ప్రేమ వ్యవహారంపై కుటుంబంలో తలెత్తిన విభేదాల కారణంగానే ఈ హత్య జరిగినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. వివరాల్లోకి వెళితే...నారాయణపూర్ గ్రామపంచాయతీ ఎస్‌సి కాలనీకి చెందిన స్వామి తన అన్న కుమారుడు, అక్క కుమార్తె ప్రేమ వ్యవహారానికి అండగా నిలిచాడు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని అక్క కుమారులు కక్ష పెంచుకుని వరుసకు మేనమామ అయిన స్వామిని కల్లు తాగుదామని చెప్పి మంగళవారం రాత్రి ఇంటి నుండి తీసుకువెళ్లారు. గ్రామ శివారుకు చేరుకున్నాక మెడపై గొడ్డలితో నరికి దారుణంగా హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని పొదల్లో పడవేశారు. మృతుడి భార్య ఇచ్చిన వివరాల ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం సహాయంతో పూర్తి వివరాలను రాబడుతున్నారు. మృతుడి శరీరాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు సబ్ ఇన్స్‌పెక్టర్ వెంకటకృష్ణ తెలిపారు. ఈ దర్యాప్తులో క్లూస్ టీం సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తక్షణం ఎత్తివేయాలి

**(మొదటి పేజీ తరువాయి)**

కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉందని చెప్పారు. క్యూబా ప్రజల జీవనోపాధి హక్కు,అభివృద్ధి హక్కుల ఉల్లంఘనకు తక్షణం స్వస్తి చెప్పాలని కోరారు. అంతర్జాతీయ ఏకాభిప్రాయానికి విరుద్ధంగా అమెరికా ఆంక్షలు విధించిందని విమర్శించారు. అనేక దశాబ్దాలుగా క్యూబాను అణచివేస్తున్న అమెరికా గడచిన మే నెల నుండి మరిన్ని ఆంక్షలతో ఉక్కుపాదం మోపడాన్ని ఆయన వ్యతిరేకించారు. క్యూబాకు చైనా గట్టి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఆరవైఏళ్ళకు పైగా క్యూబాపై అమెరికా సమగ్ర ఆంక్షలు విధించి ఆ దేశాన్ని అభివృద్ధి చెందనీయకుండా అడ్డుపడుతూ వేధింపులకు గురిచేస్తోందని అన్నారు.అమెరికాకు 90 మైళ్ళ దూరంలో ఉన్న క్యూబా దీవిపై ఇటీవల ట్రంప్ ప్రభుత్వం తన ఆంక్షల వేధింపులను ఉద్ధృతం చేయడంతో గతంలో లేనివిధంగా క్యూబాలో పరిస్థితులు,ప్రజల బాధలు అంతర్జాతీయ సమాజం దృష్టిని ఆకర్షించాయని చెప్పారు. అంతర్జాతీయ సమాజం న్యాయబద్ధమైన పిలుపును దృష్టిలో పెట్టుకుని క్యూబాపై ఆంక్షలు ఎత్తివేయాలని ఆయన కోరారు. అనేక నెలలుగా క్యూబా ప్రజలు విద్యుత్,ఇంధన సరఫరాలు లేకుండా ఘోరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. సౌరవిద్యుత్ సహా ప్రత్యామ్నాయ మార్గాలను అభివృద్ధి చేయడం ప్రారంభించారు. కష్టాలను అనుభవాలుగా మలచుకుని వారు కొత్త జీవనం ప్రారంభించినప్పటికీ, క్యూబా మాజీ అధ్యక్షుడు, క్యూబా విప్లవ నాయకుడు ఫైడల్ కాస్ట్రో రౌల్ కాస్ట్రోపై హత్యానేరాలు మోపి అమెరికా బ్లాక్‌మెయిల్ చర్యలకు పాల్పడుతోంది. వెనిజులా మాజీ అధ్యక్షుడు నికొలస్ మదురో తరహాలో రౌల్ కాస్ట్రోను కూడా నేరాభియోగాల పేరుతో కిడ్నాప్ చేసి తీసుకు వెళ్ళేందుకు, క్యూబాను లొంగదీసుకునేందకు ట్రంప్ సామ్రాజ్యవాద కుట్రలు అమలు చేస్తున్నారు. ఇప్పుడు తాజాగా ఇరాన్ ఇస్లామిక్ ప్రభుత్వం క్షిపణులు,డ్రోన్లను క్యూబాలో నిల్వచేసిందని, ఈ విషయంపై తాము దర్యాప్తు చేస్తున్నామని ట్రంప్ తాజా ఆరోపణలు చేయడంతో చైనా వెంటనే స్పందించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com